SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 19 | సంచిక: 200 | ఎడిటర్ : విక్రం కుమార్ | శనివారం 30 మే 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |



# భీం ఆశయాలతో ముందుకెళ్లాలి

**ఆదివాసీ సంస్కృతి, మూలాల పరిరక్షణ అందరి బాధ్యత**



- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
- రౌట సంకెపల్లిలో ఘనంగా 'జల్, జంగల్, జమీన్ స్ఫూర్తి గ్రామోత్సవం 2026'
- గిరిజన కుటుంబాలకు సౌర విద్యుత్ పలకల పంపిణీ.. కాంస్య విగ్రహానికి శంకుస్థాపన
- ఆత్మగౌరవ పోరాటానికి భీం నినాదమే పునాది: మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

2

అమరవీరుడు కుమురం భీం త్యాగం దేశానికే స్ఫూర్తిదాయ కమని, ఆయన ఆశయాలను పునికిపుచ్చుకుని యువతరం ముందుకు సాగాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రౌట సంకెపల్లి గ్రామంలో శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించిన "కుమురం భీమ్ జల్, జంగల్, జమీన్ స్ఫూర్తి గ్రామోత్సవం-2026" కార్యక్రమా నికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమరవీరుడు కుమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన గవర్నర్, అనంతరం అక్కడ ఏర్పాటు చేయనున్న భీం కాంస్య విగ్రహ ప్రతిష్టాపనకు శంకుస్థాపన చేశారు.

- సమయం న్యూస్, ఆసిఫాబాద్

# ఓటరు జాబితాపై అప్రమత్తంగా ఉండాలి

- 'సిర్' ప్రక్రియలో అర్హుల ఓట్లు తొలగిపోకుండా కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలి
- ప్రతి నెల మూడు రోజులు కార్యకర్తలకు సమయం కేటాయించాలి
- మంత్రులకు సీఎం రేవంత్ సూచన



**సమయం న్యూస్, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం గాంధీభవన్‌లో శుక్రవారం పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ) సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పార్టీ నాయకులకు, శ్రేణులకు రెండు ముఖ్యమైన అంశాలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు స్థానికంగా అప్రమత్తంగా ఉండాలని, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కష్టపడాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియలో లంబాడీలు, ఆదివాసీలు, వలస కార్మికులు, మహిళలు, దళితులు మరియు మైనారిటీల ఓట్లు అక్రమంగా తొలగింపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా జాబితా నుండి తొలగించబడకుండా బూత్ స్థాయిలో నిఘా పెట్టాలని, పార్టీ యంత్రాంగం అంతా ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు.

మిగతా 2 లో

# ఫార్మా సిటీ భూసేకరణపై నేడు రైతుల మహాధర్నా

- ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో రైతులు, ప్రజా సంఘాల నిరసన

3






# ఈసెట్ ఫలితాలు విడుదల

- వెబ్‌సైట్‌లోకి ఫలితాలు

2

# ఆర్టీఐ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ ప్రతినిధులు

02





# నీట్ పేపర్ లీకేజీ దోషులను వదలం


వారిని కఠినంగా శిక్షించి తీరుతాం

విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

4

# ఏపీలో గ్రీన్ ఎనర్జీ కారిడార్

- 18 గిగావాట్లను ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానం కోసం 22 వేల కోట్లతో ప్రతిపాదనలు
- ప్రభుత్వ భవనాలపై సోలార్ ఏర్పాటు పనులు త్వరితగతిన చేపట్టాలి
- 2,898 హాస్టళ్లు, స్కూళ్లలో నెట్ జీరో విధానంలో సోలారైజేషన్
- నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పీఎం సూర్యఘర్ అమలు
- విద్యుత్ శాఖపై సమీక్షలో చంద్రబాబు



5



కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్

# యూనిట్

- 200 ఇంటర్ సిటీ రైళ్ల తయారీకి రంగం సిద్ధం
- ప్రధాని మోడీ, మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కిషన్ రెడ్డి కృతజ్ఞతలు

2

# చర్లపల్లి జైలుకు బండి భగీరథ్



హైదరాబాద్, మే 29: పోక్సో కేసులో నిందితుడు బండి భగీరథ్‌కు 3 రోజుల పోలీసు కస్టడీ విచారణ ముగిసింది. 3 రోజుల పోలీస్ కస్టడీ గడువు ముగియడంతో విచారణ తర్వాత మల్కాజిగిరి కోర్టులో హాజరు పర్చారు. అనంతరం కోర్టు ఆదేశాలతో చర్లపల్లి జైలుకు తరలించారు. ప్రధానంగా బాధితురాలితో ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, స్నాప్‌చాట్‌ల లో చాటింగ్‌లకు సంబంధించి కొన్ని ఆధారాలను పోలీసులు ఇప్పటికే సేకరించారు. వాటి ఆధారంగానే భగీరథ్‌ను ప్రశ్నించినట్టు తెలుస్తోంది.

# సైబర్ నేరాల అడ్డుకట్టకు ఏపీ సైబర్ గార్డ్

- పోలీసు శాఖ కార్యాచరణపై సమీక్షలో సీఎం చంద్రబాబు

5

జాతీయ రహదారుల టెండర్లలో

# అక్రమాలు?



- 10.69 కోట్ల టెండర్లపై కేంద్రానికి ఫిర్యాదు
- కేంద్ర విజిలెన్స్ విచారణకు డిమాండ్
- బీజేపీ నేత ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి

5

# మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి కన్నుమూత

- హైదరాబాద్‌లోని నివాసంలో తుదిశ్వాస

2



# కల్తీ మద్యానికి 11 మంది బలి

పలువురి పరిస్థితి విషమం

4





# ఈసెట్ ఫలితాలు విడుదల

## వెబ్‌సైట్‌లో అందుబాటులోకి ఫలితాలు

**హైదరాబాద్, మే 29:** తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల అయ్యాయి. మాసాబ్ ట్యాంక్ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో శుక్రవారం ఉన్నత విద్యా మండలి చైర్మన్, ప్రొఫెసర్ బాలక్రిష్ణ రెడ్డి ఫలితాలను విడుదల చేశారు. ఈసెట్‌లో మొత్తం 16,726 మంది అభ్యర్థులు (93.60 శాతం) క్వాలిఫై అయ్యారు. ఈ సందర్భంగా బాలక్రిష్ణ రెడ్డి మాట్లాడుతూ.. త్వరలోనే కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల చేస్తామని చెప్పారు. జూలై మొదటి వారంలో క్లాసెస్ ప్రారంభం అవుతాయని తెలిపారు. ఫీజులు గత ఏడాది మాదిరిగానే ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగారం, ఈసెట్ కన్వీనర్ ప్రొ.చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు. దీంతో రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ ప్రవేశాలకు ఎదురుచూస్తున్న విద్యార్థుల నిరీక్షణకు తెరపడింది. మే 15న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్ష ఫలితాలు, విద్యార్థుల మార్కుల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా(పాలిటెక్నిక్), బీఎస్సీ(మ్యాథమెటిక్స్) పూర్తిచేసిన విద్యార్థులకు నేరుగా బీటెక్, బీఫార్మసీ కోర్సుల ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు ఈ పరీక్షను ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఫలితాల విడుదల నేపథ్యంలో ఇంజినీరింగ్ కాలేజీల్లో చేరాలనుకునే విద్యార్థుల్లో సందడి నెలకొంది. పరీక్షకు హాజరైన అభ్యర్థులు తమ ఫలితాలను, ర్యాంక్ కార్డులను అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ, రిజిస్ట్రేషన్ నంబర్‌ను నమోదు చేసి స్క్రీన్‌పై ఫైనల్ ర్యాంక్‌ను చూసుకోవచ్చని ఉన్నత విద్యా మండలి అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే కొద్ది రోజుల్లోనే కేటగిరీల వారీగా కౌన్సెలింగ్ తేదీలు, సర్టిఫికేట్ వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్ల నమోదుకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రకటించనుంది. అడ్మిషన్ల ప్రక్రియ ముగిసే వరకు విద్యార్థులు తమ ర్యాంక్ కార్డులను, హాల్ టికెట్లను జాగ్రత్తగా ఉంచుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. కౌన్సెలింగ్‌కు సంబంధించి అప్‌డేట్ల కోసం విద్యార్థులు నిరంతరం అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాల్సిందిగా కోరారు.

# మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి కన్నుమూత

## అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నివాసంలో తుదిశ్వాస

## ఉమ్మడి ఏపీలో దేవాదాయ శాఖ మంత్రిగా సుదీర్ఘ సేవలు

## పలువురు రాజకీయ ప్రముఖుల సంతాపం



**హైదరాబాద్, మే 29:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు గాదె వెంకటరెడ్డి కన్నుమూశారు. గతకొద్ది రోజులుగా వయోభారం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతోన్న ఆయన శుక్రవారం హైదరాబాద్‌లోని నివాసంలో తుదిశ్వాస విడిచారు. వెంకటరెడ్డి మృతిని ఆయన కుటుంబ సభ్యులు ధృవీకరించారు. వెంకటరెడ్డి మరణంపై పలువురు రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1940 జూలై 10న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలో గాదె వెంకటరెడ్డి జన్మించాడు. ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన ఆయన కాంగ్రెస్ పార్టీ రాజకీయ అరంగ్రేటం చేశారు. 1967లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పరుచూరు నియోజకవర్గం నుండి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచాడు. ఆ తరువాత 1972లో కాంగ్రెస్ అభ్యర్థిగా.. 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి రెండు సార్లు మద్దుకూరి నారాయణ రావుపై ఓడిపోయారు. 1983, 1985,1989 ఎన్నికల్లో వరుసగా ఓటమి చవిచూశారు. తిరిగి 1991 ఉప ఎన్నికల్లో అలాగే 1994 సార్వత్రిక ఎన్నికల్లో పరుచూరు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నేదురుమల్లి జనార్ధనరెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశాడు. 1999లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. 2004, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో బాపట్ల నుంచి ఎమ్మెల్యేగా గెలిచి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, కొణిజేటి రోశయ్య మంత్రివర్గంలో దేవాదాయ శాఖ మంత్రిగా పనిచేశాడు. ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత జరిగిన 2014 ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు. సుదీర్ఘకాలం పాటు కాంగ్రెస్?లో పని చేసిన ఆయన 2016 ఏప్రిల్ 29ను హస్తం పార్టీకి వీడ్కోలు పలికి టీడీపీలో చేరారు. నాలుగేండ్ల తర్వాత టీడీపీకి రిజైన్ చేసి 2020 మార్చి 16న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాడు. వయోభారం, అనారోగ్య సమస్యతలతో గత కొద్ది రోజులుగా ఆయన క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు.

# కుమురంభీం ఆశయాలతో ముందుకు సాగాలి

- ఆదివాసీ సంస్కృతి, మూలాల పరిరక్షణ అందరి బాధ్యత
- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
- రౌట సంకెపల్లిలో ఘనంగా "జల్, జంగల్, జమీన్ స్ఫూర్తి గ్రామోత్సవం-2026"
- గిరిజన కుటుంబాలకు సౌర విద్యుత్ పలకల పంపిణీ.. కాంస్య విగ్రహానికి శంకుస్థాపన
- ఆత్మగౌరవ పోరాటానికి భీం నినాదమే పునాది: మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ





**ప్రజానావ, ఆసిఫాబాద్ :** అమరవీరుడు కుమురం భీం త్యాగం దేశానికే స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలను పునికిపుచ్చుకుని యువతరం ముందుకు సాగాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రౌట సంకెపల్లి గ్రామంలో శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించిన "కుమురం భీమ్ జల్, జంగల్, జమీన్ స్ఫూర్తి గ్రామోత్సవం-2026" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమరవీరుడు కుమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన గవర్నర్, అనంతరం అక్కడ ఏర్పాటు చేయనున్న భీం కాంస్య విగ్రహ ప్రతిష్టాపనకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. రౌట సంకెపల్లి కేవలం ఒక గ్రామం మాత్రమే కాదని, ఆదివాసీ సమాజ వీరత్వం, త్యాగం, ఆత్మగౌరవ సంస్కృతికి ప్రతీకగా నిలిచే పవిత్ర స్థలమని కొనియాడారు. కుమురం భీమ్ నినదించిన "జల్, జంగల్, జమీన్" అనే నినాదం కేవలం మూడు పదాలు కాదని, అది ప్రకృతి-మనిషి మధ్య ఉండాల్సిన సహజీవనానికి నిదర్శనమన్నారు. ప్రకృతిని కాపాడే సమాజాన్ని ప్రకృతి కూడా లాలించి కాపాడుతుందని స్పష్టం చేశారు. తన హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం ఎలాంటి గొప్ప సైన్యం లేకపోయినా నైజాం సర్కారుపై ధైర్యసాహసాలతో పోరాడిన భీం త్యాగం దేశ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతుందన్నారు.

### మూలాలను, సంస్కృతిని మరవొద్దు

దేశం సాంకేతికంగా, ఆర్థికంగా ఎంత వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, యువత తమ మూలాలను, ఆదివాసీ సంస్కృతిని అస్సలు మరవకూడదని గవర్నర్ హితవు పలికారు. క్రమశిక్షణ, కఠోర శ్రమ, సామాజిక సేవా భావనలతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని చెప్పారు. గ్రామోత్సవం ద్వారా గ్రామీణాభివృద్ధి, సంప్రదాయ విద్య, సామాజిక చైతన్యానికి ప్రాధాన్యం కల్పించడం అభినందనీయమన్నారు. అలాగే, మహిళల సాధికారత లేకుండా సమాజ వికాసం సాధ్యం కాదని, వారికి విద్య, గౌరవం అందిస్తూ సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వం సంక్షేమ ఫలాలను చివరి వ్యక్తి వరకు చేరవేస్తున్న తరుణంలో, సమాజ భాగస్వామ్యం కూడా అంతే ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా గిరిజన కుటుంబాలకు గవర్నర్ చేతుల మీదుగా సౌర విద్యుత్తు పలకలను (సోలార్ ప్యానెల్స్) పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. ఆదివాసీల ఆత్మగౌరవ పోరాటానికి పునాది వేసిన అసాధారణ యోధుడు కొమురం భీం అని కొనియాడారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, గిరిజనుల హక్కుల కోసం భీం చేసిన పోరాట స్ఫూర్తితో నిర్వహిస్తున్న ఈ మహోత్సవానికి రాష్ట్ర గవర్నర్ రావడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ వైభవ గ్రామోత్సవంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, స్థానిక ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, కాటేపల్లి వెంకటరమణ, వెడ్మ బొజ్జు పటేల్, పాల్వాయి హరీష్ బాబు, జిల్లా కలెక్టర్ కె. హరిత, ఎస్పీ నితికా పంత్, ఉత్సవ నిర్వాహకులు రాయకూడి నాగేంద్రతో పాటు పెద్ద సంఖ్యలో ఆదివాసీ గిరిజన ప్రజలు, సామాజిక సేవకులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాపై అప్రమత్తంగా ఉండాలి




- 'సిర్' ప్రక్రియలో అర్హుల ఓట్లు తొలగిపోకుండా కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలి
- ప్రతి నెల మూడు రోజులు కార్యకర్తలకు సమయం కేటాయించాలి
- మంత్రులకు సీఎం రేవంత్ సూచన

హైదరాబాద్, మే 29: ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. గాంధీభవన్‌లో శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో ఆయన ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ఓటరు నమోదు, సవరణ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించిన సీఎం, ఈ ప్రక్రియలో లంబాడీలు, ఆదివాసీలు, వలస కార్మికులు, మహిళలు, దళితులు, మైనారిటీల ఓట్లు తొలగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బూత్ స్థాయిలో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండి అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. అదే విధంగా పార్టీ బలోపేతానికి కార్యకర్తలతో ప్రత్యక్ష సంబంధాలు మరింత పెంచాల్సిన అవసరం ఉందని సీఎం పేర్కొన్నారు. ఇకపై తనతో పాటు రాష్ట్ర మంత్రులందరూ ప్రతి నెల కనీసం మూడు రోజులు కార్యకర్తలకు సమయం కేటాయించాలని సూచించారు. ఆ రోజుల్లో క్షేత్రస్థాయికి వెళ్లి కార్యకర్తలను నేరుగా కలుసుకుని వారి సమస్యలు, సూచనలు తెలుసుకోవాలని ఆదేశించారు. పార్టీ కోసం ప్రతి నాయకుడు, ప్రజాప్రతినిధి పనిచేయాల్సిందేనని, ఈ విషయంలో ఎవరికీ మినహాయింపు లేదని సీఎం స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు, పలువురు మంత్రులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

# ఆర్టీఐ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాం

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ ప్రతినిధులు

## ఏడాది కాలం కార్యకలాపాలపై వివరించిన చీఫ్ కమిషనర్, కమిషనర్లు



**హైదరాబాద్, మే 29:** రాష్ట్ర సమాచార హక్కు (ఆర్టీఐ) కమిషన్ చీఫ్ కమిషనర్, కమిషనర్లు గురువారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషన్‌లో బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో భేటీ అయి ఆర్టీఐ కమిషన్ కార్యకలాపాలు, ప్రజలకు సమాచార హక్కు అమలులో చేపడుతున్న చర్యలపై వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమాచార హక్కు ప్రధాన కమిషనర్ జి. చంద్రశేఖర్ రెడ్డి, కమిషనర్లు పీవీ శ్రీనివాస్, బోరెడ్డి అయోధ్య రెడ్డి, దేశాల భూపాల్‌లు కమిషన్ పనితీరు, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, పారదర్శక పాలనకు ఆర్టీఐ చట్టం అందిస్తున్న సేవల గురించి ముఖ్యమంత్రికి నివేదించారు. ప్రజలకు సమాచార హక్కు సమర్థవంతంగా అందేలా కమిషన్ చేపడుతున్న చర్యలను ముఖ్యమంత్రి అభినందించినట్లు సమాచారం. ప్రభుత్వ పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంలో ఆర్టీఐ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోందని ఈ సందర్భంగా అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. భేటీ అనంతరం కమిషన్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం మరింత సమర్థవంతంగా అమలయ్యేలా కృషి కొనసాగిస్తామని పేర్కొన్నారు.



# కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్

## 200 ఇంటర్ సిటీ రైళ్ల తయారీకి రంగం సిద్ధం

## ప్రధాని మోడీ, మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కిషన్ రెడ్డి కృతజ్ఞతలు

హైదరాబాద్, మే 29: కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు 200 ఇంటర్‌సిటీ రైళ్ల తయారీ బాధ్యతను ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అప్పగించడంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నిరంతర సహకారం అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా స్పందించారు. రాబోయే ఐదేళ్లలో 200 ఇంటర్‌సిటీ రైళ్లను తయారు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. దీనిపై సమీక్ష నిర్వహించి, ఆ బాధ్యతను కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు అప్పగిస్తూ రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ నిర్ణయం తీసుకోవడం హర్షనీయమన్నారు. ఈ ఇంటర్‌సిటీ రైళ్లు 20 కోచ్‌ల కాన్ఫిగరేషన్‌తో, ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్, మెరుగైన వెంటిలేషన్, సురక్షితమైన కోచ్ డిజైన్ వంటి ఆధునిక సదుపాయాలను కలిగి ఉంటాయని ఆయన పేర్కొన్నారు. వీటిని సాధారణంగా సుమారు 300 కిలోమీటర్ల దూరం ఉన్న మార్గాల్లో నడిపిస్తారని తెలిపారు. అలాగే ప్రతి ట్రిప్‌లో చాలా స్టాప్‌లు ఉంటాయని కేంద్ర మంత్రి చెప్పారు. ఇంటర్‌సిటీ రైళ్లు గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణాలు, నగరాల మధ్య ప్రజలు సులభంగా ప్రయాణించేందుకు ఈ రైళ్లు ఉపయోగపడతాయని అన్నారు. ఇవి తమ సమీప పట్టణాల్లో ఉన్నత విద్య కోసం వెళ్లే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటాయని చెప్పారు. అలాగే ఆరోగ్యం, ఉద్యోగం, ఉపాధి కోసం ప్రయాణించే సామాన్య ప్రజలకూ ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.

# అంచనాను మించి ధాన్యం ఉత్పత్తి

- అయిన ఆచివరి గింజ వరకు కొంటూనే ఉన్నాం
- తడిసిన ధాన్యం సైతం కొని రైతులను ఆదుకున్నాం
- అదనపు కొనుగోళ్లకు 16,479 కోట్లు ఖర్చు చేశాం
- మీడియా సమావేశంలో మంత్రులు వెల్లడి



**హైదరాబాద్, మే 29:** దేశంలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని ఈ మాట కేంద్రమే చెప్పిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గతంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొనుగోళ్ల కంటే ఇప్పుడు ఎక్కువ కొంటున్నాం అన్నారు. సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు పాటిస్తూ చెప్పిన దానికంటే అదనంగా కొనుగోలు చేశాం అన్నారు. . దీనికోసం రూ.16,479 కోట్లు ఖర్చు చేశాం. రాష్ట్రంలో చివరి గింజ వరకు కొనుగోలు చేసే బాధ్యత మాది అని ఉత్తమ్ తెలిపారు. ధాన్యం సేకరణకు క్షేత్రస్థాయిలో 13వేల వాహనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 2 లక్షల మంది సిబ్బంది సేకరణలో పాల్గొంటున్నారని చెప్పారు. సేకరణ కేంద్రాలకు 20.86 కోట్ల గన్నీ బ్యాగులు పంపామన్నారు. ధాన్యం కొనుగోలు చేసి రూ.11,050 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామని వివరించారు. 'ధాన్యం సేకరణకు బిహార్, బెంగాల్ కార్మికులపై ఆధారపడి ఉన్నాం. బెంగాల్ ఎన్నికలకు కార్మికులు స్వస్థలాలకు వెళ్లి రావడం ఆలస్యమైంది. మద్దతు ధర కోసం మా ప్రభుత్వం రూ.49 వేల కోట్లు వెచ్చించగా.. గత ప్రభుత్వం రూ.10వేల కోట్లే ఇచ్చింది. ఈ విషయంలో ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఇప్పటికే రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం పండింది.. ఏ రాష్ట్రంలో జరగని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు జరుగతున్నాయని స్పష్టం చేశారు. ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ గా ఉందన్నారు. ధాన్యం సేకరణ విషయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో కనీస మద్దతు ధరకే అన్ని రకాల ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. ఎంఎస్ పీ ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు 16వేల కోట్ల రూపాయలు ఖర్చు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. రాష్ట్రంలో 143 లక్షల టన్నుల ధాన్యం పండితే.. ఇప్పటివరకు 73 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతు ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తున్నామన్నారు. చివరి గింజ వరకు మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. యాసంగిలో రాష్ట్ర ప్రభుత్వం 73 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది..అయితే ఇందులో కేంద్ర ప్రభుత్వం కేవలం 5 లక్షల ధాన్యమే కొనుగోలు చేస్తామని చెబుతోంది.. ఏటా తెలంగాణ నుంచి ధాన్యం కొనుగోళ్లను తగ్గిస్తూ వస్తోంది. ధాన్యం కొనుగోళ్లు పెంచాలని కేంద్రాన్ని సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోవడం లేదు. బీజేపోళ్లు ధర్నా చేసుడు కాదు.. ఢిల్లీకి వెళ్లి వడ్లను కొనాలను కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లకు 16వేల కోట్ల రూపాయలు అదనంగా ఖర్చు చేశామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న చివరి గింజ వరకు ధాన్యం సేకరణ జరగుతుందన్నారు. ధాన్యం సేకరణలో 2వేల మిల్లులు పనిచేస్తున్నాయన్నారు. ధాన్యం తరలించేందుకు 13వేల వాహనాలు సిద్దంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో హమాలీల కొరత ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ ధాన్యం కొనుగోలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఏడాదికి 15వేల ఇస్తే కాంగ్రెస్ హయాంలో 49వేల కోట్లు ఇస్తున్నామన్నా రు మంత్రి.. తెలంగాణలో 60 లక్షల టన్నుల ధాన్యం కొంటే.. ఏపీలో 24 లక్షలే కొన్నరని పోల్చి చెప్పారు. ఇప్పటివరకు రూ.11వేల 50కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం.. రెండున్నరేళ్లలో రూ.36వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. వడ్లను కొన్న 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామన్నారు. చివరి గింజ కొనేవరకు కొనుగోలు కేంద్రాలు పనిచేస్తాయని, ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన 10వేల 214 టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

# మహిళల చేతుల్లోనే పరిశ్రమల జెండా ఎగరాలి

- మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ఇంక్యుబేటర్ కేంద్రాల ప్రారంభం
- 'మేడ్ ఇన్ తెలంగాణ.. మేడ్ బై ఉమెన్' నినాదం ప్రపంచవ్యాప్తం కావాలి
- మహిళలను ఉద్యోగార్థులుగా కాదు..
- ఉద్యోగాల కల్పకులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి సీతక్క



**హైదరాబాద్, మే 29:** మహిళల చేతుల్లో కేవలం బ్యాంకు పాస్‌బుక్కులు మాత్రమే కాకుండా పరిశ్రమలు, వ్యాపారాలు కూడా ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. గ్రామీణ మహిళల ప్రతిభ, ఆలోచనలు, వ్యాపార కలలను సాకారం చేసే దిశగా ప్రత్యేక ఇంక్యుబేటర్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కొమురం భీం ఆదివాసీ భవన్‌లో మహిళా పారిశ్రామికవేత్తలకు ఆర్థిక, సాంకేతిక, వ్యాపార సహాయాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఇంక్యుబేటర్ కేంద్రాలను మంత్రి సీతక్క శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ గ్రామీణ మహిళల భవిష్యత్తును మార్చే ఆర్థిక ఉద్యమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. రాష్టంలో స్వయం సహాయక సంఘాల ద్వారా 67 లక్షల మంది మహిళలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నారని, ఇప్పటికే 6.43 లక్షల మంది మహిళలు వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. వారి వ్యాపారాలను మరింత విస్తరించేందుకు ప్రత్యేక ఎస్‌హెచ్‌జీ యాప్‌ను కూడా అభివృద్ధి చేసినట్లు చెప్పారు.దేశంలోని ప్రముఖ ఆవిష్కరణ వేదిక టి-హబ్, బిట్స్ పిలానీ భాగస్వామ్యంతో రెండు ప్రత్యేక ఇంక్యుబేటర్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఒక్కో కేంద్రానికి రూ.10.70 కోట్ల చొప్పున మొత్తం రూ.21.40 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు శిక్షణ, బ్రాండింగ్, మార్కెటింగ్, డిజిటల్ సపోర్ట్, ఆర్థిక మార్గదర్శకత్వం, బిజినెస్ మెంటరింగ్ వంటి సేవలు అందించనున్నట్లు చెప్పారు. తొలి దశలో 300 మంది మహిళా పారిశ్రామికవేత్తలను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. "ఉద్యోగాల కోసం వెతికే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి మహిళలు ఎదగాలి. మహిళలు జాబ్ సీకర్స్‌గా కాకుండా జాబ్ క్రియేటర్స్‌గా మారాలి" అని మంత్రి స్పష్టం చేశారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు మహిళా సంఘాలకు రూ.60 వేల కోట్లకు పైగా బ్యాంకు లింకేజ్ రుణాలు అందించినట్లు తెలిపారు. మహిళా సంఘాలు 100 శాతం రుణాల చెల్లింపుతో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. గ్రామీణ మహిళల ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లలో అవకాశాలు కల్పించడమే ఇంక్యుబేటర్ల ప్రధాన లక్ష్యమని సీతక్క చెప్పారు. మధిరలో మహిళల కోసం ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ ప్లాంట్లు నెలకు రూ.5 లక్షల వరకు ఆదాయం తెస్తున్నాయని, మహిళలు నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులు నెలకు రూ.4 లక్షల వరకు లాభాలు ఆర్జిస్తున్నాయని వివరించారు. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా 554 మంది మహిళలకు రూ.6 కోట్ల ఆర్థిక సహాయం అందించగా, కేవలం 15 రోజుల్లోనే రూ.9.5 కోట్ల వ్యాపారం నిర్వహించారని తెలిపారు. ఫుడ్ ట్రక్కులు, ఫిష్ మొబైల్ ట్రక్కులు వంటి వినూత్న వ్యాపార నమూనాలను మహిళలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. స్థానిక మార్కెట్‌కే పరిమితం కాకుండా అంతర్జాతీయ మార్కెట్లను లక్ష్యంగా చేసుకుని మహిళలను ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. చేర్యాల మహిళలు తయారు చేసిన చింతపండు ఉత్పత్తులు నెదర్లాండ్స్‌కు ఎగుమతి కావడం తెలంగాణ మహిళల సృజనాత్మకతకు నిదర్శనమన్నారు. "మేడ్ ఇన్ తెలంగాణ.. మేడ్ బై ఉమెన్" అనే నినాదం ప్రపంచవ్యాప్తంగా మార్మోగాలని ఆకాంక్షించారు. మహిళలకు అవకాశాలు కల్పించడమే కాకుండా వాటిని సద్వినియోగం చేసుకునే ధైర్యాన్ని కూడా ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్రతి గ్రామంలో ఒక మహిళా వ్యాపారవేత్త ఎదగాలని, ఒక మహిళ విజయం మరో మహిళకు స్ఫూర్తిగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, టి-హబ్ సీఈఓ కవికృత్, వీ-హబ్ సీఈఓ సీత పల్లచోల, సెర్ప్ నాన్ ఫామ్ డైరెక్టర్ జాన్సన్, డీఆర్‌డీఓ ప్రతినిధులు, జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, యువ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# ఎక్కడా ధాన్యం కొనుగోళ్లు లేవు

**80శాతం ధాన్యం కుప్పల పేరుకున్నాయి**

**బిజెపి భరోసా యాత్రలో గమనించాం**

**రేవంత్‌కు అధికారులపై పట్టు లేదన్న ఏలేటి**



**హైదరాబాద్, మే 29:** రాష్ట్రంలో రైతాంగం పడుతున్న బాధలు తెలుసుకునేందుకు 'రైతు గోస - బీజేపీ భరోసా' పేరుతో యాత్ర చేపట్టామని అసెంబ్లీలో బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. నాలుగు రోజుల పాటు అనేక జిల్లాల్లో పర్యటించి.. రైతాంగం ఆర్తనాదాలు విన్నామని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు 80 శాతం పూర్తి అయ్యాయని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని.. కానీ తాము చేసిన ఈ యాత్రలో 80 శాతం ధాన్యం కుప్పలు పేరుకుపోయి కనిపించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పోరాటం చేయగానే.. ప్రభుత్వం సమీక్షలు, జిల్లాల్లో కల్లాల బాట పడుతుందని ఆరోపించారు. ఇవే సమీక్షలు, పర్యటనలు మంత్రులు ముందే చేస్తే బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అడ్మినిస్ట్రేషన్‌పై కంట్రోల్ లేదని ఏలేటి మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో దోపిడి రాజ్యం నడుస్తోందని విమర్శించారు. రైతుల వద్ద ధాన్యాన్ని కేంద్రం కొనుగోలు చేయలేకపోతే.. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయలేదా? అని రేవంత్ సర్కార్‌ను ఆయన సూటిగా ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఇసుక, సిమెంట్ లారీలను ముందే ఆపి ధాన్యం సేకరణ ఎందుకు చేయలేదని ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. రైతులే గన్నీ బ్యాగులు కొనే పరిస్థితి లేదన్నారు. లారీ, హామాలీల ఖర్చు రైతులే చెల్లిస్తున్నారని తద్వారా రైతాంగం శ్రమను ఈ విధంగా దోపిడీ చేస్తున్నారని చెప్పారు. చివరి గింజ వరకు కొనే బాధ్యత నాదని ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కేంద్రం ఇచ్చిన యూరియాను కూడా సక్రమంగా ఇవ్వకుండా.. యాప్ పేరుతో రైతులను ఇబ్బం ది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వయసు మీరి, బుద్ధి మందగించిందని.. అందుకే బీజేపీని విమర్శిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని.. మంత్రులు ఉత్తమ్, తుమ్మల చర్చకు వస్తారా? అంటూ బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి సవాల్ విసిరారు. వాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పెట్రోల్, డీజల్‌పై అవగాహన లేదని ఎద్దేవా చేశారు. పెట్రోల్, డీజల్‌పై 30 శాతం వ్యాట్ ఎందుకు తగ్గించడం లేదంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. రైతు వడదెబ్బతో చనిపోతే మంత్రులు వెళ్లి పరామర్శించారా?.. ఎక్స్‌గ్రేషియా ప్రకటించారా? అని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఆయన నిలదీశారు.




# ఫార్మా సిటీ భూసేకరణపై నేడు మహాధర్నా

## జీవో 31 రద్దు చేయాలని డిమాండ్

**హైకోర్టు స్టే ఉన్న భూముల్లో పనులు నిలిపివేయాలంటూ ఆందోళన**

**ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో రైతులు, ప్రజా సంఘాల నిరసన**

**హైదరాబాద్, మే 29:** రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో ప్రతిపాదిత ఫార్మా సిటీ నిర్మాణం కోసం చేపట్టిన భూసేకరణకు వ్యతిరేకంగా రైతులు శనివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నారు. గత ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.31ను వెంటనే రద్దు చేయాలని, హైకోర్టు స్టే ఇచ్చిన భూముల్లో కొనసాగుతున్న ప్రభుత్వ పనులను నిలిపివేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఫార్మా సిటీ పేరుతో తమ భూములను బలవంతంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై రైతులు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు స్టే ఇచ్చినప్పటికీ, అధికారులు పనులు కొనసాగించడం చట్టవిరుద్ధమని వారు పేర్కొంటున్నారు. భూములు కోల్పోతున్న రైతులపై పోలీసులు, రెవెన్యూ అధికారులు ఒత్తిళ్లు తెస్తున్నారని, వేధింపులకు పాల్పడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ జీవనాధారమైన వ్యవసాయ భూములను కాపాడుకునేందుకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే మహాధర్నాకు యాచారం మండలంలోని పలు గ్రామాల నుంచి వందలాది మంది రైతులు, వ్యవసాయ కూలీలు హాజరుకానున్నారు. ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు, పౌర హక్కుల వేదికల ప్రతినిధులు కూడా పాల్గొని రైతులకు సంఘీభావం ప్రకటించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఫార్మా సిటీ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ సరస్వతి కవుల, తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీజేఏసీ) కో-కన్వీనర్ కన్నెగంటి రవి సంయుక్త ప్రకటనలో రైతులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

# ఔట్ సోర్సింగ్ నియామకాల్లో అక్రమాలు

**ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఫిర్యాదు**

**హైదరాబాద్, మే 29:** మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఇటీవల చేపట్టిన ఔట్‌సోర్సింగ్ నియామకాల్లో భారీ అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ.. యూనివర్సిటీలో నిర్వహించిన ఔట్‌సోర్సింగ్ నియామకాలు పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని తెలిపారు. రోస్టర్ రిజర్వేషన్ విధానం పాటించకుండా పత్రిక ప్రకటనలు సరైన విధంగా ఇవ్వకుండా అర్హులైన నిరుద్యోగులకు అవకాశం లేకుండా నియామకాలు చేపట్టారని ఆరోపించారు. ఇప్పటికే ఈ అంశంపై యూనివర్సిటీ వీసీ,రిజిస్ట్రార్‌కు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా అధికారులు స్పందించకపోవడంతో ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ను కలిసి పూర్తి వివరాలు తెలియజేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థి సంఘ నాయకుడు వాడపల్లి నవీన్ మాట్లాడుతూ.. గతంలో నవీన్ మిట్టల్ వైస్ ఛాన్సలర్‌గా ఉన్న సమయంలో కూడా 33 మంది డైలీ వేజ్ ఉద్యోగులను రోస్టర్ రిజర్వేషన్, పత్రిక ప్రకటనలు లేకుండా అక్రమంగా నియమించారని తెలిపారు. ప్రస్తుతం చేపట్టిన నియామకాలలో కూడా నిరుద్యోగుల వద్ద లక్షల రూపాయలు వసూలు చేసి 100కు పైగా అక్రమ నియామకాలు జరిగాయని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడిన ఏజెన్సీపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఆ ఏజెన్సీకి యూనివర్సిటీ లేదా ఇతర ప్రభుత్వ సంస్థల్లో పనులు ఇవ్వకుండా బ్లాక్‌లిస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రస్తుతం జరిగిన నియామకాలను పూర్తిగా రద్దు చేసి, తిరిగి పారదర్శకంగా నోటిఫికేషన్ విడుదల చేసి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించి నాణ్యత కలిగిన విద్యావంతులను ఎంపిక చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు పోలగొని శివ, రాజేష్, యశ్వంత్, రామ్, జితేందర్, సంజీవ, నిరుద్యోగ యువకులు పాల్గొన్నారు.

# 31న డిమాండ్ డేను పాటించాలి

**హైదరాబాద్, మే 29:** రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం కోసం జూన్ 2న అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న కార్మికులందరూ డిమాండ్ డేను పాటించాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జేఏసీ నాయకులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కో-కన్వీనర్ బి.యాదగిరి మాట్లాడారు. గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి చర్యలు చేపట్టి శాసనసభలో బిల్లు కూడా పాస్ చేసిందని గుర్తు చేశారు. కేవలం విలీన తేదీని ప్రకటించాల్సిన సమయంలో ప్రభుత్వాలు మారాయని తెలిపారు. ఇటీవల ఆర్టీసీ సమ్మె సందర్భంగా మంత్రులతో కూడిన ఉపసంఘం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి అధికారికంగా ప్రకటన చేశారని తెలిపారు. ఇటీవల విలీనం కంటే ముందు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో కార్మికుల్లో తీవ్ర గందరగోళం నెలకొన్నదని అన్నారు. ఆర్టీసీ విలీనానికి అపాయింటెడ్ తేదీని తెలంగాణ ఆవిర్భావ దినమైన జూన్ 2న ముఖ్యమంత్రి ప్రకటించాలని కోరుతూ మే 31 న సింగిల్ డిమాండ్ పై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపో, యూనిట్లలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి డిమాండ్ డే పాటించాలని పిలుపునిచ్చారు.




# కాలంతో పోరాడలేక చతికిల పడ్డ కమ్యూనిస్టులు

కేరళ సిఎంగా ఉండగానే పినరయి విజయ్‌పై ఆరోపణలు వచ్చాయి. కూతురికి లబ్ది చేకూర్చేందుకు ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేశారన్న అభియోగాలు వచ్చాయి. ఇందులో ఆనాటి నుంచే కేసు నడుస్తోంది. తాజాగా ఇప్పుడు ఇడి రంగంలోకి దిగడంతో ఇది కాంగ్రెస్, బిజెపిల కుట్ర అని, లెఫ్ట్ పార్టీని దెబ్బతీసే కుయుక్తి అంటూ విమర్శలు చేస్తున్నారు. చాలా విచిత్రంగా ఈ రెండు పార్టీలు కలుస్తాయా అన్నది కమ్యూనిస్టులే చెప్పాలి. మరో విషయమేమంటే ఎన్నికల సందర్భంగా రాహుల్ తన ప్రచారంలో బిజెపి లెఫ్ట్‌తో కుమ్మక్కయిందని ఆరోపించారు. కాంగ్రెస్- బిజెపి రెండూ కూడబలుక్కొని కేరళలో సిపిఎం ప్రతిష్టను దెబ్బతీయటానికి బరి తెగించాయని విమర్శలు చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇడి నోటీసులు ఇవ్వటంతో వ్యవహారం మొదలైంది. దేశంలో ప్రతిపక్ష పార్టీలపైనా, నాయకులపైనా అవినీతి ఆరోపణలు గుప్పించడం, ఆ తరువాత తన గుప్పిట్లో పెట్టుకున్న దర్యాప్తు సంస్థల చేత దాడులు చేయించడం కేంద్రంలోని మోదీ-షా ప్రభుత్వం చాలాకాలంగా అనుసరిస్తున్న విధానం అని దాదాపు అన్ని పార్టీలు చేస్తున్న ఆరోపణలే. ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్‌ల మీద సాగించిన దాష్టీకం, ఇందులో భాగమని సిపిఎం ఆరోపణ. అవినీతి పంకిలం అంటించి రాజకీయ లబ్ది పొందాలనే బిజెపి కుట్రపూరిత వ్యూహం అత్యంత దిగజారుడుతనానికి నిదర్శనంగా ఇప్పుడు సిపిఎం ఆరోపిస్తోంది. కేరళలో అధికారం కోల్పోయాక సిపిఎం బహుశా కనుమరుగైనట్లుగానే భావించాలి. కేరళంలో కొంత మిణుకుమిణుకుమంటున్నా,దేశంలోని అనేక రాష్ట్రాల్లో అసలు ఉనికి లేకుండా పోయింది. ముఖ్యంగా కమ్యూనిస్టులు నేలవిడిచి సాము చేయడం, పడికట్టు సిద్ధాంతాల నుంచి బయటపడక పోవడం, గతంలో లాగా పోరాటలకు దూరంగా ఉండడం వంటివన్నీ వారిని తుడిచిపెట్టేలా చేశాయి. కేరళంలో విజయన్ కుమార్తె నిర్వహణలోని సంస్థ అందించిన సేవల నిమిత్తం పొందిన ప్రతిఫలాన్ని వివాదాస్పదం చేసి, మనీ లాండరింగ్ సెక్షన్లు బనాయించిందన్నది సిపిఎం ఆరోపణగా ఉంది. రాహుల్ గాంధీ ఇంకో రెండడుగులు ముందుకేసి, పినరయి విజయన్‌ను ఎందుకు అరెస్టు చేయరంటూ ప్రశ్నించాడట. కేరళంలో అధికారంలోకి వచ్చిన మరు క్షణం నుంచి ఒకపక్క కాంగ్రెస్, మరోపక్క సంఘ్ పరివార్ శక్తులూ సిపిఎంపై దాడులకు తెగబడుతున్నాయన్న వాదనను సిపిఎం తెరపైకి తెచ్చింది. విజయన్ ఇంటిపై కుట్రపూరిత దాడుల గురించి తెలిసిన వెంటనే దేశమంతా వెల్లువెత్తిన నిరసనలే ఎర్రజెండా పట్ల ప్రజల నమ్మకానికి నిదర్శనం అంటోంది. నిజానికి ఈ కేసు చాలా చిన్నది. దీనిని కోర్టులో తేల్చుకోవచ్చు. కానీ అలా చేయడం లేదు. లెఫ్ట్ రాజకీయాలకు వస్తే బెంగాల్లో 35 ఏళ్లపాటు అధికారంలో ఉండి చేసిందేమీ లేదు. కేరళలోనూ ప ఎద్దగా అభివృద్ధి జరిగిన దాఖలాలు లేవు. తరిపురలోనూ అలాగే చేశారు. అందుకే ప్రజలు వీరిని ఇంటికి పంపించారు. ఈ దెబ్బతో దేశంలో ఇక లెఫ్ట్ పార్టీలకు కాలం చెల్లినట్లే. అభివృద్ధి చెందిన దేశాల్లో, అంటే సంపన్న, వలసవాద, పారిశ్రామిక దేశాల్లో కమ్యూనిస్టు భావజాలం అంతగా విస్తరించలేకపోయింది. వలస విముక్తి ఉద్యమాలు జోరందుకున్న లేదా నవస్వతంత్ర దేశా ల్లో మాత్రం దండిగా మార్మోగింది. అలాంటి దేశాల్లో భారత్ మొదటి వరుసలో ఉంటుంది. సాంప్రదాయిక భావజాల ప్రతినిధి అయిన ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భవించిన 1925లోనే కమ్యూనిస్టు పార్టీ ఊపిరిపోసుకుంది. ఆర్‌ఎస్‌ఎస్ కుటుంబానికి చెందిన బీజేపీ తన అధికారాన్ని పటిష్టపరచుకుంటున్న తరుణంలో కమ్యూనిస్టులు కనుమరుగైపోతుండటం ఓ వైచిత్రి. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత 1951 -52 నాటి తొలి ఎన్నికల్లో వారు గణనీయమైన విజయాలు సాధించారు. నల్గొండ నుంచి కమ్యూనిస్టు నేత రావి నారాయణరెడ్డి, తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను మించిన మెజారిటీ సాధించడం గురించి అప్పట్లో గొప్ప గా చెప్పుకొన్నారు. తాజాగా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత దేశంలో కమ్యూనిస్టుల పలుకుబడి అడుగంటిన సూచనలు కనిపిస్తు న్నాయి. సు మారు 50 ఏండ్లలో ఏ రాష్ట్రంలోనూ కమ్యూనిస్టు ప్రభుత్వం లేని పరిస్థితి వచ్చింది. కేరళలో పినరయి విజయన్ ప్రభుత్వ ఓటమి కీలక పరిణామమే. దీంతో దేశ రాజకీయాల్లో కమ్యూనిస్టుల శకం అంతరించినట్టేననే వ్యాఖ్యానాలు వినిపిస్తుండటం గమనార్హం. ఒకప్పుడు కమ్యూనిస్టులు ప్రజల కోసం ఉద్యమాలు చేసేవారు. ఇప్పుడా పరిస్థితులు లేకుండ పోయాయి. కేరళ తర్వాత బెంగాల్, త్రిపుర ఇలా మొత్తం మూడు రాష్ట్రాల్లో వామపక్ష ప్రభుత్వాలు సుదీర్ఘకాలం కొనసాగాయి. కానీ ఇప్పుడదంతా గత వైభ వం. మారిన పరిస్థితుల్లో దానిని తిరిగి రాబట్టుకోవడం అంత సులభం కాదని మాత్రం చెప్పవచ్చు. కేంద్రంలో కాంగ్రెస్ ఆధిపత్యం వీగిపోయి, సంకీర్ణ ప్రభుత్వాల కాలంలో కమ్యూనిస్టులు హస్తినలో మంత్రి పదవులూ చేపట్టారు. ఓ దశలో కమ్యూనిస్టు సీనియర్ నేత జ్యోతిబసును ప్రధాని పదవి చేపట్టే అవకాశమూ తలుపు తట్టింది. అంతటి ఉన్నతస్థితి నుంచి, నేడు ఏమాత్రం ప్రాముఖ్యం లేని స్థాయికి కమ్యూనిస్టులు పడిపోయారు. కేరళంలో తమను ఓడించిన కాంగ్రెస్‌తో తెలంగాణలో అంటకాగడం, ఒకటి రెండు స్థానాల కోసం వెంపర్లాడటం వారి దైన్యాన్ని కండ్లకు కడుతున్నది. భారత్‌లో పార్లమెంటరీ పంథాలో వెళ్లిన కమ్యూనిస్టులు కనుమరుగవుతుంటే, మరోవైపు సాయుధ పోరాటాన్ని ఎంచుకున్న కమ్యూనిస్టులు కగార్ ధాటికి నేలకొరుగుతున్నారు. కమ్యూనిస్టుల 'చారిత్రిక తప్పిదాలు', ప్రజల్లో పెరిగిన వినిమయతత్వం అందుకు దారితీశాయి అనేది అక్షరసత్యం. ప్రజలిప్పుడు డబ్బు సంపాదించటం, ఖర్చు పెట్టటం గురించి తప్ప విప్లవాలు, ఉద్యమాల గురించి ఎక్కువగా ఆలోచించటం లేదు. కాలం చెల్లిన వ్యూహాలు, ఎత్తుగడలూ కమ్యూనిస్టుల మహాప్రస్థానానికి బ్రేకులు వేశాయి. మొత్తంగా ఇప్పుడు కమ్యూనిస్టుల భవిష్యత్ ఏంటన్నది కాలమే చెప్పాలి. పినరయ్ విజయ్ లాంటి వారు కూతురుకు మేలు చేయడం కోసం అవినీతి బురద తొక్కడం కూడా కాల వైచిత్రమే.

# నీట్ పేపర్ లీక్ బాధ్యత ఎవరిది

- యూపీఎస్‌సీని చూసి నేర్చుకోండి
- విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆందోళనకు బాధ్యులెవరు
- నీట్ పేపర్ లీక్‌పై మరోమారు సుప్రీం ఆగ్రహం




**న్యూఢిల్లీ, మే 29:** నీట్ యూజీ పరీక్ష పేపర్ లీక్ వివాదంపై సుప్రీం కోర్టు మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పర్యవేక్షణా యంత్రాంగాలు, సంబంధిత కమిటీలు ఉన్నప్పటికీ ఇంత పెద్ద ఉల్లంఘన ఎలా జరిగిందని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఇలాంటి సంఘటన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తీవ్ర మానసిక క్షోభను కలిగిస్తుందని, వారిని ఇలా నిరాశపెట్టడం సరికాదని అభిప్రాయపడింది. పేపర్ లీక్ విషయంలో లోపాలకు జవాబుదారీతనం ఉండాల్సిందేనని, అప్పటి వరకు అసలు సమస్య ఆగదని వ్యాఖ్యానించింది. అయితే, యు-ువత ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంటోందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం ధర్మాసనానికి వెల్లడించారు. పరిస్థితిని ప్రధానమంత్రి కూడా వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. జూన్ 21న మరోసారి నిర్వహించే నీట్-యూజీ పరీక్ష కోసం కొత్త యంత్రాంగాలను ఏర్పాటు చేశామన్నారు. అయితే, ఈ వ్యవహారంపై ప్రతిస్పందన తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీం ధర్మాసనం.. తదుపరి విచారణను జులై రెండో వారానికి వాయిదా వేసింది. నీట్ పేపర్ లీక్ ఉదంతంపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై(ఎన్‌టీఏ) పలు ప్రశ్నలు సంధించింది. ఇన్ని నిఘా వ్యవస్థలు, కమిటీలు ఉన్నా పేపర్ ఎలా లీకైందని ప్రశ్నించింది. యూపీఎస్‌సీలో ఇలాంటి ఉదంతాలు ఎప్పుడూ వెలుగుచూడలేదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. యూపీఎస్‌సీని చూసి నేర్చుకోవాలని ఎన్‌టీఏకు సూచించింది. నీట్ వ్యవస్థ ప్రక్షాళనకు కేంద్రం ఏర్పాటు చేసిన హైలెవెల్ కమిటీ చైర్మన్, ఇస్రో మాజీ చీఫ్ డా. రాధాకృష్ణన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌టీఏ, డా. రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లను సర్వోన్నత న్యాయస్థానం పరిశీలించింది. కేంద్రం తన ఎఫిడవిట్ దాఖలు చేసేందుకు న్యాయస్థానం అదనపు గడువు ఇచ్చింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ నరసింహ మాట్లాడుతూ పేపర్ లీక్‌కు ఆస్కారం కల్పించిన పరిస్థితులు ఏమిటని డా. రాధాకృష్ణన్‌ను కోర్టు ప్రశ్నించారు. గతంలో అనేక రక్షణలను ఏర్పాటు చేసినా పేపర్ లీక్ ఎలా అయ్యిందని అన్నారు. ఇందుకు డా. రాధాకృష్ణన్ బదులిస్తూ పేపర్ సెట్టింగ్ ప్రక్రియలో సమస్య ఉందని అన్నారు. ప్రస్తుతం ఆ లోపాలను సరిదిద్ది వ్యవస్థను మరింత బలోపేతం చేశామని అన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి సమస్య తలెత్తకుండా గతంలో మొత్తం 101 సూచనలు చేశామని చెప్పారు. వాటిల్లో 60 తాత్కాలిక సూచనలను 2025-26 పరీక్ష కోసం ప్రత్యేకంగా రూపొందించినట్టు చెప్పారు. ఇతర మార్గదర్శకాలు కూడా త్వరలో పూర్తిస్థాయిలో అమలవుతాయని చెప్పారు. మరోసారి ఇలాంటివి జరగవని ధీమా వ్యక్తం చేశారు. సంస్కరణలే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కేవలం సంస్కరణలతో పరిస్థితి చక్కబడదని కోర్టు వ్యాఖ్యానించింది. తప్పు జరిగినప్పుడు బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని పేర్కొంది. బాధ్యత ఎవరు తీసుకుంటారనేది తేల్చకుండా ఎన్ని కమిటీలు, మీటింగ్‌లు ఏర్పాటు చేసిన ఫలితం ఉండదని వ్యాఖ్యానించింది. ఇక ఈ అంశంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ పేపర్ లీక్‌పై విచారణ జరుగుతోందని అన్నారు. జూన్ 21 నాటి పరీక్ష నిర్వహణ కోసం కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. ప్రధాని స్వయంగా ఈ అంశాన్ని పర్యవేక్షిస్తున్నారని కోర్టుకు తెలిపారు.

# నీట్ పేపర్ లీకేజీ దోషులను వదలం

## వారిని కఠినంగా శిక్షించి తీరుతాం

## విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

**న్యూఢిల్లీ, మే 29:** నీట్ యూజీ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. నీట్ యూజీ ఎగ్జామ్‌లో అవకతవకలు జరిగాయని.. ప్రశ్నపత్రం నిజంగానే లీక్ అయిందని అంగీకరించారు. పేపర్ లీక్‌లో ప్రమేయం ఉన్న వారెవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. నీట్ పేపర్ లీక్‌కు సంబంధించిన అన్ని కేసులను ఫాస్ట్-ట్రాక్ కోర్టులలో విచారిస్తామని.. తద్వారా నిందితులకు త్వరితగతిన కఠిన శిక్ష పడేలా చూస్తామని పేర్కొన్నారు.నీట్ యూజీ పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఫెయిల్ అయ్యిందన్నారు. శుక్రవారం కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఓ నేషనల్ మీడియా టీవీ ఛానెల్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ..నీట్ యూజీ పేపర్ లీక్ అయిందని అంగీకరిస్తున్నాను. ఎన్‌టీఏ విఫలమైంది. ఈ విషయాన్ని నేను ఒప్పుకుంటున్నానని పేర్కొన్నారు. వైద్య ప్రవేశ పరీక్ష సమగ్రతను దెబ్బతీస్తున్న విద్యా మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవడానికి మోడీ సర్కార్ కట్టుబడి ఉందని అన్నారు. పేపర్ లీకేజీలో పాలుపంచుకున్న వ్యవస్థీకృత నెట్‌వర్క్‌లపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకుంటుందని విద్యార్థులకు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. సీబీఎస్‌ఈ 12వ తరగతి పరీక్ష ఫలితాల్లో నెలకొన్న గందరగోళంపైన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించారు. సీబీఎస్‌ఈ మూల్యాంకన వ్యవస్థలో ఓఎస్‌ఎంకు సంబంధించిన సాంకేతిక సమస్యలతో సహా పలు సమస్యలు ఉన్నాయని అంగీకరించిన ఆయన.. వాటిని ప్రస్తుతం ఐఐటీ నిపుణుల సహాయంతో పరిష్కరిస్తున్నారని తెలిపారు. సీబీఎస్‌ఈ ఉపయోగించే పేమెంట్ గేట్‌వే విదేశీ హ్యాకర్ల నుంచి జరిగిన సైబర్‌దాడికి గురైందని హాట్ కామెంట్స్ చేశారు. ఈ సమస్యను పరిష్కరించి, వ్యవస్థను బలోపేతం చేయడంలో సీబీఐ సైబర్ బృందం సీబీఎస్‌ఈకి సహకరిస్తోందని తెలిపారు.11 లక్షలకు పైగా విద్యార్థులు ఇప్పటికే తమ జవాబు పత్రాల కాపీలను పొందగా.. నాలుగు లక్షలకు పైగా అభ్యర్థులు పునఃమూల్యాంకనం కోసం దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తామని.. ప్రక్రియను మెరుగుపరచడానికి అవసరమైన దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు.







# లైంగిక వృత్తిలో ఉన్నవారికి ఆధార్ కార్డులు ఇవ్వాలి

## సెక్స్ వర్కర్లపై దాడులు సరికాదు

### వారు కూడా మనుషులే అని గుర్తించాలి : సుప్రీం కోర్టు స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, మే 29 :** స్వచ్ఛందంగా ప్రాస్టిట్యూషన్‌ను ఎంచుకోవడం, మానవ అక్రమ రవాణా బారినపడి సెక్స్ వర్క్‌లోకి దిగడం మధ్య స్పష్టమైన తేడా ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇష్టపూర్వకంగా సెక్స్ వర్క్ చేసే వయోజనులను వేధించవద్దని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. సెక్స్ వర్కర్లకు చట్టపరంగా సమాన రక్షణ ఉండాలని పేర్కొంది. దాడుల సమయంలో వారి గుర్తింపును వెల్లడించొద్దని మీడియాకు కూడా వార్నింగ్ ఇచ్చింది. దేశంలో మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు సమగ్ర మార్గదర్శకాలు జారీ చేసింది. స్వచ్ఛందంగా సెక్స్ వర్క్‌ను ఎంచుకున్న వారికి, మానవ అక్రమ రవాణా ముఠాల బారిన పడి ఈ రొంపిలో కూరుకుపోయిన బాధితులకు మధ్య తేడాను గుర్తించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. సొంత ఇష్టంతో సెక్స్ వర్క్ నిర్వహించే వయోజనులపై దాడులు చేయడం, క్రిమినల్ కేసులు పెట్టడం చట్టవిరుద్ధమని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి ఒక్కరికీ గౌరవంగా జీవించే హక్కు ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కేవలం లైంగిక వృత్తిలో తల్లి ఉందనే ఏకైక కారణంతో ఆమె నుంచి బిడ్డను బలవంతంగా వేరు చేయలేరని కూడా సుప్రీం కోర్టు పేర్కొంది. రెస్క్యూ ఆపరేషన్ల సమయంలో సెక్స్ వర్కర్ల ఫోటోలు, వీడియోలు ప్రసారం చేయడం నేరమని పేర్కొంది. నివాస ధ్రువీకరణ పత్రాలు లేకపోయినప్పటికీ సెక్స్ వర్కర్లందరికీ తక్షణమే ఆధార్ కార్డులు జారీ చేయాలని కూడా ఆదేశించింది. స్వచ్ఛందంగా ఈ మార్గాన్ని ఎంచుకున్న వారిని వదిలి, మహిళలు, మైనర్లను అక్రమ రవాణా చేసే మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని కూడా సుప్రీం కోర్టు ఆదేశించింది.



# 'మహా' విషాదం

## కల్తీ మద్యానికి 11 మంది బలి

## ఆస్పత్రుల్లో పలువురి పరిస్థితి విషమం

## కల్తీ మద్యం సరఫరాపై ఇద్దరి అరెస్ట్..

## కఠిన చర్యలకు సీఎం ఫడ్నవీస్ ఆదేశం

**పుణె, మే 29:** మహారాష్ట్రలో కల్తీ మద్యం మరోసారి ప్రాణాలు బలిగొంది. పుణె, పింప్రి-చింఛ్వాడ్ జంట నగరాల్లో కల్తీ మద్యం సేవించి ఇప్పటివరకు 11 మంది మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. పలువురు తీవ్ర అస్వస్థతకు గురై వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. లోకల్ మద్యం సేవించిన అనంతరం బాధితులు ఒక్కసారిగా వాంతులు, కంటిచూపు మందగించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలతో కుప్పకూలినట్లు సమాచారం. వెంటనే వారిని సమీప ఆస్పత్రులకు తరలించినప్పటికీ పలువురు చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఘటనపై స్పందించిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కల్తీ మద్యం తయారీ, విక్రయాల్లో పాల్గొన్న వారిని గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని సూచించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



ఇప్పటివరకు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు పింప్రి ఏసీపీ సచిన్ హిరే తెలిపారు. వీరిద్దరూ కల్తీ మద్యం సరఫరాలో కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.



# జాతీయ రహదారుల టెండర్లలో భారీ అక్రమాలు?

- 10.69 కోట్ల టెండర్లపై కేంద్రానికి ఫిర్యాదు
- టెండర్ రిగ్గింగ్ జరిగిందంటూ ఆరోపణలు
- అధికారులు, నిర్మాణ సంస్థలు కుమ్మక్కు
- కేంద్ర విజిలెన్స్ విచారణకు డిమాండ్
- బీజేపీ నేత ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి



**న్యూఢిల్లీ, మే 28:** ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి జిల్లాలో జాతీయ రహదారుల నిర్వహణకు సంబంధించిన రూ.10.69 కోట్ల టెండర్లలో భారీ అవినీతి, టెండర్ రిగ్గింగ్ జరిగిందని బీజేపీ ఏపీ సీనియర్ నేత ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి ఆరోపించారు. ఈ వ్యవహారంపై కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో పాటు ఆ శాఖ కార్యదర్శి వి. ఉమాశంకర్‌కు రాతపూర్వక ఫిర్యాదు చేశారు. కేంద్ర రోడ్డు రవాణా శాఖ జారీ చేసిన షార్ట్ టర్మ్ మెయింటెనెన్స్ టెండర్లలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. ఎన్ హెచ్-42, ఎన్ హెచ్-340 పరిధిలోని రహదారులు, ఆర్ఓబీ నిర్వహణ పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియలో నిర్మాణ సంస్థలు పరస్పరం కుమ్మక్కయ్యాయని ఆరోపించారు. అధికారుల సహకారంతో టెండర్ విలువను కృత్రిమంగా పెంచేందుకు కల్పిత బిడ్లు దాఖలు చేశారని తెలిపారు. కొంతమంది బిడ్డర్లను సాంకేతిక కారణాలతో అనర్హులుగా ప్రకటించి, తమకు అనుకూల సంస్థలకు టెండర్లు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఈ వ్యవహారంలో సంబంధిత సూపరింటెండింగ్ ఇంజనీర్ పాత్రపై కూడా అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. సమగ్ర విచారణ పూర్తయ్యే వరకు టెండర్ల ప్రక్రియను నిలిపివేయాలని విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. రహదారి పనుల అంచనాలు, కాంట్రాక్టర్ల అర్హతలు, ఇతర సాంకేతిక అంశాలపై కేంద్ర విజిలెన్స్ కమిషన్‌తో విచారణ జరిపించాలని కోరారు.

# తిరుపతిలో హోటల్‌కు బాంబు బెదిరింపు

## రాజ్ పార్క్ హోటల్‌లో కలకలం
## బాంబు, డాగ్ స్క్వాడ్లతో తనిఖీలు
## మరోసారి ఫేక్ కాల్‌గా తేలిన హెచ్చరిక

**తిరుపతి, 29 మే :** తిరుపతిలోని ప్రముఖ రాజ్ పార్క్ హోటల్‌కు బాంబు బెదిరింపు రావడంతో గురువారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓ అజ్ఞాత వ్యక్తి ఇంటర్నెట్ కాల్ ద్వారా హోటల్‌లో బాంబు పెట్టినట్లు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. విషయం తెలుసుకున్న వెంటనే భద్రతా సిబ్బంది హోటల్ పరిసర ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకుని తనిఖీలు ప్రారంభించారు. బెదిరింపు సమాచారంతో హోటల్ సిబ్బంది, అతిథులు కొంతసేపు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే అలిపిరి పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి సీఐ రామకృష్ణ నేతృత్వంలో ప్రత్యేక బృందాలు సంఘటన స్థలానికి చేరుకున్నాయి. బాంబు నిర్వీర్య దళం, డాగ్ స్క్వాడ్ బృందాలు హోటల్‌లోని ప్రతి అంతస్తు, గదులు, పార్కింగ్ ప్రాంతాలు, సమావేశ మందిరాలు, ఇతర కీలక ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి. అనుమానాస్పద వస్తువుల కోసం గంటలపాటు శోధన కొనసాగింది. పోలీసుల తనిఖీల్లో ఎటువంటి పేలుడు పదార్థాలు లేదా అనుమానాస్పద వస్తువులు లభించలేదు. దీంతో ఈ బెదిరింపు కాల్‌ను ప్రాథమికంగా ఫేక్ కాల్‌గా పోలీసులు గుర్తించారు. అయినప్పటికీ ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించకుండా పూర్తి స్థాయిలో తనిఖీలు చేపట్టి భద్రతా పరిస్థితిని సమీక్షించారు. హోటల్ నిర్వహణకు కూడా అవసరమైన భద్రతా సూచనలు జారీ చేశారు. బెదిరింపు కాల్ చేసిన వ్యక్తి వివరాలను గుర్తించేందుకు పోలీసులు సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నారు. ఇంటర్నెట్ కాల్ ద్వారా సమాచారం అందడంతో సైబర్ నిపుణుల సహకారంతో కాల్ మూలాలను గుర్తించే ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ తరహా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. గత ఆరు నెలల కాలంలో ఇదే తరహాలో తిరుపతిలోని పలు సంస్థలు, హోటళ్లు, ప్రజా ప్రదేశాలకు ఫేక్ ఈమెయిల్స్, కాల్స్ ద్వారా బెదిరింపులు వచ్చినట్లు తెలుస్తోంది. రాజ్ పార్క్ హోటల్‌కు కూడా ఇప్పటికే పలుమార్లు ఇలాంటి హెచ్చరికలు వచ్చినట్లు సమాచారం. వరుసగా ఐదుసార్లు ఫేక్ మెయిల్స్, కాల్స్ రావడం భద్రతా సంస్థలను అప్రమత్తం చేస్తోంది. ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ఉద్దేశంతో కొందరు ఇలాంటి తప్పుడు సమాచారాన్ని పంపిస్తున్నారని పోలీసులు భావిస్తున్నారు. ఇలాంటి కాల్స్ వచ్చిన ప్రతిసారీ పోలీసులు అత్యంత అప్రమత్తంగా స్పందిస్తూ పూర్తి స్థాయి తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రజలు నిరాధార ప్రచారాలను నమ్మకుండా అధికారుల సమాచారాన్నే విశ్వసించాలని, అనుమానాస్పద సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని అధికారులు సూచించారు.

# టెక్స్‌టైల్స్ హబ్‌గా ఏపీ అభివృద్ధి

## కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్

**విజయవాడ, మే 29:** ఏపీని టెక్స్‌టైల్స్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. 2030 నాటికి దేశం నుంచి 350 బిలియన్ డాలర్ల టెక్స్‌టైల్స్ ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. విజయవాడలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అరటి, చెరకు, పైనాపిల్ నారలతో ఉత్పత్తుల తయారీకి ప్రోత్సాహం ఇస్తున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు బ్రాండింగ్‌లో మాస్టర్ అని, ప్రధాని మోదీ, చంద్రబాబు విజనరీ నాయకులని కొనియాడారు. రాష్ట్ర మంత్రి సవిత మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం టెక్స్‌టైల్స్, అపెరల్ పాలసీ అమలు చేస్తోందని, చేనేత, హస్తకళాకారులకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కేంద్ర సహకారంతో ఏపీలో చేనేత, జౌళి రంగాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.

# ఏపీలో గ్రీన్ ఎనర్జీ కారిడార్

- 18 గిగావాట్లను ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానం కోసం 22 వేల కోట్లతో ప్రతిపాదనలు
- ప్రభుత్వ భవనాలపై సోలార్ ఏర్పాటు పనులు త్వరితగతిన చేపట్టాలి
- 2,898 హాస్టళ్లు, స్కూళ్లలో నెట్ జీరో విధానంలో సోలారైజేషన్
- నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పీఎం సూర్యఘర్ అమలు
- విద్యుత్ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, మే 29 :** రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఏర్పాటు చేసి.. ఆ మేరకు విద్యుత్ నెట్ వర్క్‌ను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేందుకు గ్రీన్ ఎనర్జీ కారిడార్-3లో భాగంగా సుమారు రూ. 22 వేల కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ శాఖపై సమీక్షించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ అంశం సహా విద్యుత్ సరఫరా పరిస్థితి, వచ్చే ఆరు నెలల ప్రణాళిక, పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్, పీఎంఈ-డ్రైవ్ పథకాల పురోగతి, ఏపీఐఈసీ పాలసీ కింద ఆమోదించిన వివిధ ప్రాజెక్టుల పరిస్థితి, నెడ్‌క్యాప్ బలోపేతం, డిజిటల్ ట్విన్ గ్రిడ్ నిర్మాణం వంటి అంశాలపై చర్చించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్‌లో భాగంగా ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ విస్తరించే అంశంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని సీఎం చంద్రబాబు అధికారులను అడిగారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్-3 కింద సుమారు 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ మేరకు కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్లు, పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్టు వెల్లడించారు. మొత్తంగా 18 గిగావాట్లల్లో సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే 11 గిగా వాట్ల విద్యుత్ ను... అలాగే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే సుమారు 7 గిగావాట్ల విద్యుత్ ను ప్రధాన గ్రిడ్ కు అనుసంధానించేలా చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు వివరించారు. ఈ మేరకు 2,261 కిలో మీటర్ల మేర కొత్త ట్రాన్స్ మిషన్ లైన్లు వేయనున్నట్టు వెల్లడించారు. ఈ కారిడార్లో భాగంగా 9,500 మెగా వాట్ల సామర్థ్యంతో 5 భారీ పూలింగ్ స్టేషన్లను నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు అధికారులు వెల్లడించారు. ముదిగుబ్బ, తలుపుల, రామాయపట్నం, పోరుమామిళ్ల, కొప్పాక ప్రాంతాల్లో పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... గ్రీన్ ఎనర్జీలో 160 గిగా వాట్ల ఉత్పత్తికి లక్ష్యం నిర్దేశించుకున్నామని.. దానికి అనుగుణంగా నెట్ వర్క్‌ను కూడా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఏపీ గ్రీన్ ఎనర్జీ కారిడార్ పూర్తి అయితే.. రాష్ట్రంలో డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్ ను సరఫరా చేసేందుకు ఈ నెట్ వర్క్ బాగా ఉపకరిస్తుందని అభిప్రాయపడ్డారు. ఇక విద్యుత్ మౌలిక సదుపాయాలు పెరిగితే.. ఆయా రంగాల్లో పెట్టుబడులు కూడా పెద్ద ఎత్తున వస్తాయని సూచించారు. ఈ ప్రాజెక్టును మొదలు పెట్టడంతోపాటు... టైమ్ బౌండ్ కార్యక్రమంగా పెట్టుకుని పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు.

## పీఎం సూర్య ఘర్ అమలులో వేగం పెరగాలి

సమీక్షలో భాగంగా పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ వంటి పథకాల అమలుపై సీఎం అధికారులతో చర్చించారు. అలాగే ప్రభుత్వ భవనాల సోలారైజేషన్ పనులు ఎంత వరకు వచ్చాయని అధికారులను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 200 మెగా వాట్ల సామర్థ్యంతో ప్రభుత్వ భవనాల సోలారైజేషన్ ప్రక్రియను మొదలు పెట్టినట్టు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ భవనాల సోలారైజేషన్ ప్రక్రియలో భాగంగా రెస్కో మోడల్ అనుసరిస్తున్నామని అధికారులు తెలిపారు. నెట్ మీటరింగ్ విధానంలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయనున్నట్టు అధికారులు తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ కింద చిత్తూరు జిల్లాలోని 78 గురుకుల పాఠశాలలు, వసతి గృహాలను ఎంపిక చేసినట్టు చెప్పారు. అలాగే నెట్ జీరో విధానంలో హెల్తీ క్యాంపస్ లను తీర్చిదిద్దేలా సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసేందుకు 2,898 హాస్టళ్లు, స్కూళ్లల్లో గుర్తించినట్టు అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, స్కూళ్లలో సోలార్ వినియోగం పెరిగితే.. ప్రభుత్వంపై విద్యుత్ భారం తగ్గుతుందని సీఎం చెప్పారు. ఈ విషయంలో అధికారులు పూర్తిగా ఫోకస్ పెట్టాలని స్పష్టం చేశారు. పీఎం సూర్యఘర్ పథకం అమల్లో ఏపీ నాలుగో స్థానంలో ఉందని... అగ్రస్థానంలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి 1,35,821 ఇళ్లకు సోలార్ ప్యానెళ్లు అమర్చామని.. మిగిలిన వాటిని ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇక బీసీ వర్గాలకు రూ. 20 వేల సబ్సిడీతో 10 లక్షల ఇళ్లకు సోలార్ ప్యానెళ్లను బిగించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని... వీటిని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం సూచించారు. ఇక రాష్ట్రంలో ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 131 ప్రాంతాల్లో 577 ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించినట్టు అధికారులు వెల్లడించారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీకి చెందిన 'ప్రవాహ్' సంస్థ ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ సహకారంతో, ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ సాంకేతిక నష్టాలను తగ్గించేలా చర్యలు తీసుకుంటున్న విధానాన్ని అధికారులు ప్రజెంట్ చేశారు. ఈ తరహాలో విద్యుత్ సరఫరా కోసం దేశంలోనే మొదటిసారిగా డిజిటల్ ట్విన్ గ్రిడ్ రూపొందిస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. ఈ సమీక్షలో భాగంగా విద్యుత్ డిమాండ్ ఏ మేరకు ఉందనే విషయాన్ని అధికారులు సీఎంకు వివరించారు. జూన్ 2026 నుంచి నవంబర్ 2026 వరకు రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 12,226 మెగావాట్లకు చేరి, రోజువారీ డిమాండ్ 226 నుంచి 261 మెగా యూనిట్లు వరకు ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మే 21న రాష్ట్రంలో అత్యధికంగా 15,016 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదైందని చెప్పారు. మే 27 వరకు 7,060 మెగాయూనిట్ల విద్యుత్ వినియోగం జరిగిందని అధికారులు వెల్లడించారు. 2025తో పోలిస్తే ఏప్రిల్--మే 2026 కాలంలో గరిష్ట డిమాండ్ 14.48 శాతం నుంచి 16.77 శాతానికి విద్యుత్ వినియోగం పెరిగిందని అధికారులు చెప్పారు. రైతులకు ఆర్థికంగా లబ్ధికలిగే సీబీజీ(కంప్రెస్డ్ బయో గ్యాస్)ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహించేలా పాలసీ చేశామని, సీబీజీ ప్లాంట్ల ఏర్పాటు విషయంలో అధికారులు చొరవ తీసుకుని త్వరితగతిత ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

## సీఎంను కలిసిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం బృందం

వరల్డ్ ఎకనమిక్ ఫోరం ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో భేటీ అయింది. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన దేశంలోనే తొలి థీమాటిక్ సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రీయల్ రెవెల్యూషన్- సీ 4 ఇఆర్ అమలు చేయాల్సిన కార్యాచరణపై ఈ బృందం చర్చించింది. సీ 4 ఇఆర్ ఏర్పాటుపై ఏపీ ట్రాన్స్ కో-వరల్డ్ ఎకనమిక్ ఫోరంతో గతంలోనే ఒప్పందం కుదిరింది. గ్రీన్ ఎనర్జీ, ఎనర్జీ ట్రాన్సిషన్, సైబర్ రెసిలియెన్స్ వంటి రంగాలపై సీ 4 ఇఆర్ అధ్యయనం చేయనుంది. రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సూచించారు. వివిధ రకాల విద్యుత్ ఉత్పత్తి మోడళ్లను పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి బెస్ట్ మోడల్ తయారు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విశాఖ డేటా సెంటర్ కారిడార్, గ్రీన్ హైడ్రోజన్ పెట్టుబడులు, పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సీ 4 ఇఆర్ కార్యాచరణతో అనుసంధానం చేయాలని సూచించారు. రిజల్ట్ ఓరియేంటేషనుతో సీ 4 ఇఆర్ పని చేయాలని సీఎం ఆదేశించారు. వచ్చే దావోస్ సదస్సు నాటికి నాటికి ఏపీ సాధించిన పురోగతిని ప్రదర్శించే స్థాయికి తీసుకెళ్లాలని సీ 4 ఇఆర్ కు సీఎం సూచించారు. ఈ సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్, సీఎస్ సాయిప్రసాద్, విద్యుత్, ట్రాన్స్ కో, జెన్కో, డిస్కంలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల అడ్డుకట్టకు 'ఏపీ సైబర్ గార్డ్'

- 6 పిల్లర్స్ రెస్పాన్స్ టీమ్స్‌తో నేరాలకు అడ్డుకట్టలి
- ప్రజలను అప్రమత్తం చేస్తూ.. సైబర్ పెట్రోలింగ్ జరగాలి
- ప్రజలు నష్టపోకుండా బ్యాంకులు సహకరించాలి
- పోలీసు శాఖ కార్యాచరణపై సమీక్షలో చంద్రబాబు



**అమరావతి, మే 29 :** రాష్ట్రంలో సైబర్ నేరాల అడ్డుకట్టకు జీరో ఎఫ్ఐఆర్ విధానం అమల్లోకి తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. బాధితులు సైబర్ వార్ రూమ్‌కు ఫోన్ చేసిన వెంటనే జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ద్వారా బ్యాంకులను అప్రమత్తం చేసి గోల్డెన్ అవర్ టైంను వినియోగించుకుని అకౌంట్ల నుంచి డబ్బులు బదిలీ కాకుండా చూడాలని సూచించారు. సైబర్ నేరాల అడ్డుకట్టకు బ్యాంకులూ సహరించాలన్నారు. సైబర్ నేరాలపై అన్ని వర్గాల ప్రజలను నిత్యం అప్రమత్తం చేయాలని, అవగాహనా కార్యక్రమాలు పెంచాలని సీఎం సూచించారు. పోలీస్ పెట్రోలింగ్ తరహాలోనే సైబర్ పెట్రోలింగ్ జరగాలని, ప్రజలు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా చూడాలని సీఎం సూచించారు. నేరం జరిగిన తరువాత ఫిర్యాదు రావడం, పోలీసులు విచారణ జరపడం కంటే...అసలు నేరమే జరిగే అవకాశం లేకుండా ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. రిటైర్డ్ ఉద్యోగులను టార్గెట్ గా చేసుకుని జరుగుతున్న నేరాల పట్ల వారికి అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. సైబర్ నేరాల అడ్డుకట్టకు తీసుకుంటున్న చర్యలపై సీఎం చంద్రబాబు సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. 6 పిల్లర్ రెస్పాన్స్ టీమ్స్‌తో వివిధ రకాల సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు తాము సిద్ధం చేస్తున్న ప్రణాళికలను ముఖ్యమంత్రికి డీజీపీ వివరించారు.

## జిల్లాల్లో సైబర్ యూనిట్లు.. రీజనల్ హబ్‌లు

ప్రజెంటేషన్‌పై డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ..."సైబర్ నేరాలను అరికట్టేందుకు సిక్స్ పిల్లర్ వ్యవస్థలతో ఏపీ సైబర్ గార్డ్ అనే సమగ్ర సైబర్ భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. 6 పిల్లర్ సైబర్ భద్రతా వ్యవస్థలో సైబర్ వార్ రూం, 1930 కాల్ సెంటర్ డాష్ బోర్డ్, టెక్నాలజీ ఉ ఏఐ, కెపాసిటీ బిల్డింగ్, 3-టైర్ ఆర్కిటెక్చర్, ప్రజా చైతన్యం వంటి కార్యక్రమాలు చేపడతాం. 6 పిల్లర్స్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర స్థాయిలో ఒక సైబర్ వార్ రూంను ఏర్పాటు చేస్తున్నాం. దీని కోసం మంగళగిరిలోని 'ప్రభల టెక్ పార్క్'లో ఇప్పటికే భవనాన్ని ఎంపిక చేశాం. ఈ సైబర్ వార్ రూంలో ఎమర్జెన్సీ రెస్పాన్స్, సైబర్ థ్రెట్ ఇంటలిజెన్స్ అండ్ ఎనలటిక్స్, సైబర్ సెక్యూరిటీ ఆపరేషన్స్, సైబర్ ట్రైనింగ్ అండ్ అవేర్నెస్ రీసెర్చ్, లీగల్, పాలసీ అండ్ కంప్లైంట్స్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేషన్ వంటి మొత్తం 11 విభాగాలు పనిచేస్తాయి. రానున్న 30 రోజుల్లో ఆధునిక సదుపాయాలతో ఈ వార్ రూం అందుబాటులోకి వస్తుంది. ఇప్పటికే అందుబాటులో ఉన్న 1930 హెల్ప్ లైన్ కాల్ సెంటర్‌ను మరింత బలోపేతం చేస్తాం. జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్, 1930 హెల్ప్‌లైన్‌తో సమగ్ర డ్యాష్‌బోర్డ్ తీసుకువస్తున్నాం. ఫిర్యాదు వచ్చిన 10 నిమిషాల్లో బ్యాంకును సంప్రదించి నిందితుని అకౌంట్లో డబ్బులు ఫ్రీజ్ చేసేలా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. సైబర్ నేరాలపై టెక్నాలజీ ఉ ఏఐ ఉపయోగించుకునేందుకు ఆర్బీఐ, ప్రముఖ బ్యాంకులతో కలిసి మూలే హంటర్. ఏఐ అమలు దిశగా చర్యలు తీసుకువస్తున్నాం. కెపాసిటీ బిల్డింగ్‌లో భాగంగా ఏడాది కాలంలో 500 మంది పోలీసు అధికారులకు సైబర్ క్రైంపై ట్రైనింగ్ ఇస్తాం. 3 టైర్ ఆర్కిటెక్చర్ ద్వారా 28 జిల్లాల్లో సైబర్ యూనిట్లతో పాటు 4 చోట్ల రీజనల్ హబ్‌లను ఏర్పాటు చేస్తాం. వీటితో పాటు ప్రజలు సైబర్ క్రైం బారిన పడకుండా పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఏడాదిలో 3 వేల కార్యక్రమాలు వివిధ స్థాయిల్లో, వివిధ రూపాల్లో చేపడతాం. ఏపీ సీఐడీ, ఏపీటీఎస్ బృందం న్యూఢిల్లీలోని ఇండియన్ సైబర్ క్రైం కో ఆర్డినేషన్ సెంటర్‌ను సందర్శించి అక్కడి వ్యవస్థలను అధ్యయనం చేసింది. అక్కడ అవలంభిస్తున్న పాలసీల ఆధారంగా రాష్ట్ర సైబర్ ఫ్యూషన్ సెంటర్ రూపకల్పన చేపడుతున్నాం. టాప్ బ్యాంక్‌ల నోడల్ అధికారుల నియామకం, 30 నిమిషాల ఎస్ఎల్ఏ కోసం బ్యాంకులతో ఒప్పందాలు చేసుకుంటాం. సీసీఎస్ పోలీస్ స్టేషన్లను ప్రత్యేక దర్యాప్తు యూనిట్లుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించాము. ఈ విధంగా అన్ని చర్యలను తీసుకుని సైబర్ మోసాలకు, నేరాలకు అడ్డుకట్ట వేస్తాం" అని ముఖ్యమంత్రికి డీజీపీ వివరించారు.

## డిజిటల్ అరెస్టులని ఫోన్ చేసేవాళ్లు అరెస్టవ్వాలి

అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ...."రాష్ట్రాన్ని సైబర్ నేరాల రహిత రాష్ట్రంగా మార్చాలి. దీని కోసం అన్ని బ్యాంకర్లు, పోలీసు విభాగం, ఏపీటీఎస్, ఆర్థిక శాఖలు సమన్వయంతో పనిచేయాలి. నేరస్తులు కొత్త కొత్త పద్ధతుల్లో నేరాలకు పాల్పడుతున్నందున దానికి అనుగుణంగా పోలీసుల కౌంటర్ ప్లాన్ ఉండాలి. ముఖ్యంగా డిజిటల్ అరెస్టు విషయంలో విద్యావంతులు సైతం మోసపోతున్నారని... డిజిటల్ అరెస్టు లేదనే విషయాన్ని ప్రజల్లో నాటకుపోయేలా చేయాలి. డిజిటల్ అరెస్టులని ఫోన్ చేసేవాళ్లు అరెస్టై తీరాలి. ఆ తరహాలో కఠిన చర్యలు ఉండాలి. ఏళ్ల తరబడి కష్టపడి ప్రజలు దాచుకున్న సొమ్ములను సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టుల పేరుతో దోచుకుంటున్నారు. దీని వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వస్తోంది. ఏపీ సైబర్ నేరాల నియంత్రణకు తీసుకునే చర్యలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలి. సైబర్ నేరగాళ్ల పట్ల అత్యంత కఠినంగా వ్యవహరించాలి. ఏపీ ప్రజలను మోసం చేస్తే....తప్పించుకోలేం అనే హెచ్చరిక క్రిమినల్స్‌కు చేరాలి. ఆ స్థాయిలో భయం కల్పించేలా పోలీసు దర్యాప్తు, యాక్షన్ ఉండాలి" అని సీఎం చంద్రబాబు అన్నారు. సచివాలయంలో జరిగిన సమీక్షకు సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్, ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ, స్పెషల్ సెక్రటరీ విజయ్ కుమార్ పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పేదలకు సంతృప్తినిచ్చేలా అర్బన్ ఇందిరమ్మ ఇళ్ల డిజైన్లు

**హైదరాబాద్, మే 29:( సమయం న్యూస్) :** పట్టణ పేదలకు సౌకర్యవంతమైన, భద్రమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్‌కు అనుగుణంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్ల ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. క్యూర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నమూనా డిజైన్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

రాబోయే 40--50 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్మాణాలు చేపట్టాలని, డ్రైనేజీ, పార్కింగ్, వాణిజ్య అవసరాలు, ప్రజల జీవనశైలికి అనుగుణంగా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అవసరమైతే స్థానిక పరిస్థితులను బట్టి 10 అంతస్తుల వరకు భవనాలు నిర్మించేలా చూడాలన్నారు. హాల్, బెడ్‌రూమ్, కిచెన్, బాత్‌రూమ్ పరిమాణాలతో పాటు వాస్తు అంశాలకు



ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. పార్కింగ్‌తో పాటు షాపుల ఏర్పాటుకు కూడా అవకాశం ఉండేలా డిజైన్లు ఉండాలని చెప్పారు. ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని, ప్రజలు ఉపాధికి దూరం కాకుండా అదే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి తుది డిజైన్లను ఖరారు చేసి, యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

# వార్తా మాధ్యమాలకు ధ్యానం అవసరం

## -- శాంతి సరోవర్ మీడియా సదస్సులో నిపుణుల పిలుపు

**హైదరాబాద్, మే 29:( సమయం న్యూస్).** సమాజంలో శాంతి, సామరస్యాన్ని నెలకొల్పడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, అయితే జర్నలిస్టులు ముందుగా తమలో అంతరంగిక ప్రశాంతతను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ప్రముఖులు అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ క్యాంపస్‌లో నిర్వహించిన "మీడియా, ధ్యానం మరియు సామాజిక శాంతి" సదస్సులో ఈ విషయాన్ని ప్రస్తావించారుతెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమని, తప్పుడు వార్తలు, విభజనాత్మక ప్రచారం సమాజాన్ని బలహీనపరుస్తాయని అన్నారు. జర్నలిస్టులు రాజయోగ ధ్యానం వంటి సాధనల ద్వారా మానసిక ప్రశాంతతను పొందితే సమాజ శాంతికి మరింతగా దోహదపడగలరని పేర్కొన్నారు. బ్రహ్మకుమారీస్ హైదరాబాద్ జోన్ డైరెక్టర్ బీకే కుల్దీప్ దీదీ మాట్లాడుతూ మాటల శక్తి అపారమని, మీడియా ద్వారా సానుకూల మార్పు తీసుకురావాలంటే అంతరంగ శుద్ధి, ప్రశాంతత అవసరమని సూచించారు. ముంబైకి చెందిన వైద్య నిపుణుడు డాక్టర్ సచిన్ పరేబ్ ఒత్తిడి వల్ల గుండెజబ్బులు, రక్తపోటు, మానసిక సమస్యలు పెరుగుతున్నాయని, సరైన జీవనశైలి, విశ్రాంతి, ధ్యానం అవసరమని వివరించారుసీనియర్ జర్నలిస్టు గౌరీశంకర్ సామాజిక



మాధ్యమాల్లో తప్పుడు వార్తల వ్యాప్తిపై ఆందోళన వ్యక్తం చేయగా, బ్రహ్మకుమారీస్ జాతీయ మీడియా సమన్వయకర్త బీకే సుశాంత్ భాయ్ మీడియా సానుకూల మార్పుకు వేదిక కావాలని సూచించారు. జర్నలిజం అధ్యాపకుడు డాక్టర్ సురేశ్ వర్మ విలువలతో కూడిన సానుకూల జర్నలిజం సామాజిక శ్రేయస్సుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. సుమారు 100 మంది మీడియా ప్రతినిధులు పాల్గొన్న ఈ సదస్సు, విలువలు మరియు అంతరంగిక శాంతితో కూడిన మీడియా సమాజ నిర్మాణంలో శక్తివంతమైన పాత్ర పోషించగలదనే సందేశంతో ముగిసింది.

# గ్రామీణ మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

## -- SERP ఆధ్వర్యంలో ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్ ప్రారంభం

**హైదరాబాద్, మే 29:,( సమయం న్యూస్) :** గ్రామీణ మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం SERP ఆధ్వర్యంలో డే-ఎన్‌ఆర్‌ఎల్‌ఎం (ణాహ్-చీ=ాావీ) కింద ప్రత్యేక ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. హైదరాబాద్‌లోని కొమురం భీం ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి దనసరి అనసూయ సీతక్క ఈ పథకాన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 300 స్వయం సహాయక సంఘాల (ాఎ+) మహిళల ఆధ్వర్యంలోని గ్రామీణ వ్యాపార సంస్థలను ఎంపిక చేసి అభివృద్ధి చేయనున్నారు. మొత్తం ₹21.40 కోట్ల వ్యయంతో అమలు కానున్న ఈ పథకంలో ₹8.74 కోట్లు ఇంక్యుబేషన్ మద్దతుకు, ₹12.66 కోట్లు గ్రాంట్లు మరియు వడ్డీలేని సాఫ్ట్ లోన్ల రూపంలో అందించనున్నారు. బిట్స్ పిలానీ





హైదరాబాద్, టీ-హబ్ భాగస్వామ్య సంస్థలుగా, డబ్ల్యూ-ఈ హబ్ సాంకేతిక సహాయ సంస్థగా వ్యవహరిస్తున్నాయి. ఎంపికైన మహిళా వ్యాపారవేత్తలకు శిక్షణ, మెంటరింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్, ఈ-కామర్స్, ఆర్థిక అనుసంధానం, మార్కెట్ అవకాశాల కల్పన వంటి సమగ్ర సేవలు అందించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించిన "కోటి మహిళలు కోటీశ్వరులు" లక్ష్య సాధనలో ఈ కార్యక్రమం కీలకమని అన్నారు. మహిళలు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ పథకం ద్వారా మహిళల వ్యాపారాల ఆదాయాన్ని ఏటా కనీసం 15 శాతం పెంచడంతో పాటు రాష్ట్రంలో 300 నుంచి 500 వరకు కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది.

# బ్రిక్స్ ఎంఎస్‌ఎంఈ సహకారాన్ని ముందుకు తీసుకెళ్తున్న భారత్

**న్యూఢిల్లీ:మే29( సమయ్దం న్యూస్) :** 2026 బ్రిక్స్ అధ్యక్షతలో భాగంగా భారత్ ఎంఎస్‌ఎంఈల సాంకేతిక అభివృద్ధి, ఆవిష్కరణల వాణిజ్యీకరణపై ప్రత్యేక దృష్టి సారించింది. కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బ్రిక్స్ పార్టనర్ ట్రాక్ కింద రెండో ఎస్‌ఎంఈ వర్కింగ్ గ్రూప్ సమావేశం విజయవంతంగా నిర్వహించారు. "ఎంఎస్‌ఎంఈలకు సాంకేతికత అందుబాటును మెరుగుపరచడం" అనే అంశంపై జరిగిన ఈ సమావేశంలో బ్రిక్స్ సభ్య దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆవిష్కరణలు, సాంకేతిక వాణిజ్యీకరణ ద్వారా ఎంఎస్‌ఎంఈల సామర్థ్యాన్ని పెంచడం, మార్కెట్ అవకాశాలను విస్తరించడం, డిజిటల్ పరివర్తనను వేగవంతం చేయడం వంటి అంశాలపై చర్చించారు. భారత్ అధ్యక్షతలో బ్రిక్స్ వేదికను ఎంఎస్‌ఎంఈల అంతర్జాతీయ సహకారం, సాంకేతిక మార్పిడి, వ్యాపార అవకాశాల పెంపునకు ఉపయోగించుకునే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

# వడగాల్పులను జాతీయ విపత్తుగా ప్రకటించాలి: సంతోష్ కుమార్

**బెంగళూరు మే29( సమయం న్యూస్) :** దేశంలో వాతావరణ మార్పుల ప్రభావం తీవ్రంగా పెరుగుతున్న నేపథ్యంలో వడగాల్పులను జాతీయ విపత్తుగా ప్రకటించాలని మాజీ రాజ్యసభ సభ్యుడు, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వ్యవస్థాపకుడు జోగినపల్లి సంతోష్ కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బెంగళూరులో నిర్వహించిన 'క్లైమేట్ ఇన్నోవేషన్ సమిట్-2026'లో పాల్గొన్న ఆయన, పర్యావరణ విధానాలు మరియు క్షేత్రస్థాయి అమలుకు మధ్య ఉన్న "మిస్సింగ్ మిడిల్"నే ప్రధాన సమస్యగా అభివర్ణించారు. ప్రభుత్వ విధానాలు గ్రామీణ స్థాయికి సమర్థవంతంగా చేరడం లేదని పేర్కొన్న సంతోష్ కుమార్, ప్రజల భాగస్వామ్యంతో పర్యావరణ పరిరక్షణ ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ద్వారా కోట్లాది మొక్కల నాటకం దీనికి నిదర్శనమని చెప్పారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా వడగాల్పులతో అధిక ప్రాణనష్టం సంభవిస్తున్నప్పటికీ, వాటిని ఇంకా జాతీయ విపత్తుగా గుర్తించకపోవడం ఆందోళనకరమని వ్యాఖ్యానించారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. కార్బన్ క్రెడిట్ ట్రేడింగ్ వ్యవస్థలో కేవలం పెద్ద సంస్థలకే కాకుండా గ్రామ పంచాయతీలు, స్థానిక సమాజ ఆధారిత ప్రాజెక్టులకు కూడా అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి కళాశాల ప్రాంగణాన్ని 'క్లైమేట్ గవర్నెన్స్ యూనిట్'గా అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. సదస్సును కార్బన్-నెగెటివ్ కార్యక్రమంగా మార్చేందుకు గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఆధ్వర్యంలో ప్రతినిధుల పేర్లతో జియో-ట్యాగ్ చేసిన వెదురు మొక్కలను నాటినట్లు తెలిపారు. 2026 డిసెంబర్‌లో హైదరాబాద్‌లో జరగనున్న ఎఎఎవతీఘఝఎ జశ్రీఅఘ్షవ ాూఘ్టఅశీఅ ఔవవఎ 2026 కార్యక్రమానికి హాజరుకావాలని పర్యావరణ రంగ ప్రతినిధులను ఆయన ఆహ్వానించారు.

## యాప్రాల్ డివిజన్‌లో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం



**యాప్రాల్, మే 29:** యాప్రాల్ డివిజన్ పరిధిలోని దేవి కళ్యాణ్ కాలనీ, ఎంప్లాయిస్ కాలనీలో అంతర్గత రోడ్లపై మురికి నీరు పారుతుండటంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహేష్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు వెంటనే స్పందించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించే చర్యలు చేపట్టించారు. డ్రైనేజీ సమస్యను సకాలంలో పరిష్కరించడంతో పాటు కాలనీ పరిసరాలను పూర్తిగా శుభ్రం చేయించారు. దీంతో కాలనీలో పరిశుభ్రమైన వాతావరణం నెలకొనగా స్థానికులు మహేష్ యాదవ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా మహేష్ యాదవ్ మాట్లాడుతూ, కాలనీ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన వంతుగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అలాగే యాప్రాల్ డివిజన్‌కు సంబంధించిన ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే, వాటిని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

## ట్రైకార్ వార్షిక ప్రణాళికకు బోర్డు ఆమోదం

### రూ.2,546.24 కోట్లతో 1.36 లక్షల మంది గిరిజన యువతకు ఆర్థిక సహకారం



**హైదరాబాద్, మే 29:( సమయం న్యూస్).** తెలంగాణ షెడ్యూల్ తెగల ఆర్థిక సహకార సంస్థ (ట్రైకార్) 11వ బోర్డు సమావేశం ట్రైకార్ చైర్మన్ డా. బెల్లయ్య నాయక్ తేజావత్ అధ్యక్షతన నిర్వహించబడింది. సమావేశంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ. 2,546.24 కోట్ల వార్షిక ప్రణాళికకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారుప్రణాళికలో భాగంగా రూ. 2,085 కోట్లు సబ్సిడీగా, రూ. 461.24 కోట్లు బ్యాంకు రుణాల రూపంలో గిరిజన యువతకు ఆర్థిక సహకారం అందించనున్నారు. రాజీవ్ యువ వికాసం, ఆదిమ గిరిజనుల జీవనోపాధి అభివృద్ధి, రూరల్ ట్రాన్స్‌పోర్ట్, రైతుల యాంత్రీకరణ, ఆటో రిక్షాల ఎలక్ట్రిక్ రీట్రోఫిట్టింగ్, సీఎం ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్, ఇందిరా సౌర గిరి జల వికాసం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ వంటి పథకాలను అమలు చేయనున్నారు. ఈ ప్రణాళికల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1,36,184 మంది గిరిజన యువతకు లబ్ధి చేకూరనుందని డా. బెల్లయ్య నాయక్ తేజావత్ తెలిపారు. సమావేశంలో ట్రైకార్ డైరెక్టర్, ఎక్స్ అఫీషియో మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ సంతోష్ బి.ఎం., ఐఏఎస్‌తో పాటు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు

### తొలి విడతగా రూ. 2,000 కోట్ల బకాయిలు విడుదల!

**హైదరాబాద్ మే29( సమయం న్యూస్). :** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని తెలంగాణ ప్రభుత్వం మరోసారి నిరూపించుకుంది. ఉద్యోగులకు ఇచ్చిన హామీని కేవలం మాటలకే పరిమితం చేయకుండా, చేతల్లో చూపించింది. ఉద్యోగుల సుదీర్ఘకాల బకాయిలను కేవలం 100 రోజుల్లో రూ. 6,000 కోట్లు విడుదల చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు ఉద్యోగ జేఏసీ (జీూజ) నాయకులకు స్పష్టమైన హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ హామీని నెరవేర్చే దిశగా, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈరోజు (శుక్రవారం) తొలి విడతగా రూ. 2,000 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈరోజు విడుదల చేసిన నిధులతో రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి కీలకమైన బకాయిలను ప్రభుత్వం పూర్తిగా చెల్లించింది. రిటైర్డ్ ఉద్యోగుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (ఞాఖీ) బకాయిల మొత్తాన్ని వంద శాతం క్లియర్ చేశారు. అదేవిధంగా రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి మే 2025 వరకు పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలన్నింటినీ పూర్తిగా చెల్లించారు. "ముందస్తు ప్రణాళికలు, పక్కా కార్యాచరణతోనే ఇది సాధ్యమైంది. ఇచ్చిన మాట ప్రకారం మిగిలిన రూ. 4,000 కోట్ల బకాయిలను కూడా నిర్ణీత గడువులోగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయడానికి ప్రభుత్వం శరవేగంగా కసరత్తు చేస్తోంది." ఉద్యోగుల పట్ల ప్రభుత్వం చూపుతున్న ఈ శ్రద్ధ మరియు శరవేగ నిర్ణయాలపై ఉద్యోగ సంఘాల నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నారు..

## ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS
- తెలియని లింకులు, OTP\T ఎవరికీ చెప్పొద్దు.
- ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.
- సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 కు ఫిర్యాదు చేయాలి.



**నారాయణపేట, మే,29(సమయం న్యూస్) :** నారాయణపేట: ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS తెలిపారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, ముఖ్యంగా ఆన్‌లైన్ బ్యాంకింగ్, UPI లావాదేవీలు, సోషల్ మీడియా, ఫేక్ కాల్స్, ఫేక్ లింకుల ద్వారా మోసాలు అధికమవుతున్నాయని తెలిపారు. సైబర్ నేరగాళ్లు బ్యాంకు అధికారులు, పోలీసు అధికారులు, కస్టమర్ కేర్ ప్రతినిధుల పేరుతో ఫోన్ చేసి ఆఖాలు, బ్యాంకు వివరాలు, ATM PIN నంబర్లు అడిగి డబ్బులు దోచుకుంటున్నారని పేర్కొన్నారు. అలాంటి కాల్స్ వచ్చినప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని హెచ్చరించారు. అలాగే మీ ఖజ గడువు ముగిసింది, లాటరీ గెలిచారు, పార్సిల్ ఆగిపోయింది, జాబ్ ఆఫర్ వచ్చింది, ఉన్నత అధికారులు ఫోటోలు వాట్సప్ మెసేజ్ లు చేసి డబ్బులు పంపాలని అలాంటి సందేశాలు పంపి ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. తెలియని లింకులు క్లిక్ చేయడం వల్ల మొబైల్ ఫోన్లలో హానికరమైన యాప్‌లు ఇన్‌స్టాల్ అయి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు మాయం అయ్యే అవకాశముందని చెప్పారు. సోషల్ మీడియా వేదికల్లో ఫేక్ అకౌంట్లు సృష్టించి ఫోటోలు, వీడియోలను దుర్వినియోగం చేయడం, పెట్టుబడుల పేరుతో అధిక లాభాలు వస్తాయని నమ్మబలికి మోసం చేయడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు సోషల్ మీడియాలో అపరిచితులపై నమ్మకం ఉంచరాదని సూచించారు. ఆన్‌లైన్ షాపింగ్ సమయంలో అధికారిక వెబ్‌సైట్లు, నమ్మకమైన యాప్‌లను మాత్రమే ఉపయోగించాలని తెలిపారు. ఫేక్ వెబ్‌సైట్లు, తక్కువ ధరల ఆఫర్ల పేరుతో జరుగుతున్న మోసాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930 కు కాల్ చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. అదేవిధంగా అధికారిక సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయవచ్చని పేర్కొన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు, యువత, వ్యాపారులు, మహిళలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. సైబర్ భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత. అప్రమత్తతే సైబర్ మోసాలకు ప్రధాన ఆయుధం అని జిల్లా ఎస్పీ తెలిపారు.

## చేనేత మగ్గాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక ఐఏఎస్





**నారాయణపేట, మే,29(సమయం న్యూస్) :** నారాయణ పేట జిల్లా కేంద్రంలోని గాంధీ నగర్ వీధిలో గల చేనేత సహకార సంఘం (లిమిటెడ్ ) కార్యాలయంలో చేనేతే మగ్గాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక పరిశీలించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు ఏ విధంగా మగ్గాలను నేస్తున్నారు ? వారికి రోజువారీ కూలీ ఎంత చెల్లిస్తున్నారని చేనేత జౌళి శాఖ అధికారి బాబును అడిగి తెలుసుకున్నారు. మగ్గం పై ఓ చేనేత కార్మికురాలు నేస్తున్న కాటన్ చీరను ఆమె పరిశీలించారు. చేనేత కార్మికుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే జిల్లాలో ఉన్నటువంటి మొత్తం సంఘాలకు,చేనేత కార్మికులకు ప్రభుత్వం ద్వారా ఏ ఏ పథకాలు అమలు జరుగుతున్నాయని ఏ డీ ని ప్రశ్నించగా నేతన్న పొదుపు, నేతన్న భద్రత, నేతన్న భరోసా, క్లస్టర్ డెవలప్మెంట్ స్కీములు ,క్యాష్ క్రెడిట్, వ్యక్తిగత రుణాల మాఫీ చేనేత కార్మికులకు వర్తిస్తుందని ఏ డీ బాబు కలెక్టర్ కు వివరించారు. నేత కార్మికులు చేతితో నేసిన నారాయణపేట కాటన్ చీరను జిల్లా కలెక్టర్ కొనుగోలు చేశారు.

## గురుకులాల్లో సీట్ల భర్తీకి భారీ స్పందన



**హైదరాబాద్, మే 29:( సమయం న్యూస్)** తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యాసంస్థల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రవేశాలకు విశేష స్పందన లభించింది. మొత్తం 19,740 సీట్లకు గాను ఫేజ్-1లోనే 18,401 సీట్లు భర్తీ కాగా, 93.21 శాతం అడ్మిషన్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, పేద, దళిత, గిరిజన విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను ఉచితంగా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 45,357 దరఖాస్తులు రాగా, 39,052 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. ఎంపికైన విద్యార్థులు జూన్ 7లోపు ప్రవేశాలు పూర్తి చేసుకోవాలని మంత్రి సూచించారు. గురుకుల విద్యార్థులు జాతీయ స్థాయి పరీక్షల్లోనూ రాణిస్తున్నారని, జీజుజు మీఖఅఅ-2026లో 337 మంది అర్హత సాధించారని మంత్రి తెలిపారు. ××ు-జీజుజు, చీజుజు, చీణూ, జూూ వంటి పరీక్షల్లో గురుకుల విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారని పేర్కొన్నారు.

## సేవా సే సమృద్ధి సదస్సు: గ్రామ పంచాయతీలు

- సీఎస్‌సీల సమన్వయంతో గ్రామీణ సేవల బలోపేతం
- తెలంగాణ లోని శివారెడ్డి గూడెం గ్రామ పంచాయతీకి సత్కారం.

**గువాహటి, మే 29( సమయం న్యూస్) :** గ్రామీణ ప్రాంతాల్లో సేవల పంపిణీని మరింత సమర్థవంతంగా చేయడం, ప్రజల జీవన సౌలభ్యాన్ని పెంచడం లక్ష్యంగా కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ గువాహటిలో 'సేవా సే సమృద్ధి: పంచాయతీ ఆధ్వర్యంలోని సేవల పంపిణీ' పేరుతో ప్రాంతీయ సదస్సును నిర్వహించింది. కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) ప్రత్యేక ప్రయోజన వాహకం, అసోం ప్రభుత్వ పంచాయతీ రాజ్--గ్రామీణాభివృద్ధి శాఖల సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. కేంద్ర పంచాయతీరాజ్ సహాయ మంత్రి ప్రొఫెసర్ ఎస్.పీ. సింగ్ బఘేల్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో అసోం, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల పంచాయతీ ప్రతినిధులు, గ్రామ స్థాయి పారిశ్రామికవేత్తలు (వీఎల్‌ఈలు), అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి బఘేల్ మాట్లాడుతూ గ్రామాలు, రైతులు, గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధే దేశ సమృద్ధికి పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సీఎస్‌సీలు కోట్లాది మందికి పెన్షన్లు, ధ్రువపత్రాలు, బీమా, సంక్షేమ పథకాల సేవలను సులభంగా అందిస్తున్నాయని తెలిపారు. ఆధార్, బ్యాంకు, భూ రికార్డుల్లో ఖచ్చితత్వం పెరగడం ద్వారా పీఎం-కిసాన్ వంటి పథకాల ప్రయోజనాలు అర్హులందరికీ చేరుతాయని చెప్పారు. గ్రామ పంచాయతీలు, సీఎస్‌సీల మధ్య సమన్వయం పెంచి ప్రతి గ్రామీణ పౌరుడికి ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇది 'వికసిత్ భారత్--2047' లక్ష్య సాధనకు దోహదపడుతుందని పేర్కొన్నారు. సదస్సులో జాతీయ ఇ-పరిపాలన పురస్కారాలు--2025లో గుర్తింపు పొందిన ఒడిశాలోని సువాకటి గ్రామ పంచాయతీ, తెలంగాణలోని శివారెడ్డిగూడెం గ్రామ పంచాయతీలను సత్కరించారు. అలాగే గ్రామీణ స్థాయిలో డిజిటల్ సేవలందించడంలో విశేష కృషి చేసిన పలువురు విలేజ్ లెవల్ ఎంటర్‌ప్రెన్యూర్లను కూడా అభినందించారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ సచివాలయ వ్యవస్థ, తెలంగాణ మీసేవ, ఒడిశా ఒడిశావన్, రాజస్థాన్ ఈ-మిత్ర, పంజాబ్ ఈ-సేవ వంటి సేవా వేదికల ద్వారా గ్రామీణ ప్రజలకు అందుతున్న సేవలపై రాష్ట్రాల ప్రతినిధులు అనుభవాలను పంచుకున్నారు. గ్రామీణ పాలనలో సాంకేతికత, డిజిటల్ సేవల వినియోగాన్ని విస్తరించడంపై నిపుణులు పలు సాంకేతిక సదస్సులు నిర్వహించారు.

## ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా




**ఆసిఫాబాద్ మే29( సమయం న్యూస్) :** ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. శుక్రవారం జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, జిల్లా కలెక్టర్ కె.హరిత, ఎస్.పి. నితికా పంత్ లతో కలిసి వందేమాతర గీతం ఆలపించి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రజలకు అందించే పౌష్టిక ఆహారం, ప్రజల ఆరోగ్యంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ జిల్లా వైద్య పరంగా అభివృద్ధికి కృషి చేసి రోగులకు మెరుగైన సేవలు ఖండించాలని తెలిపారు. జిల్లాలో 464 మంది క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్నారని, వారికి జిల్లా అధికారులు ఒక్కొక్కరిని దత్తత తీసుకొని, నెలకు సరిపడా మందులు, పౌష్టిక ఆహారం అందించాలని తెలిపారు. చాలామంది రోజు దగ్గు, పరువు తగ్గుదల, ఆరోగ్య క్షీణత పై బయటకు చెప్పకుండా లో లోపల మదన పడుతుంటారని, బయటకు చెబితే సమాజం చిన్నచూపు చూస్తారని ఎవరికీ చెప్పకుండా ఆందోళన చెంచుతుంటారని, అలాంటి వారిని గుర్తించి వారికి అవగాహన కల్పించి సరైన వైద్య చికిత్సలు అందించాలని తెలిపారు. చికిత్స అనంతరం క్షయ వ్యాధి నయం అవుతుందని, చికిత్సలు పొందాలని అవగాహన కల్పించాలని తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు, మత్తుకు బానిసై తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, నషా ముక్త్ భారత్ వైపు అడుగులు వేయాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయని, స్వయం సహాయక సంఘాల సహకారం తీసుకోవాలని తెలిపారు. జిల్లా అభివృద్ధి పనుల లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. సమాజంలో జరిగే అరాచకాలపై మౌనంగా ఉండొద్దని, ప్రజా వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. జిల్లా అభివృద్ధికి అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని, ఆకాంక్షిత జిల్లాలో అభివృద్ధి పథంలో తీసుకువెళ్లాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ జిల్లాలో శాఖల వారీగా చేపడుతున్న సేవలు, సంక్షేమ అభివృద్ధి పనులపై గవర్నర్ కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎస్.పి. నితికా పంత్ జిల్లాలో శాంతి భద్రతల పట్ల, మాదకద్రవ్యాల చర్యలపై వివరించారు. అంతకుముందు హెలికాప్టర్ ద్వారా జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ కు జిల్లా కలెక్టర్, ఎస్.పి., జిల్లా అధికారులు స్వాగతం పలికిన అనంతరం రాష్ట్ర గవర్నర్ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యత్వం తీసుకున్న కలెక్టర్ కు ధృవపత్రం ప్రధానం చేశారు. రాష్ట్ర గవర్నర్, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి లకు జిల్లా అధికారులు జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్, అదనపు ఎస్.పి. (అడ్మిన్) చిత్తరంజన్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా అధికారులు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలి

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి.**



**యాలాల, మండలం, మే,29(సమయం న్యూస్) :** శుక్రవారము తాండూర్ నియోజకవర్గం యాలాల్ మండలం లక్ష్మీనారాయణ రైస్ మిల్లు,ఐ కే పి సెంటర్, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు, జనగణనకు సంబంధించి అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో భాగంగా లక్ష్యంగా పెట్టుకున్న ధాన్యాన్ని అన్లోడింగ్ చేయాలని,లారీలు, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, ధాన్యం అన్లోడింగ్ వేగవంతం చేయాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలిగిం చకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులకు ఆదేశించారు. యాలాల్ మండలంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ను అధికారులతో కలిసి పరిశీలించారు. లారీలు ఎన్ని వస్తున్నాయని ఆరా తీశారు. లక్ష్మీనారాయణ పూర్ లో శ్రీ బాలాజీ రైస్ మిల్ ను సందర్శించారు. ధాన్యం కొనుగోలు స్టాక్ వివరాలను మిల్ యజమానితో వివరాల పై ఆరా తీశారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా దాన్యం కొనుగోలు చేసి తరలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. యాలాల్ మండల కేంద్రంలో కొనసాగుతున్న జన గణన ప్రక్రియ నమోదును పరిశీలించారు. జనగణన నమోదు లో ఏవైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టి కి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. మండలం లో నిర్మాణములో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. అనంతరం మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించారు. పాఠశాల లో నా బార్డ్ నిధులతో జరుగుతున్న నిర్మాణ పనులు టాయిలెట్లు, అదనపు గదుల నిర్మాణా పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా విద్యాశాఖాధికారి రేణుకదేవి, తాండూర్ ఆర్డీవో అనిత, యాలాల తహసీల్దార్ గాయత్రి, ఎంపీడీఓ శ్రీనిజ, డీ. టీ. కిరణ్ కుమార్, ఆర్ఐ. శివ చరణ్, ఎంపీవో ఆనంద్ రావు, డీఎం సి ఎస్ మోహన్ కృష్ణ , డి ఎస్ ఓ సుదర్శన్, మండల విద్యాధికారి మహిపాల్ రెడ్డి సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## అంబులెన్స్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక ఐఏఎస్

**నారాయణపేట, మే,29(సమయం న్యూస్) :** కోటక్ మహీంద్రా బ్యాంక్ సీ ఎస్ ఆర్ కార్యక్రమం కింద ఇచ్చిన కొత్త అంబులెన్స్ ను శుక్రవారం జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక కలెక్టరేట్ ఆవరణలో శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోటక్ బ్యాంకు రీజినల్ హెడ్ శ్యామల ఘంటసాల, సర్కిల్ మేనేజర్ చందన్ ఫిలిప్, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ సత్య ప్రసాద్ , బ్రాంచ్ మేనేజర్ రాఘవేంద్ర గౌడ్ పాల్గొన్నారు.



# దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మాణం అవుతుంది

- నేటి విద్యార్థులే రేపటి పౌరులు,శాస్త్రవేత్తలు,
- రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి,మత్స్య, క్రీడలు- యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి







**నారాయణపేట, మే,29(సమయం న్యూస్) :** దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మాణం అవుతుందని, నేటి విద్యార్థులే రేపటి పౌరులు, శాస్త్రవేత్తలు,దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించే సృష్టికర్తలని విద్య అనేది ఒక దేశానికి పునాది తరగతి గదిలో పిల్లలకు అందించే నాణ్యమైన విద్య, నైతిక విలువలు, సాంకేతిక పరిజ్ఞానం దేశ భవిష్యత్తును నిర్ణయి-ంస్తాయని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య , క్రీడలు - యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. నారాయణ పేట జిల్లా కేంద్రంలోని అంజనా గార్డెన్స్ లో శుక్రవారం పీ ఆర్ టీ యూ టీ ఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థి విద్యార్థులకు ప్రతిభా అవార్డుల ప్రధానోత్సవం, అలాగే వంద శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ పాఠశాలల హెచ్ ఎం లకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

పీఆర్టీయూ జిల్లా శాఖ ఏర్పాటు చేసిన ఈ ప్రతిభా అవార్డుల కార్యక్రమం విద్యార్థులతో పోటీ తత్వాన్ని పెంచుతుందని, అవార్డు తీసుకోవాలని వారిలో కసి పెరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వాళ్లే ఉన్నత స్థాయికి ఎదిగారని, తల్లిదండ్రులు ప్రైవేటు స్కూళ్ళలో కాకుండా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలి అని మంత్రి సూచించారు. ప్రభుత్వ బడులు సిరులు అని, ప్రభుత్వ ఉపాధ్యాయులు మనకు ఒక వరం అని మంత్రి అభివర్ణించారు. ప్రభుత్వ పాఠశాల విద్యాబోధన లో మన కష్టం , చెమట బీదరికం ఉంటాయన్నారు. ప్రభుత్వ పాఠశాల లో చదువుకున్న వాళ్ళకి భవిష్యత్తులో తాను చదువుకున్న బడికి, ఉన్న ఊరికి ఏదైనా చేయాలనే తపన ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం మన అందరి బాధ్యత అని ఆయన గుర్తు చేశారు.రాష్ట్రం వ్యాప్తంగా పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మన జిల్లా 19 వ స్థానం నుంచి 14 కి ఎగబాకిందని, భవిష్యత్తులో 1 వ స్థానానికి చేరుకోవాలని మంత్రి ఆకాక్షించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు స్వయంగా తన నిధులు 25 లక్షలతో డిజిటలైజ్డ్ యానిమేషన్ కార్యక్రమాన్నీ మక్తల్ లో ప్రవేశ పెట్టినట్లు మంత్రి తెలిపారు. ఇప్పుడు ప్రతిభా అవార్డులు అందుకున్న విద్యార్థుల ఫోటోలతో ఆయా ప్రభుత్వ పాఠశాలల బయట ఫ్లెక్సీలు పెడితే మిగతా విద్యార్థులకు స్ఫూర్తిగా ఉంటాయని, ఫ్లెక్సీలు తప్పక పెట్టాలని మంత్రి సూచన ప్రాయంగా తెలిపారు. విద్యారులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటాలని సూచించారు. మైదానంలో ఎన్నిసార్లు ఓడినా మళ్ళీ గెలవాలనే కసి ఉంటుందని ఆయన తెలిపారు. విద్యార్థులకు పదో తరగతి తర్వాత వచ్చే ఇంటర్ మీడియట్ చాలా కీలకం అని, పదో తరగతి తర్వాత తల్లి దండ్రులు, ఉపాధ్యాయుల మాట వింటే 6 సంవత్సరాల్లో ఉన్నత స్థాయిలో ఉంటారని, ఇంటర్ మీడియట్ ఒక టర్నింగ్ పాయింట్ అని మంత్రి తెలిపారు. ఉపాధ్యాయులు ఒత్తిడిలో ఉండరాదని, ప్రభుత్వం ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించిందని, ఉపాధ్యాయుల కోరికలు న్యాయ బద్ధమైనవి, ప్రతి అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని ఆయన తెలిపారు.మన జిల్లాకు చెందిన నాయకుడే సీఎంగా ఉన్నారని, విద్యా శాఖ కూడా ముఖ్యమంత్రి వద్దనే ఉందని, ఉపాధ్యాయులు ప్రస్తావించిన విద్యా శాఖ సమస్యలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం సీఎం రేవంత్ రెడ్డి తో చర్చిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. మక్తల్ - నారాయణ పేట - కొడంగల్ ఎత్తిపోతల పథకం పూర్తయితే లక్షా 20 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని, తద్వారా ఆర్థిక స్థితిగతులు మెరుగుపడి, విద్యావ్యవస్త బాగు పడుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ.. అవార్డులు అందుకున్న విద్యార్థులు భవిష్యత్తు లోనూ ఇలాగే ఉత్తమ ప్రతిభ చాటాలని సూచించారు. మెరుగైన సమాజ నిర్మాణం బావి భారత పౌరులపై ఉందన్నారు. పదో తరగతి వరకు అన్ని సబ్జెక్టులు చదివారని, ఇప్పుడు మీకు నచ్చిన సబ్జెక్టు ఎంచుకుని కష్టపడి చదివి పుట్టిన ఉరికి, జిల్లా, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ప్రభుత్వం విద్యాశాఖ కు అన్ని రకాలుగా సహకారం అందిస్తోందని, విద్యా శాఖను తన వద్దే ఉంచుకుని విప్లవాత్మక మార్పులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుడుతున్నారని చెప్పారు. విద్యా శాఖ పట్ల సీఎం కు ఎంత శ్రద్ధ ఉందో అర్థం అవుతుందన్నారు. యంగ్ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం, పాఠశాలల్లో ఉదయం అల్పాహారం అమలు చేయబోతున్నారని ఎమ్మెల్సీ తెలిపారు. జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షా ఫలితాలతో పాటు ఎఫ్.ఎల్. ఎన్,ఎస్.ఈ.ఆర్.టి లో మన జిల్లా ర్యాంకు సాధించడం గొప్ప విషయం అన్నారు. అత్యధిక మార్కులు సాధించిన వారిలో ముగ్గురు అమ్మాయిలే అని, జిల్లాలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల కంటే ఎక్కువగా ఉండటం అభినందనీయం అన్నారు.బడి బాట కార్యక్రమం ద్వారా ఎన్ రోల్ మెంట్ పెంచి వచ్చే విద్యా సంవత్సరం ఇంకా మెరుగైన ఫలితాలు సాధించేందుకు మనమంతా కృషి చేద్దాం అన్నారు.విద్యా శాఖ లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని, ప్రభుత్వం కల్పిస్తున్న కొత్త కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ప్రతీ విద్యార్థిలో ఒక కళ ఉంటుందనీ, దానిని ఉపాధ్యాయులు గుర్తించి విద్యార్థులకు దిశా నిర్దేశం చేయాలని, ఉపాధ్యాయులే మార్గ దర్శకులని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలన విద్యతోనే సాధ్యం అవుతుందని ఆమె స్పష్టం చేశారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులకు మంత్రి, ఎమ్మెల్సీ, కలెక్టర్ చేతుల మీదుగా ప్రతిభా అవార్డులను ప్రధానం చేశారు. పీ అర్ టీ యూ జిల్లా అధ్యక్షుడు యాదగిరి జనార్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పుర చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సదా శివారెడ్డి, జిల్లా విద్యా శాఖ అధికారి గోవింద రాజులు, పీఆర్ టి యూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి , ఏం ఈవోలు, సెక్టోరల్ అధికారులు విద్యా సాగర్, శ్రీనివాస్, నాగార్జున రెడ్డి, రాజేంద్ర కుమార్, హెచ్ ఎం లు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాలెట్ యూనిట్లు, పోస్టల్ బ్యాలెట్లు భద్రపరిచిన గోదామును పరిశీలించిన జిల్లా కలెక్టర్-దీపక్ తివారి



**వికారాబాద్, మే,29(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా తహసీల్దార్ కార్యాలయము పరిధిలో ఉన్న బ్యాలట్ యూనిట్లు, పోస్టల్ బ్యాలెట్లు భద్రపరచిన గోదామును జిల్లా కలెక్టర్ దీపక్ తివారి శుక్రవారము పరిశీలించారు.గోదాంలో భద్రపరిచిన ఈవీఎంలు, బ్యాలట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ యంత్రాలు మరియు పోస్టల్ బ్యాలెట్ల భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ సమీక్షించారు. రికార్డుల నిర్వహణ, సీసీ కెమెరాల పర్యవేక్షణ, భద్రతా సిబ్బంది విధులు తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గోదాంలో పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలు నిరంతరం పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎన్నికల విభాగ అధికారులు, నేమత్ హాలి పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మక్తల్ ఎస్సై గా బాధ్యతలు స్వీకరించిన రాజు

- ఎస్పీ డాక్టర్ వినిత్ ఐపీఎస్ ను మర్యాదపూర్వకంగా కలిసిన మక్తల్ నూతన ఎస్సై పి.రాజు






**నారాయణపేట, మే,29(సమయం న్యూస్) :** మక్తల్ పోలీస్ స్టేషన్ వానా (స్టేషన్ హౌస్ ఆఫీసర్)గా ఎస్సై.ఎా. రాజు బాధ్యతలు స్వీకరించారు. ఇతను ఇంతకుముందు దామరగిద్ద ఎస్సైగా బాధ్యతలు నిర్వహించి మక్తల్ ఎస్సైగా బదిలీ అయ్యారు.ఇంతకు ముందు మక్తల్ ఎస్సైగా విధులు నిర్వహించిన భాగ్యలక్ష్మి రెడ్డి జిల్లా ఎస్పీ కార్యాలయానికి (VR ) బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా నూతన ఎస్సై పి. రాజు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ని ఎస్పీ కార్యాలయంలో పూల మొక్క అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలియజేసి, మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేయాలని సూచించారు.ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ... మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ స్నేహపూర్వక పోలీసింగ్ అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలైనా నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తెలియజేయాలని సూచించారు.గ్రామాల్లో అక్రమ కార్యకలాపాలు, మత్తు పదార్థాల వినియోగం, పేకాట, గంజాయి రవాణా, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, యువత చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్సై తెలిపారు.

## ప్రజల సహకారంతోనే డ్రగ్స్ నిర్మూలన సాధ్యం

- టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు
- మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసుల ఆకస్మిక తనిఖీలు
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆదేశాల మేరకు





**నారాయణపేట, మే,29(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా వ్యాప్తంగా మత్తు పదార్థాల నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని నారాయణపేట టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.ఈ సందర్భంగా నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈగల్ ఫోర్స్ టీంతో కలిసి ప్రత్యేక శిక్షణ పొందిన నార్కోటిక్స్ స్నైపర్ పోలీసు జాగిలం "విక్కి" సహాయంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. బస్ స్టాండ్ పరిసర ప్రాంతాలు, పాన్ షాపులు, రెస్టారెంట్లు, అనుమానాస్పద ప్రదేశాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టామని తెలిపారు.మత్తు పదార్థాల రవాణా, నిల్వ, విక్రయాలు మరియు వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు జిల్లా పోలీసులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారని ఎస్సై పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు సమాజాన్ని నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజలు ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను వినియోగిస్తున్నా, విక్రయిస్తున్నా, రవాణా చేస్తున్నా వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1908 లేదా డయల్-100కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.ఈ తనిఖీల్లో నార్కోటిక్స్ స్నైపర్ డాగ్ విక్కి, డాగ్ హ్యాండ్లర్ పీసీ పరమేశ్, ఈగల్ ఫోర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోస్ట్ ఆఫీస్ దగ్గర పెన్షన్ కోసం వచ్చిన వికలాంగులకు, వయోవృద్ధులకు,వితంతు మహిళలకు టిఫిన్ మంచినీరు ఏర్పాటు

కొడంగల్ మున్సిపల్ రెండవ వార్డ్ కౌన్సిలర్ ఆర్.వాణిశ్రీ మధుసూధన్ యాదవ్ దంపతులు

**కొడంగల్ మున్సిపల్, మే,29(సమయం న్యూస్) :** కొడంగల్ పట్టణ కేంద్రంలోని రెండవ వార్డులోని పోస్ట్ ఆఫీస్ దగ్గర ప్రతినెల పెన్షన్ కోసం వస్తున్న వికలాంగులు, వితంతు మహిళలు, వృద్ధులకు, టిఫిన్ మరియు మంచినీరు ఏర్పాటు చేసిన కొడంగల్ మున్సిపల్ 2 వార్డు కౌన్సిలర్ ఆర్ వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ దంపతులు. ఈ కార్యక్రమానికి. ముఖ్యఅతిథి గా విచ్చేసిన డాక్టర్ హీరలాల్ మరియు రెండవ వార్డ్ మాజీ కౌన్సిలర్ బుక్క శివ చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంగల్ శేఖర్ హోటల్ చిన్న కేపి వేణు సల్కంపేట మోహన్ బండి గోపాల్ పాష్యం శీను పాశం కృష్ణ దుద్యాల శ్రీను కంథీ చిన్నయ్య సల్కంపేట మహేష్ పాష్యం నాగప్ప తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు





## వివోఏల దీక్షలకు బిఆర్ఎస్ సంపూర్ణ మద్దతు

## మంత్రి సీతక్క హామీలు నెరవేర్చాలని డిమాండ్





**కోటగిరి, మే 29 (సమయం న్యూస్ )** కోటగిరి మండల కేంద్రంలో నిరసన దీక్షలు చేస్తున్న ఐకెపి వివోఏలకు బిఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. బిఆర్ఎస్ మండల నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి, వారితో కలిసి నిరసనలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకుడు తెల్ల రవికుమార్ మాట్లాడుతూ... గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వివోఏలకు రూ. 28 వేల వేతనం, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు, హెచ్ఆర్ పాలసీ, బీమా సౌకర్యం కల్పించాలని ప్రస్తుత మంత్రి సీతక్క అసెంబ్లీలో డిమాండ్ చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఆ హామీలను విస్మరించడం సరికాదని, తక్షణమే మంత్రి సీతక్క స్పందించి వివోఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వారి పోరాటానికి తమ మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు మోరే కిషన్, సమీర్, నజీర్, కప్ప సంతోష్, శంకర్ గౌడ్, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మరియు మండలంలోని వివిధ గ్రామాల వివోఏలు పాల్గొన్నారు.

## కొడంగల్ 12వ వార్డులో ఇందిరమ్మ గృహప్రవేశం లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్





**కొడంగల్ మున్సిపల్, మే,29(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ మున్సిపల్ 12వ వార్డులో ఇందిరమ్మ గృహప్రవేశం లో పాల్గొన్న కొడంగల్ మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్, కౌన్సిలర్ సుష్మదామోదర్, 11 వార్డు కౌన్సిలర్ బాతుల అనిత నర్సిములు,ఆదేవిదంగా అంగన్ వాడీ నిర్మాణాన్ని పరిశీలించారు.

## పీపడపల్లి లో బడిబాటతో విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు..ఎంఈఓ నర్సీములు



**రాయికోడ్ సమయం న్యూస్ మే 29** రాయికోడ్ మండల పరిధిలోని పీపడపల్లి గ్రామంలోని యం.పీ.పీ.ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి "బడిబాట" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి (వీజుూ) నర్సీములు కాంప్లెక్స్ హెచ్ఎం నగేష్ పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు, నాణ్యమైన విద్య అందిస్తున్న విషయాన్ని తల్లిదండ్రులకు వివరించారు. ప్రతి చిన్నారిని బడికి పంపించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వడ్ల రవి పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గ భవాని , డేవిడ్,రాయికోడ్ ప్రాథమికపాఠశాల ఎవీ శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మమ్మ, గ్రామ పెద్దలు ఎవరెవరు సాజిత్ శ్రీను ఈరన్న,సి ఆర్ పి రాజు పాల్గొన్నారు.

## రైతులకు 50% రాయితీపై జిలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి

● కొడంగల్ మండల వ్యవసాయ అధికారి ఎన్. శ్రీలత



**కొడంగల్ మండలం, మే,29(సమయం న్యూస్) :** రైతులకు 50% రాయితీపై జిలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కొడంగల్ మండల వ్యవసాయ అధికారి ఎన్. శ్రీలత తెలిపారు.రైతు సేవా కేంద్రం (AGRIS)లో 73 బ్యాగులు మరియు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పీఏసీఎస్ లో 55 బ్యాగులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఒక బ్యాగు మొత్తం ధర రూ.4905 కాగా, ప్రభుత్వం 50% రాయితీ ఇవ్వడంతో రైతులు కేవలం రూ. 2452.50 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.విత్తనాలు కావలసిన రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం మరియు ఆధార్ కార్డు తీసుకొని సంబంధిత కేంద్రాలకు వచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కోడంగల్ మండల రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎన్. శ్రీలత కోరారు.

## ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా

### SHG లకు ఋణ మేళా కింద అన్ని బ్యాంకులకు సంబంధించి 21 సంఘాలకు గాను రూపాయలు మంజూరు





**యాలాల మండలం, మే,29(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా యాలాల మండల మహిళా సమాఖ్య లో తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన ప్రజా పాలన 99 రోజుల లో భాగంగా ాఌ+ లకు ఋణ మేళా క్రింద అన్ని బ్యాంకులకు సంబంధించి 21సంఘాలకు గాను రూపాయలు 32150000/-మంజూరు చేయటం జరిగింది.ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ సీ. హెచ్. శివయ్య,ఉపసర్పంచ్ మల్కిరెడ్డి శోభ రాజు రెడ్డీ, వికారాబాద్ జిల్లా మాజీ కో అప్షన్ అధ్యక్షులు అక్బర్ బాబా, బ్యాంక్ ఆఫీసర్ కృష్ణ,అధ్యక్షులు వనీ మాల, విశ్వనాథ్ పూర్, కార్యదర్శి కమలమ్మ చిరు,బషీర్మియా తండా, కోశాధికారి నవనీత ముదాయిపేట,సీసీ వెంకటయ్య, రాజేశ్వరి, అనసూజ ,సీ హెచ్ భీమమ్మా, భీమమ్మా, శ్రీశైలం, మహిళా సంఘాలు, అధికారులు పాల్గొన్నారు.

# వర్షానికి తడిసిన మొలకెత్తిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయడానికి చర్యలు


### జిల్లా కలెక్టర్,సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్



**నారాయణపేట, మే,29(సమయం న్యూస్) :** వర్షానికి తడిసిన మొలకెత్తిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ సి. హెచ్. ప్రియాంక తెలిపారు. జిల్లాలోని ఆయా ప్రాంతాలలో వర్షాలు కురియుగా తడిసిన వరి ధాన్యం వివరాలను జిల్లా కలెక్టర్ తెలుసుకున్నారు. దామరగిద్ద మండలం గత్ప గ్రామంలో లారీలు రాక పొలాల్లోనే నిలిచిపోయిన వరి ధాన్యాన్ని కేంద్రాలకు తరలించి వాటిని ఖరీదు చేయనున్నట్లు తెలిపారు. ఇంకా పొలాలలోనే తడిసిన ధాన్యాన్ని కూడా తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు.నారాయణపేట జిల్లాలో శుక్రవారం వరకు 17986 రైతుల నుండి 135511.980 మెట్రిక్ టన్నుల వరి ధాన్యమును కొనుగోలు చేయడం జరిగినది దీని విలువ 323.73 కోట్ల రూపాయలు దీనిలో ఈరోజు 16201 వరకు మంది రైతులకు 273.54 కోట్ల రూపాయలను చెల్లించడం జరిగినది ( 84.50 % ) అలాగే మిగతా అమౌంట్ కూడా 48 గంటల్లో రైతుల అకౌంట్లో జమ చేయడం జరుగుతుంది అదేవిధంగా మన జిల్లాలో అకాల వర్షాలకు దామరగిద్ద మండలంలోని విఠలాపూర్ మరియు అన్న సాగర్ ధాన్యం కొనుగోలు సెంటర్ నందు పాక్షికంగా కొన్ని బ్యాగులు వర్షానికి తరవడం జరిగినది దానిని కూడా వెంటనే రైస్ మిల్లులకు తరలించడం జరిగినది అలాగే మన జిల్లాలో ఇప్పటివరకు 98% ధాన్యం కొనుగోలు పూర్తి అవడం జరిగింది మిగిలిన ధాన్యాన్ని కూడా రెండు రోజుల్లో కొనుగోలు చేసి వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తామని తెలపడం జరిగింది.... జిల్లా పౌర సంబంధాల అధికారి నారాయణపేట చే జారీ చేయబడింది

# కల్లూరులో వీడ్కోలు, స్వాగత సభ సెక్రటరీలు ప్రతాప్, రాజులకు ఘన సన్మానం

**పోతంగల్, మే 29 (సమయం న్యూస్ ) :** పోతంగల్ మండల పరిధిలోని కల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శి ప్రతాప్‌కు వీడ్కోలు, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కార్యదర్శి రాజుకు స్వాగత సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కల్లూరు గ్రామ సర్పంచ్ ముఖ్య అతిథిగా హాజరై, ఇరువురు అధికారులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... గత కొంతకాలంగా కల్లూరు గ్రామ అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి సెక్రటరీ ప్రతాప్ అందించిన సేవలు అభినందనీయమన్నారు. ఆయన విధి నిర్వహణలో చూపిన ప్రతిభ, ప్రజలతో ఉన్న సంబంధాలను కొనియాడారు. బదిలీపై వెళ్తున్న ప్రతాప్‌కు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలనిఆకా ంక్షించారు. అదేవిధంగా, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సెక్రటరీ రాజును సర్పంచ్ ఆత్మీయంగా ఆహ్వానించారు. రాబోయే రోజుల్లో పాలకవర్గంతో సమన్వయం చేసుకుంటూ, కల్లూరు గ్రామాన్ని మండలంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు నూతన కార్యదర్శి కృషి చేయాలని కోరారు. గ్రామ అభివృద్ధికి తమ



వంతు పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని సర్పంచ్ స్పష్టం చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

## మహిళలు వ్యాపార వేత్తలుగా ఎదగాలి

**- జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్.**



**నారాయణపేట, మే,29(సమయం న్యూస్) :** మహిళలు వ్యాపార వేత్తలుగా ఎదగాలని, బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సేర్ఫ్ వారోత్సవాల సందర్భంగా మహిళా ఉన్నతి – తెలంగాణ ప్రగతి పేరిట స్వయం సహాయక సంఘాలకు రుణ మేళా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలోనీ 11 మండలాలకు జీవనోపాదుల అభివృద్ధి కార్యక్రమం ద్వారా 174 యూనిట్లకు గాను 7 కోట్ల 24 లక్షలకు పైగా రుణాల చెక్కులను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..స్వయం సహాయక సంఘాల సభ్యులు తాము ఎంచుకున్న వ్యాపారంలో లాభాలు ఆర్జించాలన్నారు.నారాయణపేట ముఖ్యమంత్రి జిల్లా అని మరచి పోవద్దని, జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. నిర్మల్ జిల్లాలో జీరో ఎన్. పీ. ఏ సాధించారని, మన జిల్లాకు చెందిన ఎం. ఎం.ఎస్.లు, జెడ్ ఎం ఎస్ జీరో ఎన్.పీ. ఏ సాధించాలని కలెక్టర్ సూచించారు. వంద వ్యాపారాల్లో 10 సక్సెస్ అవుతాయని, మనం చేయగలం అనే నమ్మకం ఉండాలన్నారు. ప్రభుత్వం మహిళల కు తోడ్పాటు అందిస్తుందని ఆమె తెలిపారు. మహిళలు రాబోయే కష్టాన్ని ఈ రోజే ఊహించుకోవద్దని, ఇంట్లో ఉన్న ఆడపిల్లలను బాగా చదివించాలని తెలిపారు. ఆడపిల్ల కదా పెళ్లి చేస్తే బాధ్యత తీరిపోతుందనే ఆలోచన ను తల్లిదండ్రులు తమ మైండ్ లో నుంచి తీసి వేయాలన్నారు. ఆడపిల్లల్ని ఎదగనివ్వాలని, ఎంత వరకు చదివితే అంత వరకు చదివించాలని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో బాల్య వివాహాల సంఖ్య ఎక్కువగా ఉంటుందని, బాల్య వివాహాలను నివారించడంలో స్వయం సహాయక సంఘం సభ్యుల సహకారం ఎంతో అవసరం అని, మన చుట్టుపక్కల ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని కలెక్టర్ కోరారు. బాల్య వివాహ నిరోధక చట్టం గురించి అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కిశోర బాలికలకు అండగా ఉండి, వాళ్లను మహిళా సంఘాలలో చేర్చుకుని, ఆర్థిక స్వాతంత్రం సాధించేలా చేయుత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ వెంకట్ రాములు, సేర్ఫ్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘన వ్యర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

**--జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్.**




**నారాయణపేట, మే,29(సమయం న్యూస్) :** ఘన వ్యర్థాల నిర్వహణ పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక సూచించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో ఘన వ్యర్థాల నిర్వహణ 2026 నియమాల పై జిల్లా మానిటరింగ్ కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు ఇటీవలే జారీ చేసిన ఘన వ్యర్థాల నిర్వహణ కు సంబంధించిన నాలుగు విధానాల మార్గదర్శకాలను జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో సమర్థవంతంగా అమలు చేయాలని ఆమె ఆదేశించారు. వ్యర్థాల సేకరణలో పని చేస్తున్న కార్మికులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి శాస్త్రీయ విధానంలో చెత్త నిర్వహణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపాలిటీలలో, ప్రతి మండలంలో భారీ స్థాయిలో వ్యర్థాలు ఉత్పత్తి చేసే బల్క్ వేస్ట్ జనరేటర్ లను గుర్తించి వారిపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా నారాయణ పేట, మక్తల్, కోస్గి మున్సిపాలిటి లో డంపింగ్ యార్డులు, వాటిలో నిల్వ ఉన్న తడి పొడి చెత్త, బయో మైనింగ్ అనుమతుల గురించి సమావేశంలో చర్చించారు. జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ రీజినల్ అధికారి సురేష్, డిపివో సుధాకర్ రెడ్డి, డీ ఈ ఓ గోవింద రాజులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జయ చంద్రమోహన్, సెక్షన్ అధికారిని జయసుధ, ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు, పర్యావరణ ఇంజనీర్లు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాల సవరణకు జిల్లా యంత్రాంగం సిద్ధం

- దూప్లికేట్ ఓటర్లపై ప్రత్యేక పరిశీలన.
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటరు నమోదు లక్ష్యం.
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక.




**నారాయణపేట,మే,29(సమయం న్యూస్) :** నారాయణ పేట జిల్లాలో జూన్ 15వ తేదీ నుండి నిర్వహించనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో పారదర్శకంగా,సమర్థవంతంగా అమలు చేసేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో నారాయణ పేట జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ నుంచి పాల్గొన్న కలెక్టర్, జిల్లాలో చేపట్టనున్న ఎన్నికల జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమంపై రాష్ట్ర ఎన్నికల అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ఎన్నికల జాబితాల ఖచ్చితత్వం ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి అత్యంత కీలకమని , జిల్లాలో అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబితాల సవరణ ప్రక్రియను ఎటువంటి లోపాలు లేకుండా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వేలను కచ్చితత్వంతో నిర్వహించేందుకు బి ఎల్ వో లు, సూపర్ వైజర్లు, ఎన్నికల సిబ్బందికి ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, మరణించిన లేదా వలస వెళ్లిన ఓటర్ల పేర్ల తొలగింపు, దూప్లికేట్ నమోదుల పరిశీలన వంటి అంశాలను అత్యంత జాగ్రత్తగా పరిశీలిస్తామని తెలిపారు.ఇంటింటి సర్వే ప్రక్రియను కచ్చితత్వంతో నిర్వహించి, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, మరణించిన మరియు వలస వెళ్లిన ఓటర్ల వివరాల నవీకరణను సమయపాలనతో పూర్తి చేస్తామని, ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.ప్రజలకు ఎన్నికల నమోదు ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా మీడియా ద్వారా ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, ఎన్నికల సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అభ్యంతరాలను వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సర్ పై వచ్చే ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి సమయపాలనతో పరిష్కరించేలా చర్యలు ఉంటాయని, జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని స్థాయిలో అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్రీను, అర్డీవో రమేష్,ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జయసుధ, తహసీల్దార్లు పాల్గొన్నారు.




# బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకంలో జాప్యం తగదు

- రాజకీయ పార్టీలకు కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు




**నిజామాబాద్, మే 29 ( సమయం న్యూస్). :** బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం విషయంలో రాజకీయ పార్టీలు జాప్యం చేయకుండా, బీ.ఎల్.ఏ ల నియామకం జాబితాను నిర్ణీత ఫార్మాట్ లో సత్వరమే అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ అమలులో బీ.ఎల్.ఏ ల పాత్ర ఎంతో క్రియాశీలకం అయినందున వారి నియామకంలో తాత్సారం తగదని హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శుక్రవారం జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఈ.ఆర్.ఓలు, ఏ.ఈ.ఆర్.ఓలతో కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అమలు ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. పారదర్శకతతో కూడిన ఓటరు జాబితా రూపకల్పన కోసం ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎస్.ఐ.ఆర్ ను అమలు చేస్తోందని, ఈ మేరకు నిర్ణీత షెడ్యూల్ ను కూడా వేలువరించిందని గుర్తు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల సంఘంచే గుర్తింపు కలిగిన అన్ని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకుని, నిర్ణీత ఫార్మాట్ లో వారి వివరాలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని ఈ.ఆర్.ఓలను ఆదేశించారు. బీ.ఎల్.ఏల నియామకం కోసం ఇప్పటికే రాజకీయ పార్టీలను లిఖిత పూర్వకంగా కోరినప్పటికీ, ఇంకనూ వివరాలు అందించలేదని అన్నారు. కేవలం ఒక పార్టీ మాత్రమే రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన బీ.ఎల్.ఏ ల వివరాలు సమర్పించిందని తెలిపారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ అమలుకు సంబంధించి బీ.ఎల్.ఏ లకు శిక్షణ తరగతులు నిర్వహించాల్సి ఉందని, అంతేకాకుండా ముసాయిదా ఓటరు జాబితాలోని అంశాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే, బీ.ఎల్.ఏలు వాటిని ప్రస్తావించేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ సూచించారు. బీ.ఎల్.ఏల తక్షణ నియామకం ఆవశ్యకతను గుర్తిస్తూ, ఆయా పార్టీలు వెంటనే నియామక జాబితాను అందించాలని అన్నారు.

కాగా, ఈ.ఆర్.ఓల స్థాయిలో ప్రతీ వారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ అమలు తీరు గురించి వారికి వివరాలు తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో బీ.ఎల్.ఓలు ప్రతి ఇంటిని సందర్శించి ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి చేసేలా పర్యవేక్షణ జరపాలని సూచించారు. బీ.ఎల్.ఓ లకు సహకారం అందించేందుకు వీలుగా వాలంటీర్లను సమకూర్చాలని, చనిపోయిన, శాశ్వతంగా వలస వెళ్ళిన, రెండు చోట్ల పేర్లు కలిగిన ఓటర్లను మ్యాపింగ్ సందర్భంగా ఖచ్చితంగా గుర్తించేలా చూడాలన్నారు. తప్పులు లేకుండా ఎన్యుమరేషన్ ఫారం ఎలా నింపాలి అనే దానిపై బీ.ఎల్.ఓలకు సమగ్రంగా అర్థమయ్యే రీతిలో శిక్షణ అందించాలని ఆదేశించారు. అన్ని పోలింగ్ బూత్ ల పరిధిలో వీ.ఐ.పీలు, వీ.వీ.ఐ.పీ ఓటర్లు ఉంటే, వారి మ్యాపింగ్ పూర్తయ్యిందా లేదా అన్నది ఈ.ఆర్.ఓలు స్వయంగా పరిశీలన జరపాలని సూచించారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ అమలు తీరు, ప్రగతి గురించి రోజువారీగా ఆన్లైన్ లో వివరాలు పొందుపర్చాల్సి ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని సాంకేతిక సిబ్బందిని నియమించుకోవాలని తెలిపారు. మ్యాపింగ్ లో పొరపాట్లకు తావులేకుండా పక్కాగా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ ఆర్.డీ.ఓ రాజేంద్రకుమార్, బాన్సువాడ ఆర్.డీ.ఓ రవీందర్ రెడ్డి, బోధన్ ఆర్డీఓ విజయ, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, ఏ.ఈ.ఆర్.ఓలు పాల్గొన్నారు.

## 12వ రోజు సమ్మెలో భాగంగా వివోఏలు ఒంటికలిపై నిలబడి విన్నూత నిరసన



**కొడంగల్ మున్సిపల్, మే,29(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ మండల మహిళా సామాఖ్య ఆవరణలో కొనసాగుతున్న 12వ రోజు సమ్మెలో భాగంగా వివోఎ లులు ఒంటికాలిపై నిలబడి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వివోఎ లు మాట్లాడుతూ... ప్రభుత్వం వెంటనే వివో ఏ లను చర్చలకు పిలవాలని వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.చర్చలకు రావాలి -- మా సమస్యలు పరిష్కరించాలి అనే నినాదాలతో నిరసన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ప్రభుత్వం స్పందించని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని సమ్మె నాయకులు హెచ్చరించారు.కార్యక్రమములో అంజి లప్ప, పెంటప్పు,వెంకట్ రెడ్డి,మొగులప్ప,సుజాత,మంజుల, సువర్ణ,మంజుల, సరోజ ,గణేష్,రవి,కవిత తరితరులు పాల్గొన్నారు.

## అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా డ్రైవర్ మృతి

..యాలాల ఎస్సై విఠల్ రెడ్డి



**యాలాల మండలం, మే,29(సమయం న్యూస్) :** పగడాల నుండి రాష్ట్రం వెళ్లే దారి మధ్యలో మలుపు మార్గంలో ఒక ట్రాక్టర్ ఖా 34ూా6528, ట్రాలీ ఝా 27ఎ5281 గల ట్రాక్టర్ను అందులో శిల్ప రాయి తీసుకొని వెళుతున్న క్రమంలో మలుపు వద్ద అదుపుతప్పి కింద పడగా ట్రాక్టర్ ను నడిపిస్తున్నటువంటి బోడ శ్రీశాంత్ తండ్రి బాలప్ప వయసు 19 సంవత్సరాలు,ఇంద్రనగర్ తాండూర్ కు చెందిన వ్యక్తి మృతి చెందినట్లు యాలాల ఎస్సై విఠల్ రెడ్డి తెలిపారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

ఉప్పల్ లో ఉపాధి హామీ కూలీలతో క్షేత్రస్థాయిలో సౌకర్యాల గురించి ఆరా తీసిన కలెక్టర్



**హనుమకొండ:మే29( సమయం న్యూస్) :** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ (ఈజీఎస్) పనులను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి శుక్రవారం పరిశీలించారు. ఉపాధి హామీ పనులకు ప్రతి రోజు ఎంతమంది కూలీలు వస్తున్నారని అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పని ప్రదేశం వద్ద పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలతో క్షేత్రస్థాయిలో కల్పిస్తున్న సౌకర్యాలను గురించి కలెక్టర్ ఆరా తీశారు. ఉపాధి హామీ పనులకు క్రమం తప్పకుండా వస్తున్నారా అని, మహిళలను స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా ఉన్నారా అని, రుణాలు తీసుకుంటే సకాలంలో కడుతున్నారా అని కలెక్టర్ ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ఈజీఎస్ పనులు చేస్తుండగా ఫోటోలు దిగే సమయంలో ఏవైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఫార్మ్ పాండ్ ను కలెక్టర్ పరిశీలించారు. ఉపాధి హామీ పనులకు 480 మంది కూలీలు హాజరవ్వడంపై, ఉపాధి హామీ కూలీలకు సౌకర్యవంతంగా ఏర్పాటు చేసిన తాగునీరు, టెంట్లు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, తదితర వసతులు కల్పించడం పట్ల జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పనులు వేగంగా జరుగుతుండడం పై డిఆర్డిఓ మేన శ్రీను, కమలాపూర్ ఎంపీడీవో గుండె బాబు, ఈజీఎస్ సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా ఉప్పల్ గ్రామ సర్పంచ్ రమా, తహసిల్దార్ సురేష్ కుమార్, ఈజిఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- పొగాకు ఉత్పత్తుల దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పించాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- జాతీయ పొగాకు నియంత్రణ చట్టం జిల్లా కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదేశాలు



**హనుమకొండ, మే 29( సమయం న్యూస్) :** బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్ పాయి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం (చీజూ)లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పొగాకు నియంత్రణ చట్టం (జూూూా ూాఖ్) జిల్లా కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పొగాకు మరియు పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే తీవ్రమైన ఆరోగ్య సమస్యలపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలలకు 100 మీటర్ల పరిధిలో సిగరెట్లు, గుట్కా మరియు ఇతర పొగాకు ఉత్పత్తుల విక్రయం నిషేధమని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.దేవాలయాలు, పాఠశాలలు, పార్కులు, ప్రభుత్వ కార్యాలయాలు మరియు ఇతర బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధించబడిందని పేర్కొంటూ, ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై యువతను భాగస్వామ్యం చేస్తూ ర్యాలీలు, అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో పొగ త్రాగడం వల్ల పరిసరాల్లో ఉన్న వారిపై కూడా తీవ్ర ప్రభావం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ నెల 31న నిర్వహించే ప్రపంచ పొగాకు నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ప్రముఖ గుండె వైద్య నిపుణులు, శ్రీనివాస హార్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ రామకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు పొగాకు వల్ల కలిగే అనర్థాలపై పాఠశాల స్థాయి నుంచే అవగాహన కల్పించేలా పాఠ్యాంశాలు రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సంస్థలు, పారిశ్రామిక ప్రాంతాలు మరియు బహిరంగ ప్రదేశాల్లో నిషేధిత బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో పొగాకు సాగును నియంత్రించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డార ు .జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ. అప్పయ్య జిల్లాలో చేపడుతున్న పొగాకు నియంత్రణ కార్యక్రమాలపై వివరాలు వెల్లడించారు.ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి మేన శ్రీను, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, జీడబ్ల్యూఎంసీ ముఖ్య వైద్యాధికారి డాక్టర్ రాజారెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి గోపాల్, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శ్రీనివాస్, జిల్లా రవాణా శాఖ అధికారి వేణుగోపాల్, గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ సునీత, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## బిజినెస్



# రిలయన్స్ ఫౌండేషన్ సేవ.. కోట్లాది జీవితాల్లో మార్పు!

నీతా అంబానీ సారథ్యంలోని రిలయన్స్ ఫౌండేషన్ 2025-26 ఆర్థిక సంవత్సరంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (జూ=) ఖర్చులను గణనీయంగా పెంచింది. సామజిక కార్యక్రమాల కోసం ఏకంగా రూ.2248 కోట్లు ఖర్చు చేసింది. ఇది గత సంవత్సరం (రూ.2156 కోట్లు)తో పోలిస్తే సుమారు రూ.100 కోట్లు ఎక్కువ. కోవిడ్ తర్వాత కాలం నుంచి ఇప్పటివరకు రిలయన్స్ ఫౌండేషన్ మొత్తం సీఎస్ఆర్ ఖర్చు రూ.9,500 కోట్లు దాటింది. ఈ భారీ పెట్టుబడుల ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 9.7 కోట్ల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రయోజనం చేకూరింది. ఈ కార్యక్రమాల ద్వారా గ్రామీణ జీవనంలో వచ్చిన మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఉదాహరణకు.. గ్రామీణ ప్రాంతాల్లోని ఒక డెయిరీ రైతు ఆదాయం గణనీయంగా పెరిగి రెండింతలయింది. అంతే కాకుండా.. విద్యార్థుల భవిష్యత్ కోసం స్కాలర్‌షిప్ సదుపాయాలను అందిస్తున్నారు. 2020-21లో ప్రారంభమైన రిలయన్స్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్ కార్యక్రమం ప్రతి సంవత్సరం సుమారు 5,100 మంది విద్యార్థులకు ఉపయోగపడుతోంది. వీరిలో చాలామంది మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందారు. వారి కుటుంబాల ఆర్థిక స్థితిలో పురోగతికి సహాయపడుతున్నారు. ఇది సమాజంలో దీర్ఘకాలిక అభివృద్ధికి దోహదపడే ముఖ్యమైన అంశంగా నిపుణులు చెబుతున్నారు. మహిళా సాధికారత విషయంలో కూడా స్పష్టమైన ఫలితాలు కనిపిస్తున్నాయి. డిజిటల్ లిటరసీ, ఆర్థిక అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్న మహిళల్లో 75% మందికి ఆర్థిక నిర్ణయాలపై విశ్వాసం పెరిగింది. సగం మంది కుటుంబ ఆర్థిక నిర్ణయాల్లో మరింతగా పాల్గొంటున్నారు. జంతు సంరక్షణ రంగంలో వంతారా ద్వారా ఇప్పటివరకు 1.5 లక్షలకు పైగా జంతువులకు సంరక్షణ అందించారు. దీనికిగాను అనంత్ అంబానీకి 2025లో గ్లోబల్ హ్యూమానిటేరియన్ అవార్డు లభించింది. నీతా అంబానీకి కూడా అంతర్జాతీయ స్థాయిలో హ్యూమానిటేరియన్ అవార్డులు వచ్చాయి. గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాల్లో కూడా గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. పాడి రైతుల రోజువారీ పాలు ఉత్పత్తి 6.14 లీటర్ల నుంచి 10.37 లీటర్లకు పెరిగింది. వారి వార్షిక ఆదాయం సుమారు 64.6% పెరిగింది. మొత్తం కుటుంబ ఆదాయం కూడా సుమారు 56% వరకు పెరిగింది. ప్రకృతి విపత్తుల సమయంలో కూడా ఫౌండేషన్ సేవలు అందించింది. ఆంధ్రప్రదేశ్ తీరంలో వచ్చిన తుపాను హెచ్చరికల సమయంలో ముందస్తు సమాచారం ఇచ్చి మత్స్యకారులు, రైతులను అప్రమత్తం చేసింది. ఈ సేవలకు గాను రాష్ట్ర ప్రభుత్వం నుంచి గుర్తింపు కూడా లభించింది. ఇలా రిలయన్స్ ఫౌండేషన్ సామజిక కార్యక్రమాల కోసం ప్రతి ఏటా భారీ మొత్తంలో ఖర్చు చేస్తోంది.

# భారతీయ స్టాక్ మార్కెట్లు భారీగా పతనం..

## 1100 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్.. రూ.5 లక్షల కోట్లు నష్టం




భారతీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీగా పతనమయ్యాయి. ఉదయం స్వల్ప లాభాల్లో ప్రారంభమైన ట్రేడింగ్ చివరికి అమ్మకాల ఒత్తిడి కారణంగా భారీనష్టాల్లో ముగిసింది. బీఎస్ఈ సెన్సెక్స్ 1,092.06 పాయింట్లు (1.44 శాతం) నష్టపోయి 74,775.74 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఇంట్రాడేలో 76,220.02 పాయింట్ల గరిష్టాన్ని తాకినప్పటికీ చివరికి నష్టాల్లో ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 359.40 పాయింట్లు (1.50 శాతం) నష్టపోయి 23,547.75 వద్ద ముగిసింది. దేశంలో ఇన్వెస్టర్ల సంపద ఈ ఒక్కరోజే దాదాపు రూ.5 లక్షల కోట్లు నష్టపోయింది. ప్రస్తుతం మార్కెట్ విలువ రూ.466 లక్షల కోట్లుగా ఉంది. దేశంలో రుతుపవనాల రాక ఆలస్యం కానుందనే వార్తలు, అమెరికా--ఇరాన్ మధ్య శాంతి చర్చలు కొలిక్కి రాకపోవడం మార్కెట్ పతనానికి ప్రధాన కారణాలు. దేశంలో రుతపవనాలు ఆలస్యమైతే వర్షాలు సరిగ్గా కురవవు. దీనివల్ల వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదు- ర్కోవాల్సి వస్తుందనే భయం మార్కెట్‌ను దెబ్బతీసింది. సెన్సెక్స్ 30 సూచీలో ఇన్ఫోసిస్, ఎల్అండ్‌టీ, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు లాభాలు చవిచూడగా, మిగతా షేర్లు భారీగా నష్టపోయాయి. వాటిలో మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు ఎక్కువగా నష్టాలు చవిచూశాయి. మరోవైపు డాలర్‌తో రూపాయి మారక విలువ 95.05గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ క్రూడాయిల ధర 91.40 డాలర్లుగా ఉంది. బంగారం ఔన్స్ ధర 4530 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# రూ.1.4 కోట్ల బిల్లు కస్టమర్లకు వాపస్!

వ్యాపారంలో లాభాల కంటే వినియోగదారుల నమ్మకమే ముఖ్యమని బార్బెక్యూ రెస్టారెంట్ తెలిపింది. తాము అందించిన ఆహారం సొంత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేదని గ్రహించిన సదరు యాజమాన్యం.. ఏకంగా కస్టమర్లకు సుమారు రూ.1.4 కోట్లు (1,62,000 అమెరికన్ డాలర్లు / 1.1 మిలియన్ యువాన్లు) తిరిగి చెల్లించింది. కస్టమర్ల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకపోయినా సంస్థే స్వయంగా ముందడుగు వేసి ఈ నిర్ణయం తీసుకుంది. 'ది సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' నివేదిక ప్రకారం.. చైనావ్యాప్తంగా 142 అవుట్‌లెట్లతో విస్తరించిన ప్రసిద్ధ బ్రాండ్ 'వెరీ లాంగ్ అగో లాంబ్ స్కేవర్స్' ఈ నిర్ణయాన్ని తీసుకుంది.



### అసలేం జరిగింది? గ్రిల్లింగ్‌లో లోపమే కారణమా?

ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో కంపెనీకి చెందిన 24 అవుట్‌లెట్లలో దాదాపు 48,000 టేబుల్స్ వద్ద భోజనం చేసిన కస్టమర్లను రెస్టారెంట్ యాజమాన్యం ఈ నెల ప్రారంభంలో స్వయంగా సంప్రదించింది. అంతర్గత నాణ్యత సమీక్షలో ఒక షాకింగ్ నిజం బయటపడటమే దీనికి కారణం. ఆ సమయంలో కొత్తగా ప్రవేశపెట్టిన గ్రిల్లింగ్ పరికరాల్లో ఉష్ణోగ్రత స్థిరంగా లేకపోవడం వల్ల, మటన్ కబాబ్‌లు ఆశించిన స్థాయిలో గ్రిల్ కాలేదని కంపెనీ గుర్తించింది. కస్టమర్ల నుంచి అధికారికంగా ఎలాంటి ఫిర్యాదులు రానప్పటికీ తమ బ్రాండ్ విలువలకు కట్టుబడి సదరు మటన్ స్కేవర్ల ధరలో 50 శాతం మొత్తాన్ని ఖాతాదారులకు రీఫండ్ చేసింది.

### నిజాయితీయా? మార్కెటింగ్ జిమ్మిక్కా?

ఈ భారీ వాపసు కార్యక్రమం నెట్టింట వైరల్‌గా మారడంతో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 'లాభాల కంటే కస్టమర్ల సంతృప్తికే ప్రాధాన్యతనిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించిన రెస్టారెంట్ నిజాయితీ అమోఘం' అని మెజారిటీ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే, మరికొందరు మాత్రం ఇది బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుకోవడానికి, పబ్లిసిటీ కోసం ప్లాన్ చేసిన ఒక తెలివైన మార్కెటింగ్ వ్యూహం కావచ్చునని సందేహం వ్యక్తం చేస్తున్నారు.

# గిల్ గర్జన.. శుభ్‌మన్ సూపర్ సెంచరీ

## స్పోర్ట్స్

**ఫైనల్లో గుజరాత్**

**క్వాలిఫయర్-2లో రాజస్థాన్ ఓటమి**

**వైభవ్ మెరుపులు వృథా**



**ముల్లన్‌పూర్ :** ఐపీఎల్19వ సీజన్‌లో బేబీ బాస్ వైభవ్ సూర్యవంశీ (47 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 96) మెరుపులకు.. రాజస్థాన్ రాయల్స్ పోరాటానికి తెరపడింది. 15 ఏండ్ల ఈ యువ కెరటం ఆడిన మరో అద్భుత ఇన్నింగ్స్ ఆ జట్టును ఫైనల్ చేర్చలేకపోయింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (53 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్సర్లతో 104) క్లాసిక్ సెంచరీతో చేసిన గర్జనకు తోడు సాయి సుదర్శన్ (32 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్‌తో 58) సత్తా చాటడంతో రాజస్థాన్‌కు చెక్ పెట్టిన గుజరాత్ టైటాన్స్ మూడోసారి తుదిపోరుకు దూసు కెళ్లింది. శుక్రవారం జరిగిన క్వాలిఫయర్-2లో జీటీ 7 వికెట్ల తేడాతో రాయల్స్‌ను చిత్తు చేసింది. ఆర్ఆర్ ఇచ్చిన 215 టార్గెట్‌ను 18.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది. తొలుత రాజస్థాన్ 20 ఓవర్లలో 214/6 స్కోరు చేసింది. వైభవ్‌తోపాటు జడేజా (45నాటౌట్) చివర్లో ఫెరీరా (11 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 38 నాటౌట్) కూడా రాణించారు. హోల్డర్, రబాడ చెరో రెండు వికెట్లు తీశారు. గిల్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్లో ఆర్సీబీతో జీటీ అమీతుమీ తేల్చుకోనుంది.

**కెప్టెన్ గిల్ ముందుండి...**

క్వాలిఫయర్-1లో తేలిపోయిన గుజరాత్ టాపార్డర్ ఈసారి అద్భుతంగా ఆడింది. ఓపెనర్లు సుదర్శన్, గిల్ తొలి వికెట్‌కు 167 రన్స్ జోడించి ఫైనల్‌కు బాట వేశారు. భారీ ఛేదనలో క్లాసిక్ షాట్లతో హోరెత్తించారు. ఏ ఒక్క బౌలర్‌ను వదలకుండా శిక్షించి ఛేజింగ్‌ను వన్‌సైడ్ చేశారు. ఫామ్‌లో ఉన్న ఆర్చర్ తొలి ఓవర్లోనే చెరో రెండు ఫోర్లతో తమ ఉద్దేశం ఏంటో చెప్పారు. ఆర్చర్‌ను టార్గెట్ చేసిన గిల్ మరో రెండు ఫోర్లు రాబడితే.. బర్గర్, తుషార్‌కు సుదర్శన్ రెండేసి బౌండరీలతో స్వాగతం పలికాడు. ఓపెనర్ల జోరుకు పవర్‌ప్లేను 69/0తో ముగించింది. ఆ తర్వాత గిల్‌గేరు మార్చి మరింత స్పీడు పెంచారు. తుషార్ వేసిన తొమ్మిదో ఓవర్లో 6,4,4 బాది 30 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకోవడంతో పాటు స్కోరు వంద దాటించాడు. పదో ఓవర్లో బంతిని అందుకున్న జడేజాను 6,6,4తో శిక్షించడంతో స్టేడియం హోరెత్తింది. కెప్టెన్‌ను చూసి సుదర్శన్ సైతం వేగం అందుకున్నాడు. యశ్‌రాజ్ బౌలింగ్‌లో తొలి సిక్స్ కొట్టి అర్ధ శతకం అందుకున్నాడు. ఈ జోరు చూస్తుంటే ఇద్దరే లక్ష్యాన్ని కరిగించేలా కనిపించారు. కానీ, బ్రిజేశ్ వేసిన 13వ ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన సాయి.. ఐదో బాల్‌ను కట్ షాట్‌తో బౌండరీకి పంపే ప్రయత్నంలో జారి పోయిన బ్యాట్ వికెట్లపై పడటంతో గత మ్యాచ్ మాదిరిగా హిట్ వికెట్‌గా ఔటయ్యాడు. జడ్డూ బౌలింగ్‌లో ఎక్స్‌ట్రా కవర్ మీదుగా ఫోర్ కొట్టి సెంచరీ (47 బంతుల్లో) పూర్తి చేసుకున్న గిల్‌ను తర్వాతి ఓవర్లో ఆర్చర్ ఎల్బీ చేసినా అప్పటికే మ్యాచ్ జీటీ చేతుల్లోకి వచ్చేసింది. తెవాటియా (17 నాటౌట్), సుందర్ (16), బట్లర్ (9 నాటౌట్) లాంఛనం పూర్తి చేశారు.

**పట్టువదలని సూర్యవంశీ**

తన స్టయిల్‌కు భిన్నంగా పరిస్థితులకు తగ్గట్టుగా ఆడిన వైభవ్ ముందుండి నడిపించగా.. చివర్లో ఫెరారీ మెరుపు బ్యాటింగ్‌తో రాజస్థాన్ మంచి స్కోరు చేసింది. టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు వచ్చిన ఆ టీమ్‌కు ఆరంభంలోనే వరుస ఎదురుదెబ్బలు తగిలాయి. సిరాజ్ తొలి ఓవర్లోనే ఓపెనర్ జైస్వాల్ (1)ను ఔట్ చేయగా.. రెండో ఓవర్లో జురెల్ (7)ను రబాడ వెనక్కుపంపడంతో ఆర్ఆర్ 9/2తో నిలిచింది. అయితే నాలుగో నంబర్‌లో వచ్చిన జడేజాతో కలిసి వైభవ్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే బాధ్యత తీసుకున్నారు. పిచ్ నుంచి అంతగా సహకారం లేకపోవడం.. ప్రత్యర్థి పేసర్లు షార్ట్ పిచ్ బాల్స్, బౌన్సర్లతో పరీక్షిస్తుండగా.. వైభవ్ తన శైలికి భిన్నంగా జాగ్రత్తగా ఆడుతూనే చెత్త బాల్స్‌ను మాత్రం శిక్షించాడు. సిరాజ్ వేసిన మూడో ఓవర్లోనే మూడు ఫోర్లు కొట్టిన అతను రబాడ వేసిన 153 కి.మీ స్పీడ్ బంతిని స్ట్రెయిట్ సిక్స్‌గా కొట్టడం ఇన్నింగ్స్‌కే హైలైట్. మరో ఎండ్‌లో జడేజా కూడాక్రమం తప్పకుండా బౌండరీలు రాబట్టడంతో పవర్‌ప్లేను రాజస్థాన్ 70/2తో ముగించింది.

చేతి నొప్పి కారణంగా జడేజా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగ్గా.. తొమ్మిదో ఓవర్లో బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ పరాగ్ (11) 4,6 కొట్టి ఔటయ్యాడు. అతనితో పాటు షనక (3)ను హోల్డర్ పెవిలియన్ చేర్చగా.. మధ్యలో ప్రసిధ్ బౌలింగ్‌లో వైభవ్ ఇచ్చిన క్యాచ్‌ను సుదర్శన్ డ్రాప్ చేశాడు. అప్పటికి 46 రన్స్ వద్ద ఉన్న వైభవ్ ఈ చాన్స్‌ను సద్వినియోగం చేసుకున్నాడు. ప్రసిధ్ బౌలింగ్‌లో ఆర్చర్ (7) కీపర్‌కు చిక్కడంతో 118/5తో నిలిచిన జట్టును సూర్యవంశీ ఆదుకున్నాడు. 31 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్న అతను మళ్లీ బ్యాటింగ్‌కు వచ్చిన జడేజా తోడుగా స్పీడు పెంచాడు. రబాడ, సిరాజ్ ఓవర్లలో ఒక్కో సిక్స్ కొట్టిన వైభవ్.. హోల్డర్ వేసిన 16వ ఓవర్లో 4,6,6తో స్కోరు 150 దాటించాడు. ఆపై స్పిన్నర్ సుందర్‌ను రెండు సిక్సర్లతో శిక్షించిన వైభవ్ సెంచరీ చేసేలా కనిపించాడు. కానీ, 18వ ఓవర్లో రబాడ షార్ట్ పిచ్ బాల్‌ను అప్పర్ కట్ షాట్ ఆడిన సూర్య.. ప్రసిధ్‌కు క్యాచ్ ఇచ్చి నిరాశగా వెనుదిరిగాడు. ప్రసిధ్ బౌలింగ్‌లో రెండు ఫోర్లు, స్పిన్నర్ రషీద్ వేసిన ఆఖరి ఓవర్లో నాలుగు సిక్సర్లతో విరుచుకుపడిన ఫెరీరా జట్టుకు మంచిస్కోరు అందించాడు.

**సంక్షిప్త స్కోర్లు**

రాజస్థాన్: 20 ఓవర్లలో 214/6 (వైభవ్ 96, జడేజా 45 నాటౌట్, హోల్డర్ 2/27, రబాడ 2/35);

గుజరాత్: 18.4 ఓవర్లలో 219/3 (గిల్ 104, సుదర్శన్ 58, ఆర్చర్ , బర్గర్1/35) 1 ఒక సీజన్‌లో 700 పరుగులు పూర్తి చేసిన తొలి అన్‌క్యాప్డ్ ప్లేయర్ వైభవ్. 2023లో జైస్వాల్ సాధించిన 625 పరుగుల రికార్డును అధిగమించాడు. 19 19 ఈ సీజన్ ప్లేఆఫ్స్ రెండు మ్యాచ్‌ల్లో వైభవ్ కొట్టి సిక్సర్లు, ఒక ఎడిషన్ ప్లేఆఫ్స్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన బ్యాటర్‌గా వృద్ధిమాన్ సాహా ( 2014లో 11) రికార్డును దాటేశాడు. 521 ఈ ఐపీఎల్ పవర్‌ప్లేలో వైభవ్ సూర్యవంశీ చేసిన రన్స్. ఒక సీజన్‌లో అత్యధిక పవర్ ప్లే రన్స్ చేసిన బ్యాటర్‌గా 2016లో వార్నర్ నెలకొల్పిన 467 పరుగుల రికార్డును బద్దలు కొట్టాడు. 5 ఐపీఎల్‌లో గిల్‌కు ఇది ఐదో సెంచరీ. కెప్టెన్‌గా రెండోది.

# జొకోవిచ్‌కు షాక్



పారిస్ : ఫ్రెంచ్ ఓపెన్‌లో మరో సంచలనం. సెర్బియా లెజెండరీ ప్లేయర్ నొవాక్ జొకోవిచ్ అనామక ఆటగాడి చేతిలో ఓడి మూడో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. తొలి రెండు సెట్లు గెలిచి 2-0తో నిలిచిన దశలో వరుసగా మూడు సెట్లు కోల్పోయి అనూహ్యంగా ఓడిపోయాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో 28వ సీడ్ జావో ఫోన్సెకా (బ్రెజిల్) 4-6, 4-6, 6-3, 7-5, 7-5తో మూడో సీడ్ జొకోవిచ్‌కు షాకిచ్చాడు. స్పెయిన్ ఆటగాడు పాబ్లో కారెనో బుస్టా 7-6 (0), 7-5, 3-6, 6-4తో అర్జెంటీనా ప్లేయర్ తిరాంతెను ఓడించగా.. రుబ్లెవ్ 7-5, 7-6 (7/2), 7-6 (7/2)తో నునో బోరగ్స్‌పై విజయం సాధించాడు. మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో పోలెండ్ స్టార్ స్వియాటెక్ 6-4, 6-4తో మగ్దా లినెట్‌ను ఓడించగా.. ఏడో సీడ్ స్వితోలినా 6-2, 6-3తో కార్బాచ్‌పై, ఎనిమిదో సీడ్ ఆంద్రీవా 6-4, 6-2తో మేరీ బౌజ్కోవాపై నెగ్గి ముందంజ అయితే, అన్‌సీడెడ్ టీచ్‌మన్ 6-1, 7-5తో గత సీజన్ రన్నరప్ కరోలినా ముచోవాకు షాకిచ్చింది.



# అయిదుగురు హీరోయిన్లతో సినిమా?

గమ్యం, వేదం, కృష్ణంవందే జగద్గురుమ్, కంచె వంటి గొప్ప సినిమాలను తెరకెక్కించి అభిరుచి గల దర్శకుడిగా కితాబులందుకున్నారు దర్శకుడు క్రిష్ జాగర్లమూడి. సందేశాత్మక కథలకు వాణిజ్యఅంశాలను జోడించి జనరంజక చిత్రాలను అందించడం క్రిష్ ప్రత్యేకత. అయితే.. గత కొన్నేళ్లుగా క్రిష్ కెరీర్ సరైన ట్రాక్‌లో లేదు. ఎన్టీయార్ కథానాయకుడు, మహానాయకుడు, కొండపొలం, ఘాటీ చిత్రాల ఫలితాలు ఆయన కెరీర్‌పై తీవ్రమైన ప్రభావాన్నే చూపాయి. అందుకే.. గత వైభవాన్ని దక్కించుకునేందుకు ఈ సారి పకడ్బందీ వ్యూహంతో ముందుకెళ్తున్నారట క్రిష్. ఈ సారి కాస్టింగ్‌పై కాకుండా కథపైనే ఎక్కువ శ్రద్ధపెట్టి, ఓ విభిన్నమైన కాన్సెప్ట్‌ని ప్రేక్షకులకు అందించే ప్రయత్నాల్లో ఆయన బిజీగా ఉన్నారట. అయిదుగురు అమ్మాయిల నేపథ్యంతో కూడిన ఓ కథను ఆయన ప్రస్తుతం తెరకెక్కిస్తున్నట్టు తెలిసింది. ఈ అయిదు ప్రధాన భూమికలకు అయిదుగురు యంగ్ హీరోయిన్లను ఎంపిక చేసినట్టు వినికిడి. ఇప్పటికే ఎలాంటి హడావిడి లేకుండా చిత్రీకరణ కూడా మొదలైంది. క్రిష్ గత చిత్రాల మాదిరిగానే ఆలోచింపజేసే కథ, కథనాలతో ఈ సినిమా ఉంటుందట. ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రాజీవ్‌రెడ్డి, జాగర్లమూడి సాయిబాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



# పెద్ది మేకర్స్ అలర్ట్.. ఆ ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు..!

రామ్ చరణ్ పెద్ది మేకర్స్ రిలీజ్‌కు ముందు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటికే మూవీ పైరసీ, లీక్ విషయంలో మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా.. వీరికి అనుకూలంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సినిమాకు సంబంధించిన సన్నివేశాలు, పాటలు ఇంటర్నెట్‌లో అప్‌లోడ్ చేయడం, ప్రసారం చేయడం, కాపీ చేయడాన్ని నిరోధిస్తూ న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. దీంతో ముందస్తు లీక్‌లు కాకుండా చర్యలకు మార్గం సుగమమైంది. తాజాగా పెద్దిపై అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చర్యలకు దిగింది. ఈ సినిమాపై కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలతో ఇద్దరిపై కేసు నమోదైనట్లు తెలుస్తోంది. గుంటూరు, హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యువకులు కావాలనే నెగెటివ్ ప్రచారం చేస్తున్నట్లు పెద్ది టీమ్ దృష్టికి వచ్చింది. దీంతో పోలీసులకు మేకర్స్ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు సోషల్ మీడియా కార్యకలాపాలపై పెద్ది మూవీ టీమ్ కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. బుచ్చిబాబు డైరెక్షన్‌లో వస్తోన్న పెద్ది మూవీ జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది.



# ఈ అభిమానం ఇలాగే ఉండాలి


శ్రద్ధాకపూర్ కొత్త రికార్డును నమోదు చేసింది. మే 2026 లెక్కల ప్రకారం ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధిక ఫాలోవర్లు కలిగిన కథానాయికగా ఆమె అవతరించింది. తాజాగా బయటకొచ్చిన అత్యధిక ఫాలోవర్లు కలిగిన టాప్ హీరోయిన్ల అధికారిక ఇన్‌స్టా జాబితాలో, మిగతా స్టార్ హీరోయిన్లందరినీ వెనక్కి నెట్టి, ఏకంగా 93 మిలియన్లు అనగా, 9కోట్ల 3లక్షల ఫాలోవర్లతో టాప్‌లో నిలిచింది శ్రద్ధాకపూర్. ఈ పోటీలో శ్రద్ధాకు.. ప్రియాంక చోప్రా గట్టి పోటీనే ఇచ్చింది. 92 మిలియన్ల ఫాలోవర్లతో ఆమె రెండో స్థానంలో నిలవడం విశేషం. ఈ విజయంపై ఇన్‌స్టా ద్వారా శ్రద్ధా ఆనందాన్ని వ్యక్తం చేస్తూ.. 'మీ అభిమానమే నాకు కొండంత బలం. ఈ అభిమానం కలకాలం ఇలాగే ఉండాలి' అని పేర్కొన్నది. ఎప్పటికప్పుడు మారే ఈ నంబర్ల రేస్‌లో ఈసారి మాత్రం శ్రద్ధా కపూర్ నంబర్‌వన్ అనిపించుకుంది. వచ్చే ఏడాది ఈ స్థానంలో మరో హీరోయిన్ ఉండొచ్చు.

# ఈ ప్రేమకథ 'రోమాంచకం'





అర్జున్ రెడ్డి, కబీర్‌సింగ్, యానిమల్ వంటి పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్స్‌ను అందించిన నిర్మాణ సంస్థ భద్రకాళీ పిక్చర్స్ తెరకెక్కిస్తున్న తాజా తెలుగు చిత్రానికి 'రోమాంచకం' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. అగ్ర దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పకుడిగా వ్యవహరిస్తున్న ఈ చిత్రాన్ని ఆయన సోదరుడు ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. సుమంత్ ప్రభాస్, అనంతిక సనీల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ సినిమా ద్వారా వేణుగోపాల్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. శుక్రవారం ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు. యూత్‌ఫుల్ అండ్ పొయెటిక్ ఫీల్‌తో పోస్టర్ ఆకట్టుకునేలా ఉంది. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ అనే ట్యాగ్‌లైన్ కథపై ఆసక్తినిరేకెత్తిస్తున్నది. నవ్యత కలబోసిన ప్రేమకథా చిత్రమిదని, త్వరలో మరిన్ని అప్‌డేట్స్ అందిస్తామని మేకర్స్ తెలిపారు. ఉపేంద్ర లిమయె, వెంకటేష్ కాకుమాను, నరేంద్ర రవి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వాసుకి వైభవ్, సమర్పణ: సందీప్‌రెడ్డి వంగా, నిర్మాత: ప్రణయ్ రెడ్డి వంగా, రచన-దర్శకత్వం: వేణుగోపాల్ రెడ్డి.



# విజయ్ దేవరకొండ బాలీవుడ్ చిత్రం?

పాన్ ఇండియా సినిమాల ద్వారా దేశవ్యాప్తంగా ప్రేక్షకులకు సుపరిచితుడయ్యారు అగ్రహీరో విజయ్ దేవరకొండ. తాజా సమాచారం ప్రకారం ఆయన తొలి హిందీ స్ట్రైయిట్ చిత్రానికి సన్నాహాలు జరుగుతున్నట్లు తెలిసింది. వైవిధ్య చిత్రాల దర్శకుడు విక్రమ్ కె కుమార్ డైరెక్షన్‌లో విజయ్ దేవరకొండ ఓ చిత్రాన్ని చేయబోతున్నారని గతకొంతకాలంగా వార్తలొస్తున్నాయి. యూవీ క్రియేషన్స్ ఈ సినిమా నిర్మాణం చేపట్టనుందని ప్రచారం జరిగింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ చిత్రాన్ని బాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మ్యాడ్‌డాక్ ఫిల్మ్స్ తెరకెక్కించనుందని సమాచారం. ఇటీవల ముంబయిలోని ఆ సినిమా ఆఫీసులో విజయ్ దేవరకొండ, విక్రమ్ కె కుమార్ ఇద్దరూ కనిపించడంతో ఈ వార్తలకు మరింతగా బలం చేకూరినట్లయింది. ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ జరుగుతున్నదని, ఓ యూనివర్సల్ కాన్సెప్ట్‌తో దర్శకుడు విక్రమ్ కె కుమార్ ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నారని సమాచారం. అయితే ఈ విషయంలో స్పష్టత రావాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. ప్రస్తుతం విజయ్ దేవరకొండ 'రణబాలి' 'రౌడీ జనార్ధన' చిత్రాల షూటింగ్స్‌లో బిజీగా ఉన్నారు. ఈ ఏడాదిలోనే ఇవి ప్రేక్షకుల ముందుకురానున్నాయి.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **7036644111, 9490140565**

# స్వచ్ఛ గోదావరి.. పవిత్ర పుష్కరాలు



### కాలుష్యరహిత గోదావరి పుష్కర నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక

- ఆరు జిల్లాల్లో 262 పుష్కర పంచాయతీల గుర్తింపు
- మురుగు రహిత పంచాయతీలుగా తీర్చిదిద్దాలని ఆదేశం
- మురుగు నీరు నేరుగా గోదావరిలో కలవకుండా ప్రత్యేక పర్యవేక్షణ
- మున్సిపాలిటీ సామర్థ్యానికి తగిన విధంగా మురుగు శుద్ధి ప్లాంట్లు
- పీసీబీ రూ. 100 కోట్ల నుంచి కూడా నిధుల వినియోగం
- జీవనదిని కలుషితం చేస్తున్న 104 మిలియన్ లీటర్ల మురుగు
- ప్రతి రోజూ గోదావరిలో 8.38 మిలియన్ లీటర్ల మురుగు
- ఆంధ్ర పేపర్స్ వెదజల్లే రోజు వారీ కాలుష్యమే 32 మిలియన్ లీటర్లు
- నిత్యం గోదావరిలో 13.24 మిలియన్ లీటర్ల ఆక్వా కాలుష్యం
- పారిశ్రామిక కాలుష్య నివారణకు నిరంతర తనిఖీలు
- ఆర్టీజీఎస్ తరహా కంట్రోల్ రూం ద్వారా నిరంతర ప్రత్యక్ష పర్యవేక్షణ
- పర్యావరణ పరిరక్షణ టాస్క్ ఫోర్స్‌కి కంట్రోల్ రూం బాధ్యతలు
- అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక ఆదేశాలు

**రాజమహేంద్రవరం, మే 29:** కాలుష్య రహిత గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం 'స్వచ్ఛ గోదావరి – పవిత్ర పుష్కరాలు' పేరిట రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కే పవన్ కళ్యాణ్ కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారు. పుష్కరాల నిర్వహణ నిమిత్తం ఆరు జిల్లాల పరిధిలో గుర్తించిన 262 పంచాయతీలను మురుగు రహితంగా తీర్చిదిద్దడంతో పాటు గోదావరి నదిలో కాలుష్య కారక వ్యర్థాల విడుదలను నిలువరించేందుకు నిరంతర పర్యవేక్షణా వ్యవస్థలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో మురుగు నిర్వహణతో పాటు పారిశ్రామిక కాలుష్య పర్యవేక్షణకు ఆర్టీజీఎస్ తరహా కంట్రోల్ రూం ఏర్పాటు చేసి, నిరంతర ప్రత్యక్ష పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. పర్యవేక్షణ బాధ్యతను ప్రధాన నదుల కాలుష్య నివారణకు ఏర్పాటు చేసిన అత్యున్నత స్థాయి టాస్క్ ఫోర్స్ కి అప్పగించనున్నట్టు స్పష్టం చేశారు. గ్రామాలు, పట్టణాల్లో చేపట్టాల్సిన మురుగు నివారణా చర్యలపై అధికారులకు పవన్ కళ్యాణ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. అందు కోసం అవసరం అయితే వీబీ జీ రాం జీ, స్వచ్ఛాంధ్ర, కాలుష్య నియంత్రణ మండలి నిధులను కూడా వినియోగించుకోవాలని తెలిపారు.

#### మ్యాజిక్ డ్రెయిన్లు, కమ్యూనిటీ సోక్ పిట్స్ నిర్మాణం

గోదావరి పరీవాహక ప్రాంతంలోని ఆరు జిల్లాల పరిధిలో పుష్కరాల నిర్వహణ నిమిత్తం 262 పుష్కర పంచాయతీలను గుర్తించారు. ఉప ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, అటవీ, పర్యావరణ శాఖల ముఖ్యకార్యదర్శి, కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శుల సమన్వయ సమావేశం నిర్వహించి 262 పంచాయతీలను పుష్కరాల నాటికి మురుగు విడుదల రహిత పంచాయతీలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ప్రతి రోజూ గోదావరిలో గ్రామీణ ప్రాంతాల మురుగు 8.38 మిలియన్ లీటర్లు కలుస్తున్నట్లు గుర్తించారు. ఈ మురుగు నిర్వహణకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గృహ వినియోగ మురుగు నీటి నియంత్రణ, నిర్వహణ కోసం వీబీ జీ రాం జీ పథకం కింద మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. బ్లాక్ వాటర్ నిర్వహణ కోసం సామాజిక ఇంకుడు గుంతల తరహా నిర్మాణాలు, ఇండివిడ్యువల్ హౌస్ హోల్డ్ ట్విన్ పిట్స్ చేపట్టాలని తెలిపారు. కాలువలు, డ్రెయిన్ల ద్వారా మురుగు నేరుగా గోదావరి నదిలోకి విడుదల కాకుండా పంచాయతీ సిబ్బందితో నిరంతర పర్యవేక్షణా బృందాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

#### ప్రమాదకర స్థితికి గోదావరి పరీవాహక కాలుష్యం

మున్సిపాలిటీలు, పారిశ్రామిక, గ్రామీణ ప్రాంతాలతో పాటు గోదావరి నదిలో కలుపుతున్న ఆక్వా కాలుష్యం ప్రమాదకర స్థితికి చేరినట్టు పీసీబీ అధికారుల పరిశీలనలో తేలింది. ఆరు జిల్లాల పరిధిలోని మున్సిపాలిటీల నుంచి సుమారు రోజుకి 104 మిలియన్ లీటర్ల మురుగునీరు జీవ నదిని కలుషితం చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతి రోజు మరో 8.38 మిలియన్ లీటర్ల మురుగు నీరు, పారిశ్రామిక వ్యర్థాలు కూడా పెద్ద ఎత్తున నదిలో కలిపేస్తున్నారు. అందులో ఒక్క ఆంధ్ర పేపర్ మిల్స్ నుంచే రోజుకి 32 మిలియన్ లీటర్ల వరకు వ్యర్థాలు విడుదల అవుతున్నాయి. కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి నిత్యం విడుదల అవుతున్న 13.24 మిలియన్ లీటర్ల ఆక్వా కాలుష్యం వీటికి అదనం. ప్రజారోగ్యం, భద్రత దృష్ట్యా గోదావరి జలాలను కలుషితం చేస్తున్న మురుగు, పారిశ్రామిక, ఆక్వా వ్యర్థాల రూపంలో వెదజల్లే కాలుష్య నివారణకు అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

#### మున్సిపాలిటీల్లో వ్యర్థ జల శుద్ధి కేంద్రాల నిర్మాణం

గోదావరి తీర ప్రాంత పట్టణాల నుంచి విడుదల అయ్యే మురుగు నీటిని శుద్ధి చేయకుండా నేరుగా గోదావరి నదిలో కలిపేస్తున్నట్టు గుర్తించారు. ప్రధాన పట్టణాలైన రాజమహేంద్రవరం కార్పొరేషన్, కొవ్వూరు, నరసాపురం, తణుకు మున్సిపాలిటీలు నుంచి పెద్ద ఎత్తున మురుగు నీరు గోదావరిలోకి విడుదల అవుతోంది. ప్రస్తుతం రాజమహేంద్రవరం కార్పోరేషన్ నుంచి రోజుకి 75 మిలియన్ లీటర్ల మురుగు ఉత్పత్తి అవుతుండగా అందులో 50 మిలియన్ లీటర్లు నేరుగా గోదావరి నదిలోకి విడుదల చేస్తున్నారు. తణుకు మున్సిపాలిటీల నుంచి రోజుకి సుమారు 11.1 మిలియన్ లీటర్లు, భీమవరం నుంచి 14 మిలియన్ లీటర్లు, నరసాపురం నుంచి 8.5 మిలియన్ లీటర్లు, కొవ్వూరు నుంచి 6 మిలియన్ లీటర్ల వ్యర్థ జలాలు యనమదుర్రు, గోస్తనీ తదితర డ్రెయిన్ల ద్వారా గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ఇతర మున్సిపాలిటీల నుంచి కూడా గోదావరి నదిలోకి నిత్యం మురుగునీటి విడుదల కొనసాగుతోంది. పట్టణ ప్రాంతాల నుంచి విడుదలయ్యే మురుగునీటిని శుద్ధి చేసిన అనంతరం మాత్రమే గోదావరిలోకి విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ సూచించారు. ఇందు కోసం ప్రతి మున్సిపాలిటీ పరిధిలో సామర్థ్యానికి అనుగుణంగా మురుగు శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే గోదావరి కాలుష్య నియంత్రణ నిమిత్తం కాలుష్య నియంత్రణ మండలి ద్వారా మంజూరు చేసిన రూ. 100 కోట్ల నిధులతో పాటు అవసరం అయితే స్వచ్ఛాంధ్ర నిధులు కూడా వినియోగించుకుంటూ దశల వారీగా ప్రణాళికలు అమలు చేయాలని తెలిపారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగంపై దశల వారీ నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని గోదావరి పరివాహక మున్సిపాలిటీలన్నింటిలో ఆదేశాలు జారీ చేశారు. పర్యావరణ హిత ప్రత్యామ్నాయాల వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు.

#### పారిశ్రామిక కాలుష్య నివారణకు నిరంతర పర్యవేక్షణ

గోదావరిలో కలుపుతున్న పారిశ్రామిక కాలుష్య నివారణకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నిరంతర తనిఖీలు నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. వాయు కాలుష్య నివారణకు పారిశ్రామిక వర్గాలు తగినంత పచ్చదనాన్ని పెంపొందించే ఏర్పాటు చేయాలి. మురుగు శుద్ధి, ద్రవరూప కాలుష్య నియంత్రణ కోసం అన్ని పరిశ్రమలు ఆధునిక సాంకేతికతతో కూడిన వ్యవస్థలను తప్పని సరిగా ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు నిర్దేశం చేశారు. స్వచ్ఛమైన గోదావరి జలాల్లో భక్తులంతా పవిత్రమైన పుష్కరాలు జరుపుకునేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని తెలిపారు. పుష్కరాలకు ముందుగానే అన్ని విధాలా చర్యలు తీసుకోవాలని, గ్రామీణ వ్యర్థాల తొలగింపు పర్యవేక్షణకు ఆర్టీజీఎస్ తరహా కంట్రోల్ రూము ఏర్పాటు చేసి వ్యర్థాల శుద్ధి, విడుదలపై నిరంతర సమాచారాన్ని తెలుసుకునే విధంగా ప్రత్యక్ష పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. కంట్రోల్ రూంలో ప్రాంతాల వారీగా స్క్రీన్లు ఏర్పాటు చేసి, వాటిని సీసీ కెమెరాలతో అనుసంధానించాలని తెలిపారు. ఎక్కడెక్కడ మురుగు శుద్ధి చేస్తున్నారు. ఎక్కడైనా నేరుగా గోదావరి నదిలోకి మురుగుని వదులుతున్నారా తెలుసుకుని, ఎప్పటి కప్పుడు ఆదేశాలు ఇచ్చే వ్యవస్థలు ఏర్పాటు చేయాలని సూచించారు. పరిశ్రమల మురుగు నీటి నిర్వహణ పర్యవేక్షణకు ప్రత్యేక సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. రాష్ట్రంలో ప్రధాన నదుల కాలుష్య నివారణకు ఏర్పాటు చేసిన పర్యావరణ పరిరక్షణ టాస్క్ ఫోర్స్ కు కంట్రోల్ రూం నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నట్టు తెలిపారు.




## మహిళా సాధికారతకు ప్రాధాన్యం

### చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ చారిత్రాత్మక నిర్ణయం

### మహిళలను నాయకత్వ శక్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యం : హోంమంత్రి

**అమరావతి, మే 29:** మహిళా సాధికారతకు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం టికెట్లు కేటాయించాలని మహానాడు వేదికగా తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. మహిళలను కేవలం ఓటర్లుగానే కాకుండా నిర్ణయాధికారులు, నాయకత్వ శక్తిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పార్టీ పనిచేస్తోందన్నారు. మహిళలకు కుటుంబ ఆస్తుల్లో సమాన హక్కులు కల్పించడం నుంచి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయడం వరకు ఎన్టీఆర్ తీసుకొచ్చిన సంస్కరణలు దేశానికి మార్గదర్శకంగా నిలిచాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డ్వాక్రా సంఘాల ద్వారా మహిళల ఆర్థిక సాధికారతకు బలం చేకూర్చారని పేర్కొన్నారు. మహిళలు ఉద్యోగాలు కోరుకునే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళల గౌరవం, భద్రత, రాజకీయ ప్రాతినిధ్యం కోసం తెలుగుదేశం పార్టీ భవిష్యత్తులో కూడా కట్టుబడి పనిచేస్తుందని వంగలపూడి అనిత స్పష్టం చేశారు.

## శ్రీవాణి దర్శన టికెట్ల కేటాయింపులో మార్పులు




**తిరుమల, మే 29:** భక్తుల సౌకర్యార్థం శ్రీవాణి ట్రస్ట్‌కు సంబంధించిన దర్శన టికెట్ల కేటాయింపులో పలు మార్పులు చేస్తూ టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రోజుకు 1500 శ్రీవాణి టికెట్లను టీటీడీ ఆన్ లైన్ ద్వారా అందుబాటులో ఉంచడం జరిగింది. వీటిలో 500 దర్శన టికెట్లను మూడు నెలల ముందుగా ఆన్ లైన్ లో అడ్వాన్స్ బుకింగ్ కింద అందుబాటులో ఉంచడం జరిగింది. అదేవిధంగా మరో 200 శ్రీవాణి దర్శన టికెట్లను తిరుపతి విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కింద జారీ చేయడం జరుగుతోంది. ప్రస్తుతం రోజువారీ కరెంట్ బుకింగ్ కోటాలో అందుబాటులో ఉన్న 800 శ్రీవాణి దర్శన టికెట్లలో ఇప్పటికే రూ.10 వేలు విరాళం చెల్లించి దర్శన టికెట్ కోసం వేచి ఉన్న దాతలకు ప్రతిరోజూ 300 టికెట్లు ప్రత్యేకంగా కేటాయించాలని నిర్ణయించడం జరిగింది. ఈ సదుపాయం 2025 మే 1 నుండి విరాళం చెల్లించిన అర్హులైన దాతలకు వర్తించనుంది. ఈ టికెట్లు ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు విడుదల చేయబడతాయి. మధ్యాహ్నం 1 గంటలోపు బుక్ చేసుకున్న భక్తులకు అదే రోజు సాయంత్రం 4 గంటలకు దర్శనం కల్పించబడుతుంది. కాగా ఈ విధానం జూన్ 10వ తేది నుండి అమలులోకి రానుంది. ఈ కోటాలో బుకింగ్ కాని టికెట్లను తిరిగి కరెంట్ బుకింగ్ కోటాలో కలపబడతాయి. ఈ విధానం 2027 మార్చి 31 వరకు అమల్లో ఉంటుంది.

## అర్ధరాత్రి బస్సు బోల్తా

### వైఎస్సార్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

### పలువురు ప్రయాణికులకు గాయాలు

### క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలింపు

### ప్రమాద కారణాలపై పోలీసుల విచారణ

**కడప, మే 29:** ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్ జిల్లాలో అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గోపవరం మండలం పిపికుంట సమీపంలో ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు అదుపుతప్పి బోల్తాపడింది. విజయవాడ నుంచి కడప వైపు వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 30 మందికి పైగా ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ఘటనతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. స్థానికులు, పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పలువురు ప్రయాణికులు గాయపడగా, కొందరికి తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను బస్సు నుంచి బయటకు తీసి 108 అంబులెన్సుల ద్వారా సమీప ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వైద్యులు వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. డ్రైవర్ నిద్రమత్తు, అతివేగం లేదా సాంకేతిక లోపం కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## పోలవరం అడవుల్లో పులి సంచారంపై నిరంతర పర్యవేక్షణ

- హనుమాన్ బృందాలను అప్రమత్తం చేయాలని ఆదేశం
- క్షేత్ర స్థాయి పర్యవేక్షణకు అటవీ శాఖ ఉన్నతాధికారులు
- అత్యాధునిక సాంకేతికత సహకారంతో పులి కదలికలపై నిఘా
- అటవీ సరిహద్దు గ్రామాల్లో పులి సంచారంపై అప్రమత్తతకు ఆదేశం




**అమరావతి, మే 29 :** పోలవరం జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచారం పట్ల నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ అటవీ శాఖ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. పులి కదలికలపై ఆధునిక సాంకేతికతతో కూడిన పర్యవేక్షణ వ్యవస్థలను అందుబాటులో ఉంచాలని సూచించారు. అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలకు ఎప్పటికప్పుడు పులి కదలికల సమాచారం చేరవేస్తూ, అప్రమత్తం చేయాలని తెలిపారు. బుధవారం రాత్రి అటవీ సరిహద్దు చికిలింత పంచాయతీ పరిధిలోని పశువుల కొట్టాల్లో దూడలపై పులి దాడి చేసిన సంఘటనపై పవన్ కళ్యాణ్ అటవీ అధికారులతో సమీక్షించారు. పులి దాడిలో తొమ్మిది దూడలు మృతి చెందడం పట్ల విచారం వ్యక్తం చేశారు. పోలవరం జిల్లా పరిధిలోని అటవీ ప్రాంతంలో పులి సంచారం ఉన్నట్టు ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు తెలియజేశారు. ప్రస్తుతం తిమ్మాపురం రిజర్వ్ ఫారెస్ట్ లో పులి కదలికలను గుర్తించినట్టు, ప్రస్తుతం అటవీ ప్రాంతంలో సంచరిస్తూనే, గ్రామాలకు సమీపంగా వస్తున్నట్టు అధికారులు శ్రీ పవన్ కళ్యాణ్ గారికి వివరించారు. అలాంటి పరిస్థితుల్లోనే అడవికి కేవలం 300 మీటర్ల దూరంలోని ఆయిల్ ఫాం తోటలో ఉన్న పశువుల పాకపై దాడి చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "పులి కదలికలపై క్షేత్ర స్థాయి సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ఎప్పటికప్పుడు సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూ ఉండాలి. మనుషులు, పశువుల ప్రాణాలకు ఎలాంటి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. గతంలో పులి జనారణ్యంలోకి వచ్చిన సందర్భంగా అటవీ సిబ్బంది ఎంతో చాకచక్యంగా వ్యవహరించారని ఆయన ప్రశంసించారు.

#### హనుమాన్ బృందాలతో 24 గంటల పర్యవేక్షణ

పులి సంచరిస్తున్న అటవీ సమీప గ్రామాల్లో హనుమాన్ బృందాలతో 24 గంటల పర్యవేక్షణ ఏర్పాటు చేయండి. అవసరం అయితే అదనపు హనుమాన్ టీంలను రంగంలోకి దించండి. తీసుకుంటున్న చర్యల పట్ల అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ స్వీయ పర్యవేక్షణ ఉండాలి. ఈ మొత్తం ఆపరేషన్ పర్యవేక్షణకు అవసరమైన పక్షంలో అటవీశాఖ కేంద్ర కార్యాలయం నుంచి సీనియర్ అధికారిని ఘటనా స్థలికి పంపాలి. అధునాతన సాంకేతికత సాయంతో ప్రతి అడుగును ట్రాక్ చేసే ఏర్పాటు చేయాలి. వన్య ప్రాణి సంరక్షణ నిబంధనల అనుగుణంగా చర్యలు ఉండాలి.

#### పులి సంచార గ్రామల్లో అవగాహనా శిబిరాలు

పులి సంచారం నమోదైన అటవీ పరిసర గ్రామాల్లో క్షేత్ర స్థాయి సిబ్బంది సహకారంతో నిరంతరం అవగాహన శిబిరాలు నిర్వహించాలి. గ్రామస్తులు అవసరం లేకుండా అడవుల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పశువులను అటవీ ప్రాంతానికి సమీపంగా కట్టి ఉంచడం, నిర్లక్ష్యంగా వదిలేయడం చేయకుండా రైతులకు సూచనలు ఇవ్వాలి. వన్య ప్రాణుల సంచారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామాల ప్రజలతో అధికారులు సున్నితంగా, మానవతా దృక్పథంతో వ్యవహరించాలి. బాధితులకు సకాలంలో సహాయం అందించేందుకు సిద్ధంగా ఉండాలి. సమాచారాన్ని చేరవేయడం, ఫిర్యాదులపై స్పందించే అంశంలో నిర్లక్ష్యానికి తావు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పశువుల ప్రాణ నష్టానికి తక్షణ పరిహారం కింద ఇప్పటికే రైతులకి కొంత మొత్తం అందజేశాం. పశు వైద్యుల నివేదిక వచ్చిన వెంటనే పూర్తి స్థాయి పరిహారం అందించే ఏర్పాటు చేస్తాము"న్నారు.



# మళ్లీ పెరిగిన బంగారం ధరలు

## వెండి కూడా పరుగులు

**హైదరాబాద్, మే 29 :** గత మూడు రోజులుగా వరుసగా తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు నేడు ఒక్కసారిగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో మారుతున్న పరిస్థితులు, డాలర్ మారక విలువల్లో హెచ్చుతగ్గులు, ఇన్వెస్టర్ల కొనుగోళ్లు పెరగడం వంటి కారణాలతో దేశీయ బులియన్ మార్కెట్‌లో పసిడి ధరలు మళ్లీ ఎగబాకాయి. రెండు రోజులుగా తగ్గిన వెండి ధరలు కూడా నేడు పెరుగుదల దిశగా పయనించాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. గురువారం ఉదయం 11 గంటల సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,57,640కు చేరుకుంది. నిన్నటి ధరతో పోలిస్తే రూ.1,580 మేర పెరిగింది. అదే సమయంలో 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,44,500గా నమోదైంది. ఈ ధర నిన్నటి కంటే రూ.1,450 ఎక్కువగా ఉంది. వెండి ధరల్లో కూడా గణనీయమైన పెరుగుదల కనిపించింది. కిలో వెండి ధర నిన్నటితో పోలిస్తే రూ.5 వేల మేర పెరిగి ప్రస్తుతం రూ.2.90 లక్షలకు చేరుకుంది. హైదరాబాద్‌తో పాటు విజయవాడలో కూడా ఇదే ధరలు కొనసాగుతున్నాయి. దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరలు పెరిగాయి. చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,280గా ఉండగా.. 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,46,000గా నమోదైంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,57,640గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,44,500గా ఉంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,57,790 వద్ద కొనసాగుతుండగా.. 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,44,650గా నమోదైంది. దేశవ్యాప్తంగా సగటున 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,550 మేర పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా బంగారం, వెండి ధరల్లో స్వల్ప పెరుగుదల కనిపిస్తోంది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ బంగారం ధర 4,514 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. ఔన్స్ వెండి ధర 75 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇటీవల వరుస తగ్గుదల తర్వాత ఒక్కసారిగా ధరలు పెరగడంతో కొనుగోలుదారుల్లో మళ్లీ ఆందోళన నెలకొంది. ముఖ్యంగా పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో బంగారం ధరలు మరింత పెరిగే అవకాశముందా? అనే చర్చ మార్కెట్‌లో సాగుతోంది. బులియన్ వ్యాపారులు మాత్రం అంతర్జాతీయ పరిస్థితులను బట్టి వచ్చే రోజుల్లో ధరల్లో మరింత హెచ్చుతగ్గులు కనిపించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# ట్రిలియన్ డాలర్ల దిశగా ఆంథ్రోపిక్..

## ఏఐ రంగంలో కొత్త సంచలనం

**న్యూయార్క్, మే 29 :** ప్రపంచ టెక్నాలజీ రంగంలో ఇప్పుడు కృత్రిమ మేధ ఆధారిత సంస్థలదే హవా కొనసాగుతోంది. భవిష్యత్తు మొత్తం ఏఐ టెక్నాలజీ చుట్టూనే తిరుగుతుందనే నమ్మకంతో ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లు భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. ఈ క్రమంలో ప్రముఖ ఏఐ సంస్థ ఆంథ్రోపిక్ మరోసారి వార్తల్లో నిలిచింది. తాజాగా చేపట్టిన భారీ నిధుల సమీకరణలో సంస్థ 65 బిలియన్ డాలర్ల పెట్టుబడులను సేకరించగా.. దాంతో ఆ సంస్థ మార్కెట్ విలువ ఏకంగా 965 బిలియన్ డాలర్లకు చేరినట్లు అంతర్జాతీయ ఆర్థిక వర్గాలు వెల్లడించాయి. ఈ పెట్టుబడి రౌండ్‌లో ప్రపంచ ప్రఖ్యాత ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలు ఆల్టిమీటర్ క్యాపిటల్, డ్రాగోనీర్, గ్రీనోక్స్, సెక్వోయా క్యాపిటల్ వంటి దిగ్గజాలు పాల్గొన్నాయి. ఒక్కో సంస్థ సుమారు రెండు బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టినట్లు సమాచారం. ఏఐ రంగంలో భవిష్యత్తులో మరింత విస్తరణ అవకాశాలు ఉన్నాయని భావించిన ఇన్వెస్టర్లు భారీగా పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నట్లు మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రపంచ టెక్ మార్కెట్‌లో ట్రిలియన్ డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ కలిగిన సంస్థల జాబితా రోజురోజుకూ పెరుగుతోంది. ఏఐ చిప్‌ల తయారీలో ప్రపంచ ఆధిపత్యం కొనసాగిస్తున్న ఎన్విడియా, సెర్చ్ దిగ్గజం ఆల్ఫబెట్, టెక్ దిగ్గజం యాపిల్ సంస్థల మార్కెట్ విలువ ఇప్పటికే నాలుగు ట్రిలియన్ డాలర్లను దాటినట్లు మార్కెట్ డేటా చెబుతోంది. ఇక మైక్రోసాఫ్ట్ సుమారు 3.1 ట్రిలియన్ డాలర్లు, అమెజాన్ 2.8 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువతో దూసుకెళ్తున్నాయి. ఇక ప్రపంచవ్యాప్తంగా ఏఐ విప్లవానికి ప్రతీకగా మారిన చాట్‌జీపీటీ మాతృసంస్థ ఓపెన్ ఏఐ కూడా త్వరలో ఐపీఓకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఆ సంస్థ మార్కెట్ విలువ 800 బిలియన్ నుంచి ట్రిలియన్ డాలర్ల మధ్య ఉండొచ్చని అంచనాలు వెలువడుతున్నాయి. అయితే ఆంథ్రోపిక్ ఇప్పటికే 900 బిలియన్ డాలర్ల మార్కును దాటేయడంతో.. ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువను అందుకునే తొలి ఏఐ స్టార్టప్‌గా నిలిచే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఏఐ ఆధారిత చాట్‌బాట్లు, ఆటోమేషన్, డేటా అనలిటిక్స్, కోడింగ్ టూల్స్, పరిశోధన రంగాల్లో భారీ డిమాండ్ పెరుగుతుండటంతో ఆంథ్రోపిక్ వంటి సంస్థలపై పెట్టుబడిదారుల విశ్వాసం మరింత బలపడుతోంది. ముఖ్యంగా సంస్థ అభివృద్ధి చేస్తున్న ఆధునిక ఏఐ మోడళ్లు, భద్రతా ప్రమాణాలు, కార్పొరేట్ అవసరాలకు అనుగుణంగా రూపొందిస్తున్న సిస్టమ్‌లు మార్కెట్‌లో మంచి ఆదరణ పొందుతున్నాయని టెక్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా టెక్ కంపెనీల మధ్య ఏఐ ఆధిపత్య పోరు మరింత వేడెక్కుతోంది. ఈ పోటీలో భారీ పెట్టుబడులు, కొత్త మోడళ్లు, శక్తివంతమైన డేటా సెంటర్ల నిర్మాణం కీలకంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆంథ్రోపిక్ సాధించిన తాజా మార్కెట్ విలువ ఇప్పుడు ప్రపంచ టెక్ రంగంలో హాట్ టాపిక్‌గా మారింది.




# భారత ఆర్థిక వ్యవస్థపై ఆర్‌బీఐ ధీమా

**ముంబై, మే 30 :** అంతర్జాతీయ స్థాయిలో కొనసాగుతున్న ఆర్థిక అనిశ్చితులు, పశ్చిమాసియా ఉద్రిక్తతలు, వాతావరణ మార్పుల ప్రభావం వంటి సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ.. భారత ఆర్థిక వ్యవస్థ మౌలిక అంశాలు బలంగా ఉన్నాయని భారత రిజర్వ్ బ్యాంక్ స్పష్టం చేసింది. దేశీయ బ్యాంకింగ్ రంగం, కార్పొరేట్ రంగం స్థిరంగా ఉండటంతో పాటు మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెడుతుండటంతో దేశ ఆర్థికాభివృద్ధికి పెద్దగా ఇబ్బందులు ఉండబోవని ఆర్‌బీఐ తన తాజా వార్షిక నివేదికలో పేర్కొంది. శుక్రవారం విడుదల చేసిన వార్షిక నివేదికలో ఆర్‌బీఐ పలు కీలక అంశాలను ప్రస్తావించింది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మందగమనం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు కొనసాగుతున్నప్పటికీ భారత్ అభివృద్ధి పథంలోనే ముందుకు సాగుతుందని అంచనా వేసింది. ముఖ్యంగా దేశీయ వినియోగం, మౌలిక వసతుల రంగంలో పెట్టుబడులు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విస్తరణ భారత వృద్ధికి కీలక బలంగా మారుతున్నాయని పేర్కొంది. ఆర్‌బీఐ నివేదిక ప్రకారం.. కార్పొరేట్ రంగం లాభదాయకంగా కొనసాగుతుండటం, బ్యాంకింగ్ రంగంలో నిరర్థక ఆస్తుల భారం తగ్గడం, రుణాల వృద్ధి స్థిరంగా ఉండటం దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులు కూడా ఆర్థిక చక్రాన్ని ముందుకు నడిపిస్తున్నాయని తెలిపింది. అయితే ఈ ఏడాది ఆర్థికాభివృద్ధిపై అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం ఉండే అవకాశం ఉందని ఆర్‌బీఐ హెచ్చరించింది. ముఖ్యంగా పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు, ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపే అవకాశముందని పేర్కొంది. ఈ కారణంగా ప్రపంచ ఆర్థికాభివృద్ధి కొంత మందగించే అవకాశం ఉన్నప్పటికీ.. భారత్‌పై దాని ప్రభావం పరిమితంగానే ఉండొచ్చని అంచనా వేసింది. భారత్ ఇతర దేశాలతో కుదుర్చుకుంటున్న వాణిజ్య ఒప్పందాలు, సరఫరా గొలుసుల విస్తరణ, తయారీ రంగానికి లభిస్తున్న ప్రోత్సాహం




వంటి అంశాలు దేశ ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు తీసుకురానున్నాయని నివేదికలో పేర్కొన్నారు. ప్రపంచ కంపెనీలు భారత్‌ను ప్రత్యామ్నాయ తయారీ కేంద్రంగా చూడటం కూడా దేశానికి దీర్ఘకాలిక లాభాలను తీసుకురాగలదని విశ్లేషించింది. వ్యవసాయ రంగంపై కూడా ఆర్‌బీఐ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వ్యవసాయ ఉత్పాదకత కొంత తగ్గే అవకాశం ఉందని తెలిపింది. అయితే వానాకాలం రెండో దశలో హిందూ మహాసముద్ర పరిస్థితులు అనుకూలిస్తే ఎల్‌నినో ప్రభావం తగ్గవచ్చని అంచనా వేసింది. దేశంలో తగినంత ధాన్య నిల్వలు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు ఉండటంతో ఆహార భద్రతపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని పేర్కొంది. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా ఎరువులు, ముడి సరకుల ధరలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని ఆర్‌బీఐ వెల్లడించింది. అయినప్పటికీ భారత్ ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఎరువుల సరఫరాను కొనసాగిస్తున్నందున రైతులకు పెద్దగా ఇబ్బందులు ఉండకపోవచ్చని తెలిపింది. ద్రవ్యోల్బణం కూడా అదుపులోనే ఉండే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. ఇక 2026 నుంచి 2031 మధ్య కాలంలో ద్రవ్యోల్బణాన్ని 4 శాతం పరిధిలో నిలబెట్టే లక్ష్యంతో ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వం కలిసి పనిచేస్తున్నాయని నివేదికలో వెల్లడించింది. అదే సమయంలో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ పథకాలను మరింత బలోపేతం చేయడంతో పాటు దేశీయ రిటైల్ రంగంలో డిజిటల్ కరెన్సీ వినియోగాన్ని విస్తరించే యోచనలో ఉన్నట్లు ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితులు కొనసాగుతున్న వేళ.. భారత ఆర్థిక వ్యవస్థపై ఆర్‌బీఐ వ్యక్తం చేసిన ఈ ధీమా ఇప్పుడు ఆర్థిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# రాయల్ ఎన్ఫీల్డ్ నుంచి బుల్లెట్ 650 విడుదల

**న్యూఢిల్లీ, మే 29 :** భారతీయ ద్విచక్ర వాహన మార్కెట్లో ప్రత్యేకమైన క్రేజ్‌ను సొంతం చేసుకున్న ప్రముఖ బైక్ తయారీ సంస్థ రాయల్ ఎన్ఫీల్డ్ మరో సరికొత్త మోడల్‌తో బైక్ ప్రియులను ఆకట్టుకుంది. ఎంతోకాలంగా ఆటోమొబైల్ మార్కెట్లో చర్చనీయాంశంగా మారిన "బుల్లెట్ 650" మోడల్‌ను సంస్థ అధికారికంగా విడుదల చేసింది. క్లాసిక్ బుల్లెట్ స్టైల్‌కు ఆధునిక టెక్నాలజీ, పవర్‌ఫుల్ ఇంజిన్‌ను జోడిస్తూ రూపొందించిన ఈ బైక్ ఇప్పుడు 650సీసీ సెగ్మెంట్‌లో కొత్త ఆకర్షణగా మారింది. కంపెనీ ఈ బైక్ ప్రారంభ ధరను రూ.3.64 లక్షలు (ఎక్స్ షోరూమ్)గా నిర్ణయించింది. క్లాసిక్ డిజైన్‌ను ఇష్టపడే రైడర్లతో పాటు లాంగ్ రైడ్స్, హైవే పర్ఫార్మెన్స్ కోరుకునే వారికి ఈ బైక్ ప్రత్యేక అనుభూతిని అందించనుందని కంపెనీ తెలిపింది. ఈ బుల్లెట్ 650లో 648సీసీ ప్యారలల్ ట్విన్ సిలిండర్ ఇంజిన్‌ను అమర్చారు. ఈ ఇంజిన్ గరిష్ఠంగా 47 హెచ్‌పీ పవర్‌తో పాటు 52.3 ఎన్ఎమ్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. సిటీ రైడింగ్‌తో పాటు హైవేల్లో కూడా స్మూత్ పర్ఫార్మెన్స్ అందించేలా ఇంజిన్‌ను ట్యూన్ చేసినట్లు కంపెనీ పేర్కొంది. ఆరు స్పీడ్ గేర్‌బాక్స్‌తో ఈ బైక్ మరింత మెరుగైన రైడింగ్ అనుభూతిని అందించనుంది. డిజైన్ విషయానికి వస్తే.. రాయల్ ఎన్ఫీల్డ్ తన సాంప్రదాయ రెట్రో స్టైలింగ్‌ను కొనసాగిస్తూ ఆధునిక ఫీచర్లను జోడించింది. పాత బుల్లెట్ మోడళ్లకు గుర్తుగా ఉండే ఫ్యూయల్ ట్యాంక్ డిజైన్, క్లాసిక్ బాడీ లైన్స్, మెటల్ ఫినిషింగ్ ఈ బైక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అదే సమయంలో నేటి తరం వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పలు మోడ్రన్ ఫీచర్లను కూడా అందించారు. రైడింగ్ సమయంలో గేర్ మార్పులను సాఫీగా చేయడానికి స్లిప్పర్ క్లచ్ సదుపాయాన్ని కల్పించారు. రాత్రి ప్రయాణాలకు అనుకూలంగా పవర్‌ఫుల్ ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్‌ను అమర్చారు. వింటేజ్ స్టైల్‌ను గుర్తు చేసే అల్యూమినియం స్విచ్ గేర్ ఈ బైక్‌కు ప్రీమియం లుక్‌ను



తీసుకొచ్చింది. ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌లో అనలాగ్, డిజిటల్ డిస్‌ప్లేలను కలిపి రూపొందించారు. ఇందులో ఫ్యూయల్ లెవల్ ఇండికేటర్, గేర్ పొజిషన్ ఇండికేటర్, ట్రిప్ సమాచారం వంటి స్మార్ట్ ఫీచర్లు అందుబాటులో ఉన్నాయి. రైడర్‌కు అవసరమైన అన్ని ముఖ్యమైన వివరాలు ఒకే స్క్రీన్‌పై కనిపించేలా డిజైన్ చేశారు. 650సీసీ సెగ్మెంట్‌లో ఇప్పటికే ఇంటర్‌సెప్టర్ 650, సూపర్ మీటియోర్ 650 వంటి మోడళ్లతో విజయవంతంగా దూసుకెళ్తున్న రాయల్ ఎన్ఫీల్డ్.. ఇప్పుడు బుల్లెట్ 650తో మరోసారి మార్కెట్లో తన ఆధిపత్యాన్ని చాటుకునే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా క్లాసిక్ లుక్‌తో భారీ ఇంజిన్ పర్ఫార్మెన్స్ కోరుకునే యువతను ఈ బైక్ ఆకర్షించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆటోమొబైల్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం భారత మార్కెట్లో ప్రీమియం మిడ్-సెగ్మెంట్ బైక్‌లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో బుల్లెట్ 650 విడుదల రాయల్ ఎన్ఫీల్డ్‌కు మరింత బలాన్నిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# టయోటా నుంచి సరికొత్త ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ

**న్యూఢిల్లీ, మే 29 :** భారత ఎలక్ట్రిక్ వాహన మార్కెట్లో పోటీ రోజురోజుకూ పెరుగుతున్న వేళ ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ టయోటా కిర్లోస్కర్ మోటార్ తన తొలి పూర్తి స్థాయి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని అధికారికంగా విడుదల చేసింది. "అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా" పేరుతో తీసుకొచ్చిన ఈ సరికొత్త కారు ఆధునిక సాంకేతికత, లగ్జరీ ఫీచర్లు, భారీ డ్రైవింగ్ రేంజ్‌తో ఆటోమొబైల్ రంగంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కంపెనీ ఈ కారులోని టాప్ వేరియంట్ ధరను రూ.23.60 లక్షలు (ఎక్స్ షోరూమ్)గా నిర్ణయించింది. మారుతీ సుజుకీ అభివృద్ధి చేసిన ప్లాట్‌ఫామ్ ఆధారంగా రూపొందిన ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ప్రస్తుతం మార్కెట్లో ఉన్న ఇతర ప్రముఖ ఎలక్ట్రిక్ వాహనాలకు గట్టి పోటీ ఇవ్వనుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ కారులో 61 కిలోవాట్ అవర్స్ సామర్థ్యం గల శక్తివంతమైన బ్యాటరీ ప్యాక్‌ను అమర్చారు. ఒక్కసారి పూర్తి ఛార్జ్ చేస్తే గరిష్ఠంగా 543 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చని కంపెనీ వెల్లడించింది. దీర్ఘ ప్రయాణాలకు అనువుగా రూపొందించిన ఈ వాహనం నగర రోడ్లతో పాటు హైవేలపై కూడా మెరుగైన పనితీరును అందించనుంది. పర్ఫార్మెన్స్ పరంగా కూడా ఈ ఎలక్ట్రిక్ కారు ఆకట్టుకునే విధంగా ఉంది. గరిష్ఠంగా 171 హార్స్ పవర్ శక్తిని, 189 న్యూటన్ మీటర్ల టార్క్‌ను విడుదల చేసే సామర్థ్యాన్ని ఇందులో అందించారు. వేగవంతమైన యాక్సిలరేషన్‌తో పాటు స్మూత్ డ్రైవింగ్ అనుభూతిని కలిగించేలా మోటార్‌ను రూపకల్పన చేశారు. బయటి డిజైన్ విషయానికి వస్తే.. స్పోర్టివ్ లుక్‌తో పాటు ప్రీమియం స్టైలింగ్‌కు ప్రాధాన్యం ఇచ్చారు. కేఫ్ వైట్, నీలిరంగు బ్లాక్, స్పోర్టింగ్ రెడ్ వంటి



ఆకర్షణీయమైన రంగుల్లో ఈ కారును అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆధునిక ఎలక్ట్రిక్ వాహనాలకు తగిన శైలిలో దీని రూపకల్పన ఉందని ఆటో నిపుణులు చెబుతున్నారు. కారు లోపలి భాగాన్ని కూడా ఎంతో విలాసవంతంగా తీర్చిదిద్దారు. నలుపు, గోధుమ రంగుల కలయికతో క్యాబిన్‌ను ప్రీమియంగా రూపొందించారు. ప్రయాణికుల సౌకర్యం కోసం పనోరమిక్ సన్‌రూఫ్, భారీ ఇన్ఫోటైన్‌మెంట్ డిస్‌ప్లే, వెంటిలేటెడ్ సీట్లు, వైర్‌లెస్ ఛార్జింగ్, ప్రీమియం సౌండ్ సిస్టమ్, గాలి శుద్ధి యంత్రం వంటి అత్యాధునిక ఫీచర్లను అందించారు. భద్రత విషయంలో కూడా టయోటా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీలో ఏకంగా ఏడు ఎయిర్‌బ్యాగ్‌లు, 360 డిగ్రీల కెమెరా, ప్రమాదాలను ముందుగానే గుర్తించే ఆధునిక డ్రైవర్ సహాయక సాంకేతికతను అమర్చారు. వాహనం ముందు వచ్చే ప్రమాదాలను గుర్తించి హెచ్చరికలు ఇవ్వడం, అవసరమైతే స్వయంచాలకంగా బ్రేకులు వేయడం వంటి సదుపాయాలు ఇందులో ఉన్నాయి. భారత మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో టయోటా తీసుకొచ్చిన ఈ సరికొత్త ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ సంస్థకు కీలక మోడల్‌గా మారనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భారీ డ్రైవింగ్ రేంజ్, ఆధునిక సాంకేతికత, ప్రీమియం డిజైన్ కారణంగా వినియోగదారులను ఈ వాహనం బలంగా ఆకర్షించే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.